అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 12-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 45 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

నోట్ల లెక్కింపు కొనసాగుతూనే..

- ఆర్టీఐకి ఆర్బీఐ సమాధానం



న్యూఢిల్లీ: రద్దు చేసిన పెద్దనోట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తెలిపింది. సమాచార హక్కు చట్టం ద్వారా చేసిన దరఖాస్తుకు సమాధానంగా ఈ విషయాన్ని ఆర్బీఐ వెల్లడించింది. పెద్దనోట్లు రద్దు చేసి 15నెలలు గడిచిన లెక్కింపు ఇంకా పూర్తి కాకపోవడం గమనార్హం. అయితే లెక్కింపు పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నామని ఆర్‌బీఐ వెల్లడించింది. రద్దు చేసిన నోట్లు ఎన్ని తిరిగి బ్యాంక్‌కు చేరుకున్నాయో కచ్చితంగా తేల్చడానికి గణనతో పాటు సమీక్షలూ నిర్వహిస్తున్నామని తెలిపింది. ఇప్పటివరకు రద్దు చేసిన నోట్లు బ్యాంకులకు 9లో

కూలిన విమానం

71 మంది మృతి

- రష్యాలో ఘోర ప్రమాదం..టేకాఫ్ అయిన కొద్ది సేపటికే..





- రాడార్‌తో తెగిన సంబంధాలు
- మంచు ఎక్కువగా ఉండటం వల్లే..ప్రాథమిక అంచనా

మాస్కో: రష్యాకు చెందిన ప్రయాణికుల విమానం కూలిపోయింది. ఈ ఘటనలో 65 మంది ప్రయాణికులతో పాటు ఆరుగురు విమాన సిబ్బంది మృతి చెందారు. విమాన శకలాలను రెమెన్స్కీ జిల్లాలోని ఆర్గునోవ్ గ్రామంలో గుర్తించారు. అయితే, ఈ ప్రాంతంలో మంచు అధికంగా ఉండటంతో సహాయక బృందాలు ఇక్కడికి చేరుకోవడం ఆలస్యమైంది. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సరటోవ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏఎన్-148 విమానం మాస్కోలోని డుమోడెడ్వో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఉరల్స్‌లోని ఓర్‌స్క్యూ నగరానికి ఆదివారం బయలుదేరింది. విమానంలో 65 మంది ప్రయాణికులతో పాటు ఆరుగురు విమాన సిబ్బంది ఉన్నారు. విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానానికి 9లో

భూ కబ్జా

బినామీ పేర్లతో యథేచ్ఛగా అమ్మకాలు

సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి

ఏడాదిగా పెద్దపల్లి జిల్లాలో కూనారం గ్రామస్తుల పోరాటం

- రెండు వేల ఎకరాల సర్కారు భూములు గాయబ్
- భూస్వాముల గుప్పెట్లోనే అక్రమ దందా

పెద్దపల్లి జిల్లా కూనారం గ్రామంలో నిజాం సర్కారు వదిలేసిన రెండు వేల ఎకరాలకుపైగా భూములను భూస్వాములు తమ గుప్పిట్లోనే పెట్టుకున్నారు. ఆ భూముల్లో కొందరికి సర్కారు పట్టాలిచ్చినప్పటికీ భూమిని మాత్రం చూపలేదు. ఇప్పుడు కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోకుండా.. పేదలకు పంచకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది. మరోవైపు భూస్వాములు ఆ భూములను బినామీ పేర్లతో ఇతరులకు అమ్మేసుకుంటున్నారు.





నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కువ భాగం భూమి నిజాం సర్కార్ ఆధీనంలోనే ఉండేది. ఆ కాలంలో రైతులు, కూలీలతో ఖాతాదారులు(సాగుదారులు) సాగు చేయించి సర్కారుకు పన్నులు(కప్పం) కట్టేవారు. 1954 సేతువారు ప్రకారం (పర్మినెంట్ భూమి రికార్డు) కూనారంలో నిజాంకు చెందిన పోరంబోకు(పశువులకు మేత కోసం ఉంచిన భూములు)తో పాటు ఖారజ్‌ఖాతా, గయిరాన్ భూములు 2,600 ఎకరాల వరకు ఉంటాయని రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఆ గ్రామ శివారులోని 18 సర్వేనెంబర్లలో 1091 ఎకరాల 26 గుంటల పరంపోగు, 11 ఎకరాల 33 గుంటల ఖారజ్‌ఖాతా, 367 ఎకరాల 12 గుంటల గయిరాన్ భూములున్నట్టుగా లెక్కలున్నాయి. మహారాష్ట్ర, కర్నాటకకు చెందిన కొందరు స్థానికేతరులతో పాటు అదే గ్రామానికి చెందిన కొందరు ఖాతాదారులుగా ఉన్నారు. 131 సర్వే నెంబర్లలో 990 ఎకరాల 16 గుంటల భూమిని వెంకట్, బాలకిషన్, నర్సింహ, లక్ష్మణరావు దేశ్ పాండే, 44 సర్వేనెంబర్లలో 104 ఎకరాల 24 గుంటల భూములు ఎమ్‌డీ ఖమ్రోద్దీన్, జయలోద్దీన్, మీరాసాహెబ్ ముగ్గురు ఖాతాదారులుగా సాగు చేయించారు. వారితోపాటు కూనారం గ్రామానికి చెందిన గీట్ల రత్నారెడ్డి, గోవిందరెడ్డి 81 సర్వే 9లో

కాషాయ రంగు వదిలితేనే

రజనీతో జట్టు కడతాం : కమల్‌హాసన్ స్పష్టీకరణ

- 21న పార్టీపై ప్రకటన ,రామేశ్వరం నుంచి పర్యటన



కేంబ్రిడ్జి: రజనీకాంత్ రంగు కాషాయం(బీజేపీ) కాదని భావిస్తున్నా. ఓవేళ కాషాయమే ఆయన రంగు అయితే ఆయనతో రాజకీయ కూటమి ఉండబోదని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ స్పష్టం చేశారు. అయితే, రజనీకాంత్ ఆలోచనా విధానం ఏమిటన్నదానిపై తనకింకా స్పష్టత లేదని కమల్‌హాసన్ తెలిపారు. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో భారతీయ వార్షిక సదస్సులో కమల్‌హాసన్ ప్రసంగించారు. కార్యక్రమానికి అనుసంధానకర్తగా వ్యవహరించిన సీనియర్ జర్నలిస్ట్ బర్ఖాదత్ 9లో

నీట్‌కు తప్పనిసరి!

- వైద్య విద్యపై కేంద్రం ప్రణాళిక



న్యూఢిల్లీ: విదేశీ యూనివర్సిటీల్లో ఎంబీబీఎస్ చేయాలనుకునే విద్యార్థులకు నీట్(నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ను తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తున్నది. 2016లో నీట్ అమలులోకి వచ్చినప్పటి నుంచి దేశంలోని ప్రభుత్వ, ప్రయివేటు మెడికల్ కళాశాలల్లో మెడిసిన్ చేయాలనుకునే విద్యార్థులు నీట్‌ను రాస్తున్నారు. కాగా ప్రతిపాదనలు అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉన్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు 9లో

ఆమె కడుపులో సిరంజీలు

- యూపీలోని వారణాసిలో డాక్టర్ల నిర్లక్ష్యం



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన సర్ సుందర్‌లాల్ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న ఓ మహిళ కడుపులో వైద్యులు నిర్లక్ష్యంగా సిరంజీలను వదిలేశారు. గతేడాది ఈ సర్కారు దవాఖానలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్నప్పటి నుంచి బాధితురాలు రాణి తీవ్ర 9లో

నగరం.. ట్రాఫికర్

- నగరాలు, పట్టణాల్లో తీవ్రమవుతోన్న ప్రయాణ కష్టాలు
- ప్రచారార్భాటాల కోసం.. 'గాలి రిక్షా'లంటూ పాలకుల గాలి మాటలు

12లో

కుటుంబ పాలన అభివృద్ధికి ఆటంకం

- ప్రాజెక్టుల పేరుతో రూ.కోట్లు వెనక్కి : కోదండరామ్



వివరాలు 9లో

కాంగ్రెస్‌ది కుర్చీల కొట్లాట

- ఖమ్మంలో త్వరలో అడ్వెంచర్, మెగా ఫారెస్ట్ పార్క్: ఖమ్మం బహిరంగ సభలో హరీశ్‌రావు



నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

కాంగ్రెస్ నేతలకు కుర్చీల కొట్లాట తప్ప ప్రజా సమస్యలు పట్టవని రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్ శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. ఆదివారం సాయంత్రం ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్‌ను మంత్రి తుమ్మల, స్థానిక ఎమ్మెల్యే అజయ్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో హరీష్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు గాంధీ భవన్‌లో కూర్చుని వంద సీట్లు గెలుస్తామని పగటి కలలు కంటున్నారని అన్నారు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే మరుగుదొడ్డి కట్టాలన్నా ఢిల్లీ అనుమతులు తీసుకోవాల్సి వస్తుందన్నారు. వేలాది టీఎంసీల గోదావరి జలాలు 60 ఏండ్లుగా వృథాగా పోతున్నా కాంగ్రెస్ నేతలు ఏం చేశారని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో సీతారామను పూర్తిచేస్తామని చెప్పారు. లకారం చెరువు 9లో

మద్దతు కోసం రోడ్డెక్కిన రైతులు

- 44వ జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో
- పసుపు, ఎర్రజొన్నలకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పసుపు, ఎర్రజొన్న పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్‌జిల్లా జక్రాన్‌పల్లిలో 44వ జాతీయ రహదారిపై రైతులు ఆదివారం రాస్తారోకో చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఎర్రజొన్నలకు రూ 4500, పసుపునకు రూ.15వేలు ఇవ్వాలని, పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రజొన్న వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను మోసంచేస్తూ క్వింటాల్‌కు రూ.1500 ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పసుపునకు క్వింటాల్‌కు రూ.5వేలు ఇచ్చి రైతులను దగా చేస్తున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ సతీష్‌రెడ్డి చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అరగంటపాటు రాస్తారోకో చేయడంతో కిలోమీటరుమేర ట్రాఫిక్ స్తంభించింది. కార్యక్రమంలో చింతలూరు, కలిగోట్, మునిపల్లి, లక్ష్మాపూర్, నారాయణపేట్, బ్రాహ్మణ్‌పల్లి, కొలిప్యాక్, తొర్లికొండ, పుప్పాల్‌పల్లి రైతులు పాల్గొన్నారు.



నువ్వేం ఫికర్ జెయ్యకు బిడ్డా..
నీ పెండ్లి నాటికి వస్తదిలే..!!

ఆరోగ్యం ప్రయివేటే

పీపీపీ పద్ధతిలో ఆరోగ్య భద్రతా పథకం

- రాష్ట్రాలకు కేంద్రం మార్గదర్శకాలు
- ప్రాథమిక వసతులు, సిబ్బంది ఏర్పాటులో ప్రయివేటు భాగస్వామ్యం
- బీజేపీ రాష్ట్రాలకే ప్రథమ ప్రాధాన్యత..?



న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రకటించిన జాతీయ ఆరోగ్య భద్రతా పథకం(ఎన్‌హెచ్‌పీఎస్) అమలుకు సంబంధించి రాష్ట్రాలతో కేంద్రం సంప్రదింపులు జరపనున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం అమలుకు అవసరమైన మౌలిక వసతులు,ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, శిక్షణతో కూడిన సిబ్బంది కోసం ప్రయివేట్ ఆస్పత్రులను భాగస్వాములను చేసేలా కేంద్రం మార్గదర్శకాలను రాష్ట్రాలకు పంపనున్నది. సార్వత్రిక ఆరోగ్య 9లో



పైసల్లేని ప్రజారోగ్యం

- సర్కారు వైద్యానికి తూట్లు
- కార్పొరేట్ల సేవలో మోడీ : ప్రకాశ్ కరత్

భీమవరం: ఆరోగ్యబీమా పథకం ద్వారా 50 లక్షల మందికి లబ్ది చేకూరుతుందని మోడీ చెప్పారని..కానీ ఆ మేరకు నిధులు కేటాయించలేదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు 9లో

ఉగ్రదాడిలో ఆరుకు చేరిన మృతులు..

- నలుగురు ముష్కరులను మట్టుబెట్టిన బలగాలు



శ్రీనగర్ : జమ్మూలో సైనిక శిబిరంపై ఉగ్రవాదులు దాడికి పాల్పడిన ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఉగ్రవాదుల కాల్పుల్లో శనివారం ముగ్గురు సైనికులు మృతిచెందారు. ఆదివారం మరో ఇద్దరు జవాన్లు, ఓ పౌరుడు మృతి చెందారు. సుంజువాన్ ప్రాంతంలో ఉన్న ఆర్మీ క్యాంపులోకి శనివారం తెల్లవారుజామున కొందరు ఉగ్రవాదులు చొరబడిన సంగతి తెలిసిందే. నేరుగా క్యాంపులోని ఫ్యామిలీ క్వార్టర్స్‌లోకెళ్లిన వారు కాల్పులు జరుపుతూ విధ్వంసం సృష్టించారు. కాగా.. క్యాంపులో నక్కి ఉన్న ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు ఆర్మీ బలగాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. బలగాలు కాల్పుల్లో శనివారం ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆదివారం మరో ఉగ్రవాదిని సైనికదళాలు మట్టుబెట్టాయి. మరో ఇద్దరు లేదా ముగ్గురు ఉగ్రవాదులు క్యాంపులో ఉండొచ్చని సైనిక ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. ఎవరూ గుర్తు పట్టకుండా ఉండేందుకు ఉగ్రవాదులు.. ఆర్మీ దుస్తుల్లో క్యాంపులోకి ప్రవేశించినట్టు ప్రాథమికంగా తేలింది. క్యాంపుపై దాడికి కరుడుగట్టిన ఉగ్రవాదులు సయ్యద్ సలావుద్దీన్, మసూద్ అజహర్‌లు ప్రధాన సూత్రధారులని ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఘటనలో గాయపడిన 9 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరు జవాన్ల పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

సంపన్నుల నగరం 'ముంబయి'

- అత్యంత ధనిక నగరాల జాబితాలో 12వస్థానం
- మొదటిస్థానంలో న్యూయార్క్

న్యూఢిల్లీ : భారతదేశ ఆర్థిక రాజధాని ముంబయి సంపన్నుల నగరమని అందరికీ తెలిసిందే. కానీ అక్కడ ఎంత సంపద ఉంది? ప్రభుత్వ ఆస్తులుకాకుండా, ప్రయివేటు వ్యక్తుల సంపద ఎంత? అన్న విషయాన్ని 'న్యూవరల్డ్ వెల్త్' లెక్కతేల్చింది. తాజా నివేదిక ప్రకారం, ప్రపంచంలో ధనిక నగరాల జాబితాలో ముంబయి 12వ స్థానాన్ని పొందింది. ఈ నగర సంపద 950 బిలియన్ డాలర్లు (సుమారుగా రూ.61లక్షల కోట్లు) ఉందని నివేదిక పేర్కొంది. ప్రపంచంలో 15 సంపన్న నగరాల జాబితాను రూపొందించిన 'న్యూవరల్డ్ వెల్త్' తాజా నివేదికలోని వివరాలు ఇలా ఉన్నాయి. అత్యంత ధనిక నగరాల జాబితాలో న్యూయార్క్ మొదటిస్థానంలో నిలబడగా, ముంబయి 12వస్థానంలో ఆ తర్వాత, టొరొంటో, ఫ్రాంక్‌ఫర్ట్, పారిస్ నగరాలు నిలిచాయి. ఇక ముంబయి నగర సంపద విషయానికొస్తే, ఈ నగరంలోని మొత్తం ప్రయివేటు వ్యక్తుల ఆస్తుల్ని పరిగణలోకి తీసుకొని సంపద గణన మదింపు చేశారు. ఇందులో మొత్తం ప్రయివేటు వ్యక్తుల స్థిరాస్తి, నగదు, షేర్‌మార్కెట్లో ఈక్విటీలు, వ్యాపారం...ఉన్నాయి. ప్రభుత్వ నిధుల్ని, ఆస్తుల్ని లెక్కలోకి తీసుకోలేదు. ముంబయిలో 28 మంది బిలియనీర్లు (1 బిలియనీరు ఆస్తి రూ.6422 కోట్లు) ఉన్నారు. అత్యధిక బిలియనీర్లు ఉన్న నగరాల జాబితాలో ముంబయికి 10వ స్థానం దక్కింది.

భారత్-యూఏఈలమధ్య ఐదు ఒప్పందాలు

- అబుదాబి రాజుతో మోడీ విస్తృత చర్చలు

అబుదాబి/దుబాయ్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనలో భాగంగా ఐదు ప్రధాన ఒప్పందాలు కుదిరాయి. అంతకుముందు అబుదాబి రాజు మహ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌తో విస్తృత చర్చలు జరిపారు. చర్చల అనంతరం దుబాయ్‌లోని చమురు క్షేత్రాలలో భారతీయ చమురు కంపెనీలకు 10 శాతం వాటాను ఇచ్చే చారిత్రాత్మక ఒప్పందంతో సహా ఐదు ఒప్పందాలపై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి.

దాగుడుమూతలు

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై..

- మోడీ ప్రభుత్వం మైండ్ గేమ్ ..!
- వివరాలు వెల్లడిస్తానని చెప్పి మూడు నెలల్లోనే మాట మార్చిన రక్షణమంత్రి..!!
- దేశ భద్రత, అధికారిక రహస్యం అంటూ దాటవేత..!!!

నవతెలంగాణ జనరల్‌డెస్క్

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వివరాలు వెల్లడించేందుకు నిరాకరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఒప్పందం వెనుక భారీ కుంభకోణం ఉన్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యూపీఏ-2 హయాం నుంచి రాఫెల్ యుద్ధ విమనాల కొనుగోలుపై చర్చలు సాగుతున్న విషయం గమనార్హం. ఫ్రాన్స్‌కు చెందిన దస్సాల్ట్ కంపెనీ నుంచి ఈ విమానాల కొనుగోలు కోసం పదేండ్లుగా సంప్రదింపులు జరుగుతున్నాయి. చివరికి మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 36 యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన పత్రాలపై 2016, సెప్టెంబర్ 23న సంతకాలు చేసింది. అయితే, ఈ యుద్ధ విమానాల ఒప్పందానికి సంబంధించిన వివరాలన్నీ మోడీ ప్రభుత్వం మొదటి నుంచి గోప్యంగా ఉంచుతూ వచ్చిందని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. వాస్తవాలను పరిశీలిస్తున్నవారికి కూడా ఈ యుద్ధ విమానాల ఒప్పందంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

నిర్మలాసీతారామన్‌కు ముందు రక్షణశాఖను నిర్వహించిన మనోహర్ పారికర్, అరుణ్‌జైట్లీలకు కూడా ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలు తెలియవని పరిశీలకులు చెబుతున్నారు. ఈ ఒప్పందంపై 2015, ఏప్రిల్, 10న ప్రధాని మోడీ ప్రకటన చేసే వరకూ దీనిపై ఇంకా చర్చలు సాగుతున్నాయంటూ రక్షణశాఖ వర్గాలు చెబుతూ వచ్చాయి. ఒక్కో యుద్ధ విమానానికి ఎంత ధర నిర్ణయించారని అడిగితే కూడా చెప్పడానికి మోడీ ప్రభుత్వం వెనకాడటం పట్ల కాంగ్రెస్‌సహా ప్రతిపక్షాల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది నవంబర్‌లో ఈ ఒప్పందం గురించి మీడియా అడిగిన పలు ప్రశ్నలపై స్పందించిన రక్షణశాఖమంత్రి నిర్మలాసీతారామన్..ఈ



ఒప్పందంలో నిర్ణయించిన ధర, ఇప్పటివరకూ చెల్లించిన వివరాలు తెలియజేస్తాం. ఎందుకంటే అది ప్రజల డబ్బు అన్నారు. ఇప్పుడు రక్షణమంత్రిసహా మోడీ ప్రభుత్వంలోని సీనియర్ మంత్రులంతా మాట మార్చి సమాధానాన్ని దాట వేస్తున్నారు. ఈ నెల మొదటివారంలో నిర్మలాసీతారామన్ ఇదే అంశంపై మరోసారి ప్రశ్నించగా అదంతా వర్గీకృత సమాచారమైనందున(క్లాసిఫైడ్ ఇన్ఫర్మేషన్) వివరాలు వెల్లడించలేమన్నారు. గతంలో ప్రజల డబ్బు, పారదర్శకత గురించి గొప్పగా చెప్పిన మంత్రిగారే కొన్ని నెలల్లోనే మాట మార్చడంతో అనుమానాలు బలపడుతున్నాయి. దీంతో, రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంలో భారీ కుంభకోణమున్నదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఈ ఒప్పందంపై ప్రధాని వివరణ ఇవ్వకపోవడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తప్పు పట్టారు. గతంలో ధర, ఇతర వివరాలు తెలియజేస్తానన్న రక్షణమంత్రి ఇప్పుడు ఎందుకు మాట మార్చారని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు.

అవినీతికి పాల్పడ్డవారిని, ప్రధాని మోడీ, ఆయన స్నేహితుడిని రక్షించేందుకే వివరాలిచ్చేందుకు రక్షణమంత్రి వెనకాడుతున్నారా అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగారు. రాఫెల్ విమానాల ఒప్పందంపై పదేపదే వివరాలు అడగటం ద్వారా దేశ భద్రతపై కాంగ్రెస్ రాజీ ధోరణితో వ్యవహరిస్తున్నదని జైట్లీ ఆరోపించారు. దేశ భద్రత విషయంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో రక్షణమంత్రిగా పని చేసిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ నుంచి రాహుల్‌గాంధీ పాఠాలు నేర్చుకోవాలన్నారు.

ఒప్పందం విలువ రూ.58,000 కోట్లు..?

జాతీయ మీడియా సంస్థల్లో వచ్చిన అంచనాలమేరకు ఫ్రాన్స్‌కు చెందిన దస్సాల్ట్ కంపెనీ నుంచి కొనుగోలు చేయనున్న 36 రాఫెల్ యుద్ధ విమానాల మొత్తం విలువ రూ.58,000 కోట్లు(780 కోట్ల యూరోలు). ఈ ఒప్పందానికి సంబంధించి మన దేశ కంపెనీలు 15 శాతం అడ్వాన్స్‌గా చెల్లించాలి. అయితే, విదేశీ కంపెనీకి ఎంత చెల్లించాలన్నదానిపై స్పష్టమైన వివరాలు లేవు. ఈ అంశంపై రక్షణశాఖ సహాయమంత్రి సుభాష్‌భామ్రే 2016, నవంబర్ 16న రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. దాని ప్రకారం ఒక్కో యుద్ధ విమానం ఖరీదు రూ.670 కోట్లు. మరో రూ.1000 కోట్ల చొప్పున(ఒక్కో విమానానికి) వాటికి అమర్చే ఆయుధాలు, ఇతర పరికరాల కోసం ఖర్చు చేస్తారు. అంటే ఒక్కో యుద్ధ విమానం మొత్తం విలువ రూ.1670 కోట్లు. యూపీఏ-2 హయాంలో ఇదే ఒప్పందం కోసం ఫ్రాన్స్ కంపెనీతో తాము సంప్రదింపులు జరిపినపుడు ఒక్కో యుద్ధ విమానానికి రూ.560కోట్ల చొప్పున తాము ప్రతిపాదించామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. 2012లో తాము ప్రతిపాదించిన దానికన్నా మోడీ ప్రభుత్వం మూడు రెట్లు అధిక ధర ఎందుకు చెల్లిస్తున్నదని ఆ పార్టీ ప్రశ్నిస్తోంది. అయితే, తాము ఇప్పుడు చేసిన ఒప్పందం ఎంతో మెరుగైనదని మోడీ ప్రభుత్వం సమర్థించుకుంటోంది. సామర్థ్యం, ధర, నాణ్యతపరంగా దానికీ దీనికీ పోలికే లేదని చెబుతోంది. ఈఒప్పందం ద్వారా ఆ యుద్ధ విమానాలను దేశీయంగా తయారు చేయడానికి మనకు లైసెన్స్ లభిస్తుందని మోడీ ప్రభుత్వం చెబుతోంది. అయితే, తమ ఒప్పందంలో కూడా దేశీయ ఉత్పత్తికి అనుమతి ప్రతిపాదన ఉన్నదని కాంగ్రెస్ నేతలు వివరణ ఇచ్చారు.

యూపీఏ హయాంలో ఈ యుద్ధ విమానాల తయారీకి సంబంధించి ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)కు బాధ్యత అప్పగించారు. రక్షణ పరికరాల తయారీలో ఐదు దశాబ్దాల కుపైగా దస్సాల్ట్ కంపెనీతో కలిసి పని చేసిన అనుభవం హెచ్ఏఎల్‌కు ఉన్నది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం మాత్రం ఈ ఒప్పందంలో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్‌కు భాగస్వామ్యం కల్పించింది. రక్షణ పరికరాల తయారీలో రిలయన్స్ కంపెనీకి ఏమాత్రం అనుభవం లేదని నిపుణులు చెబుతున్నారు. దీంతో, ఓ ప్రయివేట్ కంపెనీకి రూ. 29,000 కోట్లమేర లబ్ది చేకూర్చేందుకే మోడీ ప్రభుత్వం ఈ ఒప్పందంలో మార్పులు చేసిందన్న విమర్శలున్నాయి. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి ఈ ఒప్పందం ఓ ఉదాహరణ అని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. తమపై వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పకుండా దేశ భద్రత, సైనిక సంసిద్ధత, అధికారిక రహస్యం అంటూ మోడీ ప్రభుత్వంలోని మంత్రులు కుంటి సాకులు చెబుతున్నారని ప్రతిపక్షాలు దుయ్యబడుతున్నాయి.

వైద్యం కోసం భారత్ బాట

దేశంలో చికిత్స పొందిన 2 లక్షల మంది..



న్యూఢిల్లీ: దేశంలో చికిత్స పొందుతున్న విదేశీయుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. 2016 ఏడాదిలో రెండు లక్షల మందికి పైగా విదేశీయులు వైద్యం కోసం భారత్‌కు వచ్చారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2016లో భారత ప్రభుత్వం 2,01,099 మెడికల్ వీసాలు మంజూరు చేసింది. 54 దేశాల ప్రజలు ఈ వీసాలను పొందగా.. పాకిస్థాన్ నుంచి 1,678 మంది, అమెరికా నుంచి 296 మంది ఉన్నారు. మిగతా దేశాలతో పోలిస్తే అధునాతన వైద్య సేవలతో పాటు తక్కువ ఖర్చు అవుతున్న నేపథ్యంలో విదేశీయులు ఇక్కడే వైద్య సేవలు పొందేందుకు మొగ్గు చూపుతున్నారని ఓ బిజినెస్ చాంబర్ చేపట్టిన సర్వేలో వెల్లడైంది. దేశంలో మెడికల్ టూరిజం ఆదాయం రూ. 19,500 కోట్లు ఉన్నదని, 2020 నాటికి రూ.45,500 కోట్లకు చేరవచ్చని అంచనా వేసింది.

ఇద్దరు బాలికలపై యాసిడ్ దాడి

- మధ్యప్రదేశ్‌లో ఘాతుకం

భోపాల్: గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి ఇద్దరు అమ్మాయిలపై యాసిడ్ దాడి చేసిన ఘటన మధ్యప్రదేశ్‌లోని డిండోరి జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. నిందితులు పరారీలో ఉన్నారు. డిండోరిలోని లికాని ప్రాంతానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికలు పరీక్షలకు హాజరై ఇంటికి తిరిగి వెళ్తున్నప్పుడు వారిపై ఈ దాడి జరిగింది. బాధితులను వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ముఖం, చేతులపై తీవ్రమైన గాయాలైన వారిని ప్లాస్టిక్ సర్జరీకోసం జబల్‌పుర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. నిందితులకోసం గాలింపు చర్యలు మొదలుపెట్టామని పోలీసు అధికారి భగత్‌సింగ్ గోత్రియా తెలిపారు. నిందితులు వాడిన మోటార్‌సైకిల్ నెంబర్‌ప్లేటు కవర్‌చేసి ఉన్నదని సాక్షులు తెలిపారు. హత్యాప్రయత్నం, ఉద్దేశపూర్వకంగా యాసిడ్‌తో దాడిచేయడం, నేరానికి పాల్పడాలనే ఉద్దేశం కింద ఐపీసీ సెక్షన్ 307,326(ఏ), 34 కింద కేసు నమోదు చేశామని డిండోరి ఎస్పీ కె కార్తికేయన్ తెలిపారు.

అంతర్జాతీయం

హాంగ్‌కాంగ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- 19 మంది మృతి, 60 మందికి గాయాలు



హాంగ్‌కాంగ్: హాంగ్‌కాంగ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. డబుల్‌డెక్కర్ బస్సు బోల్తా పడటంతో 19 మంది మృతి చెందారు. మరో 60 మంది గాయ పడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సు డ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడంతో పాటు బస్సును నిర్లక్ష్యంగా నడపడంతో ప్రమాదం సంభవించిందని అధికారులు తెలిపారు. ఇప్పటికే బస్సుపై అంతస్తులో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించేందుకు కట్టర్లను వినియోగించారు. మృతుల్లో 15మంది పురుషులుకాగా మిగతావారంతా మహిళలు. మృతదేహాలు, క్షతగాత్రులతో ఆ ప్రదేశమంతా రక్తసిక్తమైంది. బాధిత కుటుంబాలకు 10,230 డాలర్ల నష్టపరిహారం ఇస్తామని ది కవ్లూన్ మోటార్ బస్ కో సంస్థ ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తు నిర్వహిస్తామని సంస్థ చెప్పింది. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

చైనాలో సందడిగా వసంత ఉత్సవం



బీజింగ్: చైనాలో కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ ఘనంగా వేడుకలు జరుగుతున్నాయి. వసంత ఉత్సవంగా పిలిచే ఈ సంబరాలు చైనా వ్యాప్తంగా మొదలయ్యాయి. గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ప్రజలు క్రియాశీలకంగా భాగస్వాములయ్యారు. సంప్రదాయ నృత్యాలు, ఆటలు, కళా ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. రాత్రి సమయంలో విద్యుద్దీప కాంతులతో భవనాలు మెరిసిపోతున్నాయి. ఈ నెల 16న కొత్త ఏడాది సందర్భంగా దుకాణాలన్నీ కిటకిటలాడుతున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకు ఈ వేడుకలు జరుగనున్నాయి.

డ్రోన్ దాడిలో తెహ్రీక్ ఉగ్రసంస్థ చీఫ్ హతం

ఇస్లామాబాద్ : తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రసంస్థ డిప్యూటీ చీఫ్ ఖాన్ సయీద్ మెహ్‌సూద్ అలియాస్ సజ్నా(46) అఫ్ఘనిస్థాన్‌లో జరిగిన డ్రోన్ దాడిలో హతమైనట్టు ఆసంస్థ ప్రతినిధి ఒకరు ధ్రువీకరించారు. మారా ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో మెహ్‌సూద్ మృతిచెందినట్టు పేర్కొన్నది. గత 24 గంటల్లో పాకిస్థాన్-అఫ్ఘాన్ సరిహద్దుల్లో మూడు డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సజ్నా, అతని మేనల్లుడు ఇస్మాయిల్, ఇద్దరు అంగరక్షకులు మృతిచెందారు. సజ్నా స్థానంలో తాత్కాలిక చీఫ్‌గా మౌల్వీ ఖాతిర్‌ను తాలిబన్ నియమించింది. 2013లో వలీవుర్ రెహ్మాన్ మృతి తర్వాత తాలిబన్‌కు డిప్యూటీ చీఫ్‌గా సజ్నా బాధ్యతలు చేపట్టాడు. కరాచీలో పీఎన్ఎస్ మెహ్రాన్‌పై దాడి, ఆరేండ్ల క్రితం బన్నులో జైలుపై దాడి చేసి 400 మంది ఖైదీలను సజ్నా విడిపించాడు. మెహ్‌సూద్ మృతిని కాందహార్ పోలీస్ చీఫ్ జనరల్ అబ్దుల్ రాజిఖ్ ధ్రువీకరించారు.

ఆగిపోయిన విమానాన్ని నెట్టారు...!

- సోషల్ మీడియాలో వీడియో వైరల్



జకార్తా: ఇండోనేషియా రాజధాని జకార్తాలో ఓ విమానం ఆగిపోతే దాన్ని ప్రయాణికులు నెడుతున్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అయింది. సాధారణంగా బస్సు ఆగిపోతే ప్రయాణికులు నెడుతుండటం గమనిస్తుంటాం. అలాంటిది ఏకంగా దాదాపు 35,000 కిలోల బరువున్న విమానాన్ని బస్సును నెట్టినట్టు ప్రయాణికులు నెడుతున్న దృశ్యం సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ ఘటన ఇండోనేషియా విమానాశ్రయంలో జరిగింది. వివరాల్లోకి వెళితే...ఇండోనేసియాలోని తాంబోలకా విమానాశ్రయంలో గరుడ ఇండోనేసియాకు చెందిన ఓ విమానం రన్‌వేపై ఓ పక్కకు జరిగిపోయింది. దాంతో 20 మంది టెక్నీషియన్లు, కొందరు ప్రయాణికులు విమానాన్ని పక్కకు జరిపేందుకు ప్రయత్నించారు. 35,000 కిలోల బరువున్న ఈ విమానాన్ని నెట్టేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న కొందరు ప్రయాణికులు వీడియో తీశారు. సోషల్‌మీడియాలో ఈ ఫొటోలు పోస్ట్ చేయడంతో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. విమానంలో సాంకేతిక సమస్యలు రావడంతో ఇలా నెట్టారేమో అంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు. అనంతరం ఎయిర్‌లైన్స్ ప్రతినిధి ఇక్సాన్ రోసన్ ఈ ఘటనపై వివరణ ఇచ్చారు. విమానం ల్యాండయ్యే సమయంలో పైలట్ రాంగ్ టర్న్ తీసుకున్నాడని దాంతో విమానం రన్‌వేపై ఓ పక్కకు వెళ్లిందని పేర్కొన్నారు. రన్‌వేపై ల్యాండయ్యాక పార్కింగ్ ఏరియా వద్ద ఎడమ వైపునకు టర్న్ అవ్వాల్సి ఉందని కానీ పైలట్ తడబాటు కారణంగా ఇలా జరిగిందన్నారు. విమానాన్ని తరలించే పుష్‌బ్యాక్స్ లేకపోవడంతో టెక్నీషియన్లే దాన్ని పక్కకు మళ్లించడానికి ప్రయత్నించారని ఆ అధికారి వివరణ ఇవ్వడం గమనార్హం.

ఇటలీలో ఆఫ్రికన్ల నిరసనలు

భద్రత కల్పించాలని డిమాండ్



రోమ్ : సెంట్రల్ ఇటలీలోని మెక్రాట నగరంలో ఆఫ్రికన్ల నిరసనలు వెల్లువెత్తాయి. ఆశ్రయం కోసం శరణా ర్థులపై దాడులు పెరిగిపోయాయని ఆఫ్రికన్ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటలీలో ఆఫ్రికన్లకు రక్షణ లేకుండా పోయిందని వాపో యాయి. గతవారం పమీలా మాస్ట్రోపీ స్ట్రో (18) అనే యువతి దారుణ హత్యకు గురైంది. దుండగులు పమీ లాను అతిదారుణంగా హతమార్చి సూట్‌కేసులో శరీర భాగాలను అమర్చి పరారయ్యారు. ఈ ఘటన ఇటలీలో కలకలం రేపింది. ఈ ఘటన అనం తరం శరణార్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇటలీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఆఫ్రికన్ల పట్ల జాత్యహంకార భావా లను విడనాడాలని కోరారు. ఆశ్రయం కోసం వచ్చిన ఆఫ్రికా శరణార్థులను దేశ బహిష్కరణ చేయాలని గతనెలలో ఇటలీ మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. మాజీ ప్రధాని ప్రకటన అనంతరం తమపై దాడులు పెరిగిపోయాయని ఇటలీలో ఆశ్రయం పొందుతున్న శరణార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'పాలస్తీనా ప్రజలకు మద్దతు కొనసాగుతుంది'

న్యూయార్క్ : పాలస్తీనా ప్రజలకు తమ మద్దతు వుంటుందని ఐక్యరాజ్య సమితిలో (ఐరాస) క్యూబా పునరుద్ఘాటించింది. ఐరాస క్యూబా రాయబారి నాన్సి రొడ్రిగజ్ పాలస్తీనా ప్రజల హక్కుల కమిటీ ఉపాధ్యక్షురాలిగా తిరిగి ఎన్నికైన నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, పాలస్తీనాకు తమ సంఘీభావం ఉంటుందని ప్రకటించారు. ప్రస్తుతం పాలస్తీనా ప్రజలు క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో మన కృషిని ఇంకా ముమ్మరం చేయాల్సిన అవసరం వుందని కమిటీ సభ్యులను కోరారు. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలేంను గుర్తిస్తున్నట్టు అమెరికా ఏకపక్షంగా ప్రకటించడాన్ని క్యూబా నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోందని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు ఐరాస నిబంధనావళిని తీవ్రంగా ఉల్లంఘిస్తాయని అన్నారు. పాలస్తీనా-ఇజ్రాయిల్ ఘర్షణలకు సక్రమమైన, శాశ్వతమైన పరిష్కార మార్గాన్ని క్యూబా కోరుకుంటోందని చెప్పారు. పాలస్తీనా ప్రజలకు స్వయం నిర్ణయాధికారం హక్కు ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు.

యెమెన్‌లో యుద్ధ నివారణకు చర్చలు

టెహ్రాన్ : యెమెన్‌లో యుద్ధానికి ముగింపు పలికేందుకు జరుపుతున్న కృషిలో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి మహ్మద్ జావేద్ జరీఫ్, యెమెన్‌లోని హౌతి అన్సరుల్లా మూవ్‌మెంట్ ప్రతినిధి అబ్దుల్ సలామ్‌తో చర్చలు జరిపారు. తక్షణమే యెమెన్‌లో యుద్ధాన్ని ముగించాల్సిన అవసరాన్ని జరీఫ్ నొక్కి చెప్పారు. సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి యెమెన్‌పై బాంబు దాడులు ఆపాలని కోరారు. యెమెన్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ సమాజం వెంటనే మానవతా సాయాన్ని అందచేయాల్సి వుందన్నారు. కాగా అబ్దుల్ సలామ్ ఇరాన్ మంత్రికి ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. యెమెన్ దిగ్బంధనాన్ని నిలుపుచేయాల్సిన ఆవశ్యకత వుందని చెప్పారు. ఇరాన్ మత పెద్దకి అంతర్జాతీయ సలహాదారైన అలీ అక్బర్ వేలాయతి గత వారం మాట్లాడుతూ, యెమెన్ యుద్ధం సౌదీ అరేబియాకు ఊబి వంటిదని వ్యాఖ్యానించారు. వియత్నాం యుద్ధంలో అమెరికా ప్రభుత్వానికి ఏదైతే అనుభవం కలిగిందో అదే పరిస్థితి యెమెన్‌లో సౌదీకి ఎదురవుతుందని హెచ్చరించారు.


పాక్ మానవ హక్కుల నేత అస్మా జహంగీర్ కన్నుమూత



ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో ప్రముఖ మానవ హక్కుల నేత, సీనియర్ లాయర్ అస్మా జహంగీర్ ఆదివారం లాహోర్‌లో గుండె పోటుతో కన్ను మూశారు. ఆమె వయస్సు 66 సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదివారం ఉదయమే ఆమెకు గుండెపోటు వచ్చిందని, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ తుది శ్వాస విడిచారని సీనియర్ లాయర్ అదీల్ రాజా తెలిపారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే లాయర్లు, మానవ హక్కుల కార్యకర్తలు, రాజకీయ నేతలు అన్ని వర్గాల నుండి సంతాప సందేశాలు వెల్లువెత్తాయి. 1952లో జన్మించిన అస్మా జహంగీర్ 1978లో పంజాబ్ యూనివర్శిటీ నుండి ఎల్ఎల్‌బి పట్టా అందుకున్నారు. 1987లో పాకిస్తాన్ మానవ హక్కుల కమిషన్‌కు సహ వ్యవస్థాపకురాలిగా వున్నారు. 1993 వరకు కమిషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తదనంతర కాలంలో ఛైర్‌పర్సన్‌గా కూడా వున్నారు. దక్షిణాసియా మావన హక్కుల కమిషన్ ఉపాధ్యక్షురాలిగా కూడా ఆమె పనిచేశారు. ఐక్యరాజ్య సమితిలో ప్రత్యేకాధికారిగా ఆమె వ్యవహరించారు.

ఉద్రిక్తతలకు తెరదించండి..!

- ఇజ్రాయిల్, సిరియాకు పుతిన్ విజ్ఞప్తి



మాస్కో: పశ్చిమాసియా ప్రాంతంలో రగులుతున్న ఉద్రిక్త తలకు తెరదించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ, సిరియా అధ్యక్షుడు అసద్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో కొత్తగా ఉద్రిక్తతలు పెరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పుతిన్ నెతన్యాహుకు సూచించారు. సిరియాలో ఇజ్రాయిల్ పెద్దయెత్తున వైమానిక దాడులకు పాల్పడిన నేపథ్యంలో పుతిన్ ప్రధాని నెతన్యాహూకు ఫోన్ చేసి అక్కడి పరిస్థితిపై చర్చించారని క్రెమ్లిన్ వర్గాలను ఉటంకిస్తూ ఇంటర్‌ఫాక్స్ వెల్లడించింది. సిరియాలో ఉన్న రష్యన్ వైమానిక స్థావరాలపై ఇజ్రాయిలీ వాయుసేన దాడులు చేసిన నేపథ్యంలో ఇరువురునేతలూ తాజా పరిస్థితిని చర్చించారని ఈ సంస్థ తెలిపింది. తమ ఆధీనంలో వున్న ప్రాంతాలపై బాంబుదాడులు చేసి తిరిగి వస్తున్న ఇజ్రాయిలీ యుద్ధ విమానాన్ని శనివారం సిరియా సేనలు ప్రయోగించిన విమాన విధ్వంసక క్షిపణి కూల్చివేయటంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. అంతకు ముందు ఇరాన్ మద్దతు ప్రకటించిన సిరియా సేనలతో ఇజ్రాయిలీ దళాలు పెద్ద ఎత్తున తలపడ్డాయి.

రక్షణ వ్యయాన్ని పెంచుతాం : అమెరికా అధ్యక్షుడు ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా రక్షణ వ్యయాన్ని పెంచనున్నట్టు యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. దేశానికి వెన్నుముక నిలుస్తున్న సైనికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతేగాకుండా, దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షిం చుకునేందుకు పాటుపడతామని అన్నారు. సైనికుల సంఖ్యను పెంచడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన క్షిపణుల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. రక్షణ వ్యయంలో రష్యా, చైనా దేశాలను అధిగమించాలన్నదే తమ ఏకైక లక్ష్యమని అన్నారు. రక్షణ వ్యయం కోసం ఈ ఏడాది 700 బిలియన్ డాలర్లు (రూ. 44,95,491 కోట్లు) కేటాయించామని అన్నారు. వచ్చే ఏడాది 716 బిలియన్ డాలర్లు (రూ.45,98,491 కోట్లు) ఖర్చు చేయనున్నట్టు ట్రంప్ పేర్కొన్నారు.




మందకృష్ణ కుమార్తె వివాహం

ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కుమార్తె వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహానికి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కాంగ్రెస్ సీనియర్ నేత జైపాల్ రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్, మంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే కిషన్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు,ప్రజాయుద్ధనౌక గద్దర్‌తో పాటు పలువురు ఎమ్మార్పీఎస్ నేతలు, కార్యకర్తలు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.

అధికార వికేంద్రీకరణ జరగాలి

పంచాయతీరాజ్ చట్టసవరణలు అప్రజాస్వామికం

మేధావుల ఫోరం రౌండ్‌టేబుల్‌లో రిటైర్డ్ ఐఏఎస్ ప్రభాకర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పంచాయతీరాజ్ చట్ట సవరణలు అప్రజాస్వామికమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. పదవుల పందేరం కోసం గ్రామాలను వాడుకోవడం సరికాదని, ప్రత్యక్ష ఎన్నికలతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'పంచాయతీరాజ్-ప్రజాస్వామ్యం' అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరోక్ష ఎన్నికల్లో డబ్బు, అధికారం ప్రభావాన్ని చూపుతాయని చెప్పారు. అనేక పంచాయతీల్లో వార్డు సభ్యులుగా ఎన్నిక కాని కులాలు అనేకం ఉన్నాయని తెలిపారు. గ్రామాభివృద్ధి కమిటీలు స్థానిక ప్రజాప్రతినిధులపై పెత్తనాన్ని చెలాయిస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వారి అధికారాల్ని కత్తిరిస్తున్నాయని అన్నారు. మహాత్మాగాంధీ చెప్పిన గ్రామస్వరాజ్యం నినాదాన్ని రాజ్యాంగ చట్టసభలు అంగీకరించలేదని, దీనిపై రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, నెహ్రూల మధ్య ఏకాభిప్రాయం ఉన్నదని తెలిపారు. కేరళ రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరు దేశానికే ఆదర్శమని, రాజ్యాంగంలోని 29 అధికారాల్ని ఆయా గ్రామాలకే దఖలు పరిచారని చెప్పారు. గిరిజన గూడేలను గ్రామపంచాయతీలుగా మార్చే అంశంపై ప్రభుత్వం ఇంకా స్పష్టతకు రాలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8685 గ్రామపంచాయతీలు ఉన్నాయని, 500 జనాభా ప్రకారం పంచాయతీలను గుర్తిస్తే ఆ సంఖ్య మరో 4,580కి పెరుగుతుందని వివరించారు. ప్రస్తుతం ఉన్న పంచాయతీలకే నిధులు, విధులు, బాధ్యతలను ప్రభుత్వం బదలాయించలేదని, అలాంటప్పుడు సంఖ్య పెరిగితే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. స్థానిక ప్రభుత్వాల్లో అన్ని వర్గాలకు న్యాయం జరగాలని, ప్రత్యక్ష ఎన్నికల్లో రిజర్వేషన్ రొటేషన్ పద్ధతి పాటించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి కాకి మాధవరావు మాట్లాడుతూ గ్రామాల్లో కులం, ధనం ఉనికిలో ఉన్నందున అనేక గ్రామాల్లో ఏండ్ల తరబడి ఒకే వ్యక్తి సర్పంచ్‌గా ఎన్నిక కాగలుగుతున్నారని, దీన్ని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్లపై నిర్ణయాధికారాన్ని రాష్ట్రప్రభుత్వానికి కాకుండా రాష్ట్ర ఎన్నికల సంఘానికే ఉండాలని అభిప్రాయపడ్డారు. మంత్రివర్గం, అసెంబ్లీ నిర్ణయాలకు భిన్నంగా ఏకవ్యక్తి పాలన సరికాదని, దీన్ని మీడియా, పౌరసమాజం ప్రశ్నించాలని చెప్పారు. కార్యక్రమానికి తెలంగాణ మేధావుల ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించగా, చైర్మెన్ ప్రొఫెసర్ తిరుమలి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయకుమార్, ఎమ్‌బీసీ సంఘం నాయకులు పి ఆశయ్య, రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఆదివాసీ సంఘం నాయకులు బండారు రవికుమార్, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు వీరయ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకర్.. కాకి మాధవరావు, పీఎల్, తిరుమలి, వినయకుమార్,ఆశయ్య

తెలంగాణను మోడీ కించపరిచినా సైలెంటా?

- మంత్రి కేటీఆర్‌కు దాసోజు బహిరంగ లేఖ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సమాజాన్ని అవహేళన చేస్తూ పార్లమెంటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడితే మీరెందుకు మౌనంగా ఉన్నారని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె తారకరామారావును టీపీసీసీ ముఖ్యఅధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. మోడీ చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక్క కాంగ్రెస్ పార్టీపై మాత్రమే దాడి కాదు...యావత్తు తెలంగాణ అస్తిత్వ పోరాటాన్ని కించపరిచినట్లేనని పేర్కొన్నారు. తెలంగాణ పట్ల చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే పార్లమెంటులో ఎంపీ కవితతో సహా మోడీని నిలువరించాల్సి ఉందన్నారు. ఈమేరకు ఆదివారం మంత్రి కేటీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. కనీసం మోడీపై నిరసన కార్యక్రమాన్నో, వ్యాఖ్యలను కేసీఆర్ ఖండించడమో చేయాల్సింది పోయి మోడీ వ్యాఖ్యలకు కొనసాగింపా అన్నట్టు...మీరు ఆఘమేఘాల మీద ప్రగతిభవన్‌లో చిట్‌చాట్ నిర్వహించి కాంగ్రెస్‌ను నోటికొచ్చినట్టు మాట్లాడారన్నారు. రాజకీయ కుట్రలలో వయసుకు మించి మీరు ఆరితేరినట్టు ఉన్నారని పేర్కొన్నారు. అందుకేనేమో కుట్ర అని గూగుల్ ఇమేజెస్‌లో సెర్చ్ చేస్తే, మీ ఫోటోలు కుట్ర అనే పదానికి పర్యాయపదం మీరే అన్నట్టు ఉందని పేర్కొన్నారు. మీరన్నట్టు కాంగ్రెస్ లోఫర్ పార్టీ అయితే కాంగ్రెస్‌లో పురుడు పోసుకుని ఏండ్ల తరబడి యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పని చేసిన మీ నాయన కేసీఆర్...ఇవాళ మీ వద్ద ఉన్న డీఎస్, కేకే, అమోస్, యాదవరెడ్డి లాంటి నేతలంతా లోఫర్లేనా? తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ లోఫర్ పార్టీయా, లేక రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేస్తున్న మీరు లోఫర్లా తేల్చుకునేందుకు మీరు గన్‌పార్కు వద్ద బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మీరు మాట్లాడిన మాటలకు బేషరతుగా క్షమాపణ చెప్పండి లేదంటే...మీ వెంట ఉన్న ఆనాటి కాంగ్రెస్ నాయకులను తీసుకుని గన్‌పార్కు వద్దకుగానీ, మరే వేదికకైనా రండి అని దాసోజు పేర్కొన్నారు.

నేడు ఏఆర్ఆర్‌లపై బహిరంగ విచారణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) వార్షిక ఆదాయ, అవసరాల ప్రతిపాదనలపై (ఏఆర్ఆర్) సోమవారం బహిరంగ విచారణ జరుగుతుంది. రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్సీ) ఈ విచారణను నిర్వహించనుంది. 2018-19 ఆర్థిక సంవత్సర ఏఆర్ఆర్ ప్రతిపాదనలపై ఉదయం 10.30 గంటలకు బహిరంగ విచారణ ప్రారంభమౌతుందని టీఎస్ఈఆర్సీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 8వ తేదీ టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్‌లో బహిరంగ విచారణ నిర్వహించారు. 12వతేదీ బహిరంగ విచారణలో మాట్లాడేందుకు దాదాపు 46 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

పట్టా పాసుపుస్తకాల ముద్రణ ప్రారంభం

- దేశవ్యాప్తంగా నాలుగు చోట్ల..



హైదరాబాద్ : రాష్ట్రంలో పట్టా పాసు పుస్తకాల ముద్రణ షురూ అయ్యింది. ఈ మేరకు ప్రభుత్వ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా నాలుగు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లలో వీటి ముద్రణ చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. హైదరాబాద్‌తో సహా మధ్యప్రదేశ్‌లోని దేవాస్, మహారాష్ట్రలోని నాసిక్, ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా ప్రెస్‌లలో రోజుకు 2.5 లక్షల పైగా పాసుపుస్తకాల ముద్రిస్తారు. 1.4 కోట్ల ఎకరాల సాగుకు యోగ్యమైన భూములకుగాను 70 లక్షల పాసుపుస్తకాలను సర్కార్ రెడీ చేస్తున్నది. పట్టాదారు పాసు పుస్తకంపై కాకతీయుల తోరణం, చార్మినార్, భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, ఎరువులు చల్లుతూ దుక్కి దున్నుతున్న రైతుల చిత్రాలు ఉండేలా డిజైన్ చేశారు. దీంతో పాటు 18 భద్రతా ప్రమాణాలతో పాసుపోర్ట్ తరహాలో ముదురు ఆకుపచ్చ రంగులో పాస్ బుక్‌ను తయారు చేస్తున్నారు. మొత్తం ఆరు కాలమ్స్‌తో 20 పేజీలుగా ఉండనున్నాయి. ఆధార్ అనుసంధానంతో పుస్తకంపై బార్‌కోడ్, క్యూఆర్ కోడ్, పట్టాదారు చేతి వేలిముద్ర, ఫొటో వంటి వాటితోపాటు మొబైల్‌నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్సీ కోడ్ వివరాలు ఉంటాయి. మార్చి 11న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పాసు పుస్తకాలను పంపిణీ చేయనుంది.అయితే అప్పటిలోగా అందుబాటులోకి వచ్చే అవకాశాలు తక్కువేనని రైతుసంఘాల నాయకులు అంటున్నారు.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా నేటినుంచి ఆందోళనలు : రైతుసంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా, రైతు వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలంగాణ రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు పి జంగారెడ్డి, కార్యదర్శి టి సాగర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలిండియా కిసాన్‌సభ పిలుపులో భాగంగా జిల్లా, మండల కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సెమినార్లు, సదస్సులు, ధర్నాలు, దిష్టిబొమ్మల దహనం వంటి రూపాల్లో సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఆందోళనలు జరపాలని నిర్ణయించామని తెలిపారు. కేంద్రం మాటలు ఘనంగా చెప్పి వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచలేదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తుంటే రుణమాఫీ గురించి ప్రస్తావనే లేదని తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి గత బడ్జెట్ కంటే తగ్గించడం శోచనీయమని పేర్కొన్నారు. ధరల స్థిరీకరణ నిధి 2017-18లో రూ.3,500 కోట్లు కేటాయిస్తే, 2018-19 బడ్జెట్‌లో రూ.1,400 కేటాయించిందని తెలిపారు. 2022 వరకు రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు ఏమాత్రం ప్రణాళిక లేదని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బీమా పరిధి 25 శాతం నుంచి 40 శాతం పెంచుతామన్నా గతేడాది రూ.1,736 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ.1,790 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. 40 శాతం రైతులను బీమా పరిధిలోకి ఎలా తెస్తారని ప్రశ్నించారు. ప్రచార ఆర్భాటమే తప్ప వాస్తవ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులు, రైతు సంఘాలు ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు నాణ్యమైన విద్య

- 30 శాతం మందికి ఉపాధి అవకాశాలు : ఏఐసీటీఈ వైస్ చైర్మెన్ పునియా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలిటెక్నిక్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) వైస్ చైర్మెన్ డాక్టర్ ఎంపీ పునియా చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీలు భారత్‌లోనే ఎక్కువున్నాయని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ పాలిటెక్నిక్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్‌పీటీవో), తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీపాలా) సంయుక్తంగా జాతీయ సదస్సును నిర్వహించాయి. ఈ సందర్భంగా పునియా మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సు పూర్తయిన విద్యార్థుల్లో 30 శాతం మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. మిగిలిన వారు ఉన్నత విద్యలో చేరుతున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పాలిటెక్నిక్ కోర్సుకు మంచి డిమాండ్ ఉందన్నారు. దేశంలో ఏటా 7 లక్షల మంది విద్యార్థులు పాలిటెక్నిక్‌లలో చేరుతున్నారని చెప్పారు. తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రాష్ట్రంలో పాలిటెక్నిక్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామని వివరించారు.

తెలంగాణ పదాలు - సంస్కృతంతో సంబంధాలు

తెలుగు భాష సోదర ద్రావిడ భాషల్లో ఒకటి. అందులోనూ తమిళం, కన్నడం, మలయాళాల వలె లిపి కల్గి గొప్ప సాహిత్య సంపద కల్గివున్న భాష. పైగా తెలుగు మధ్య ద్రావిడ భాష. తమిళాది దక్షిణాది భాషలకు ఉత్తరాది భాషలతో సంపర్కం తక్కువ. ఇంకా తమిళంలో అయితే సంస్కృతం నుండి అరువు తెచ్చుకున్న పదాలు మరీ విరళం. మలయాళంలో సుమారు నలభై శాతం పదాలు సంస్కృతం నుండి వచ్చినవే! మరి తెలుగు మాటేమిటి? అది మధ్య ద్రావిడం కనుక తెలుగు ప్రాంతం దక్షిణ భారతానికి ఉత్తర దేశానికి వారధి కాబట్టి ఈ భాషలోనికి అనేక ఇతర భాషల్లోని పదాలు నిరాఘాటంగా వచ్చి చేరినై. ఆ కారణంగానే తెలుగు ద్రావిడ భాష అయినప్పటికీ ఆ భాషలో దాదాపు ముప్పై నుండి నలభై శాతం పద సముదాయం సంస్కృతానిదే! అందువల్ల తెలుగుకు పరిపుష్టి కల్గింది. కండపుష్టి చేకూరింది. తమిళంలోని పరిప్పు, చెరిప్పు, మరుందు, విరుందు మొదలైన వేలాది పదాలు తెలుగులో వరుసగా పప్పు, చెప్పు, మందు, విందులుగా మారి విందులు చేస్తే; సంస్కృతం నుండి గృధ్రము, కుక్కుటము, కటకము, వటకము యిత్యాది సహస్రాది శబ్దాలు తెలుగులో గద్ద, కుక్క, కడియం, వడియములుగా మారి భాషను భాస్వంతం చేశాయి. ఏది ఏమైనా, తెలుగు ద్రావిడ భాషాజన్యమే అయినా ఆ భాషలోనికి సంస్కృతం నుండి అనేక పదాలు వచ్చి చేరాయనడం యదార్థం.

తెలుగు భాష, తెలంగాణ భాష... రెండూ ఒక్కటే! ఇవి వేరువేరు భాషలు కావు. తెలంగాణ తెలుగులో వందలు, వేలు సంస్కృత పదాలు, అవి తెలుగు పదాలేనా అని భ్రమపడేట్లు చోటు చేసుకున్నాయి.

'ఏకము' అనేది సంస్కృత పదం. ముఖ్యంగా దీనికి ఒక్కటి అని అర్థం. పూర్వం తెలంగాణలో 'ఏకాణ' ఉండేది. ఏక+అణా=ఏకాణా. దీన్నే మునుపు ఆంధ్ర భాషలో 'అణా' అనేవాళ్ళు. ఆరు పైసలను అణా, ఏకాణ అని వరుసగా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో పిలిచేవాళ్ళు. ఏకాణలోని 'ఏక' సంస్కృతం. ఈ 'ఏక'నే హిందీలో 'ఏక్' అవుతుంది. 'వాడు' ఎకాయెకి వచ్చాడు అనే ఆధునిక ప్రామాణిక భాషలోని ఎకాయెకి ఏమిటి? అదీ ఏకం నుండి వచ్చిందే! అంటే ఒక్కసారి, ఒక్కుమ్మడిగా, వున్నపళంగా అకస్మాత్తుగా వచ్చాడని అర్థం. ఈ 'ఎకాయెకి' తెలంగాణలో 'ఏక్‌దమ్మున వచ్చిండు' అయ్యింది. ఈ 'ఏక్' కూ, సంస్కృతం 'ఏకానికి' లంకె వుందని వేరే చెప్పాలా? ఊహూ... అవసరమేమీ లేదు. శ్రేష్టమైన మంచి బియ్యాన్ని తెలంగాణలో 'నంబర్ ఏక్ బియ్యం' అంటారు. అంటే మొదటిరకం మంచి బియ్యమని! 'నంబర్' ఆంగ్లం, 'ఏక్' సంస్కృతం లేదా హిందీ, బియ్యం తెలుగు.

భాష మన అవసరాల కొరకు ఏర్పడింది కనుక ప్రజలు ఎట్లా పదాల్ని పుట్టిస్తారో చూడండి. ఎటువంటి చిత్ర విచిత్ర సమాసఘటనా చాతుర్యాన్ని ప్రదర్శిస్తారో గమనించండి. ఇది మిశ్ర సమాసమని పండితులు భ్రుకుటి మడిచినా, అది దుష్ట సమాసం అంటూ విద్వాంసులు పెదవి విరిచినా, భాషకు యింత అపచారం ఏమిటని కోవిదులు ముక్కు విరిచినా భాషా ప్రాథమ్యాన్ని, ప్రాధాన్యాన్ని బాగా గ్రహించిన అసలు సిసలు వివేకవంతులు సామాన్య ప్రజలు. అందరికీ అర్థమయ్యేలా పదాల్ని వ్యవహారంలోకి తెచ్చే సామర్థ్యం గ్రామీణులకే ఎక్కువ. సంస్కృత 'ఏకం'తో ముడిపడి వున్న తెలంగాణ సామెతను చూద్దాం. ఏకాశి మరణమని ఈత కొయ్యలల్ల పడ్డడట. 'ఏకాశి' పదం ఏకాదశి నుండి పుట్టింది. ఆ రోజు చనిపోతే పుణ్యప్రాప్తి అని ఎవరో చెబితే ఓ మహానుభావుడు ఈత మండల్లో పడి స్వచ్ఛంద మరణానికి ఉపక్రమించాడట! తెలంగాణలో ఒంటరివ్యక్తిని సూచించడానికి వ్యంగ్యంగా "వానికేంది? టింగు టింగు మనుకుంట ఏకోన్నారాయణగాడు. పెండ్లాం పిల్లలు ఏ తిప్పల్లేవు" అంటారు. ఇందులోని 'ఏకోన్నారాయణ' సంస్కృతమే! "వాడు రుషి అసోంటి మనిషి"లోని రుషి, మనిషి... ఈ రెండు మాటలూ సంస్కృతమే! కాకుంటే కొందరు రుషిని ఋషి అని రాస్తారు. "వీళ్ళకు మస్తు ఐశ్వర్యం వుంది" వాక్యంలోని 'ఐశ్వర్యం' అచ్చంగా సంస్కృతం.

"వీడు భాగోతంల ఎంత మంచిగ రాగం ఎత్తుకుంటడు. వీని కంట్లం మామూలు కంట్లం కాదు" అని పల్లెవాసులు వ్యవహరిస్తారు. వీధి భాగవతాల ప్రదర్శనల్లోనూ, యక్షగానాదుల్లోనూ శ్రావ్యంగా పాడుతున్న పాత్రల్ని చూసి 'కంట్లం' బాగుంది అంటారు. ఈ 'కంట్లం' సంస్కృత కంఠం. కంఠం అని మహాప్రాణాక్షరమైన 'ఠ'తో ఉచ్చరించకపోవటం చేతో, ఇతర కారణాంతరాల వల్లో అది 'కంట్లం'గా మారింది. చలికాలం తల్లులు తమ పిల్లల కంఠం చుట్టూ చలి తగలకుండా ఉండేందుకు గుడ్డను కట్టేదాన్ని సైతం 'అరికంట్లం' అంటారు. ఇందులోని 'కంట్లం' కూడా కంఠజన్యమా ఆలోచించాలి.



ఇది మిశ్ర సమాసమని పండితులు భ్రుకుటి మడిచినా, అది దుష్ట సమాసం అంటూ విద్వాంసులు పెదవి విరిచినా, భాషకు యింత అపచారం ఏమిటని కోవిదులు ముక్కు విరిచినా భాషా ప్రాథమ్యాన్ని, ప్రాధాన్యాన్ని బాగా గ్రహించిన అసలు సిసలు వివేకవంతులు సామాన్య ప్రజలు. అందరికీ అర్థమయ్యేలా పదాల్ని వ్యవహారంలోకి తెచ్చే సామర్థ్యం గ్రామీణులకే ఎక్కువ.

ఇక... సంస్కృతంలో 'కంథ' అనే శబ్దం వుంది. దీనికి చింపిన గుడ్డలను కుట్టిన బొంత, చింపిగడ్డ, మట్టిగోడ అనే అర్థాల్ని శబ్దరత్నాకరం యిచ్చింది. ఈ సందర్భానికి కావాల్సింది చింపిగుడ్డ. చిరిగిపోయిన బట్టల్ని పూర్వం మసిగిన్నెల్ని దింపడానికి వాడేవాళ్ళు. దీన్ని 'మసికంత పేగు' అనేవాళ్ళు తెలంగాణలో. పేగు అంటే బట్టముక్క. 'కంత సంస్కృత 'కంథ'లోంచి వచ్చింది. 'మసి' తెలిసిందే! కొందరు మసికె పేగు అని కూడా అనేవాళ్ళు.

'కచ్చరము' సంస్కృత భాషలోని విశేషణం. దీనికి అర్థం 'మయిలది' అని. 'మురికి, చెత్త, మయిల, మలినం' మొదలైనవి అన్నీ ఏకార్థ బోధకాలు. తెలంగాణలో 'వీడు కచ్రగాడు', 'ఇక్కడ అంతా కచ్ర వుంది' అనే వాక్యాల్లోని 'కచ్ర'కు మాతృక సంస్కృత 'కచ్చరమే!' తెలంగాణ వాసులు తమ సంభాషణల్లో అత్యంత సహజంగానూ, ఎంతో అద్భుతంగానూ యిటువంటి సంస్కృత పదాల్ని వాడుతుంటారు.

వెనుకట రాజులు కత్తులు కటార్లు పట్టుకుని యుద్ధాలు చేసేవారు. ఇప్పుడంటే తుపాకులూ, అణ్వస్త్రాలతోనే సంకుల సమరాలు జర్గుతాయి. 'కత్తులు కటార్లు' అనే జంట పదంలోని 'కటారి' సంస్కృతంలోని 'కఠారము' నుండి వచ్చింది. 'కత్తి' అనే అర్థం వుంది కఠారానికి. అమర భాషలో 'కఠిన' అనే ఆకారాంత స్త్రీలింగ శబ్దం వుంది. ఇది తెలుగులో 'కఠినం' అవుతుంది. తెలంగాణలో 'వాడు మస్తు కటీనం మనిషి' అంటారు. ఈ 'కటీనం' సంస్కృత కఠినమే! 'కఠినం' అంటే గట్టి అని అర్థం. దయలేని మనిషిని పాషాణ హృదయుణ్ణి కటీనం మనిషి అంటారు. ఒత్తు అక్షరం తేలికైపోయింది తెలంగాణలో. అసలు తెలుగు భాషలో ఈ ఒత్తక్షరాలు లేవు కదా! ఇంకొక మార్పు... ఆ మామూలు 'టి' వర్ణానికి దీర్ఘం రావటం. దుముకు, దూకు కావటానికి, ఉముక ఊక అయ్యేందుకు మధ్యలో 'ము'లోపించి పూర్వాక్షరానికి దీర్ఘం వస్తుందని చెప్పగలం. మరి సంస్కృత ప్రగ్రహం, నిగ్రహం, విగ్రహం పదాలు చూద్దాం - వరుసగా తెలుగులో పగ్గం, నిగ్రహం, విగ్రహం... ఇట్లా మారాయి. ఇందులో ఒక్క ప్రగ్రహమే మారింది. మరి నిగ్రహం- నిగ్గం అనీ, విగ్రహం - విగ్గం అనీ కాలేదేమిటీ అంటే జవాబు వుండదు. అట్లాగే 'టి' దీర్ఘంగా (గుడి దీర్ఘం) మారిందేమిటి అని ప్రశ్నిస్తే ఏం చెబుతాం? ఉచ్చారణా విధేయంగా కూడా పదాలు మార్పుకు గురవుతాయి.

'కథ' - సంస్కృత పదం. తెలంగాణలో "వానికి ఓ ఎతలేదు - కత లేదు" అనే వాక్య ప్రయోగం వుంది. ఇందులోని 'ఎత' సంస్కృత 'వ్యథ' (బాధ)లోంచి ప్రాదుర్భవించింది. ఇక 'కత' కథ నుండి వచ్చింది. ఎవడో ఒకడున్నాడు - వాడికి బాధా లేదు - కథా లేదు అని సారం. అవును... ఎత ఉన్నప్పుడే కత పుడుతుంది. శోకం నుండి శ్లోకం పుట్టినట్లు, గాయం నుండి గేయం జనించినట్లు, ప్రజల పాట్ల నుండి పాటలు ప్రభవించినట్లు, కలతలు కవితలకు కారణాలు అయినట్లు... వ్యథల్లోంచి కథలొస్తాయి. అయినా ఇది విషయాంతరం.

"కథా కమామీషూ ఏమిటట?" అనే ప్రమాణ భాషావాక్యం తెలంగాణలో "కతలు కార్కానలు ఏందట?" అని అయ్యింది. భావంలో భేదం లేదు.

"వానికి కపుట బాజితనం ఎక్కువ. వీడు కపట బాజిగాడు" వాక్యాల్లోని 'కపటం' సంస్కృత 'కపటమే'! 'ధోకేబాజ్' వంటి హిందీ మాటల్లోని 'బాజ్' తెలంగాణలో కపటానికి చేరి కపటబాజితనంగా మారింది. తెలంగాణలో పటేలు పట్వారీ వ్యవస్థ ఒకప్పుడు ఉండేది. కరణం కూడా వుండేవాడు. ఈ 'కరణం' సంస్కృతం మాట. అంటే లెక్కలు రాసే వాడని అర్థం. "కాట్లె వడ్డా కర్నపోని పగ చల్లారది" వంటి అనేక నకారాత్మక సామెతలు తెలుగు సమాజంలో వున్నాయి.

"వాడు కర్కోటకుడు. శెమదర్మం లేని మనిషి. బండ. చెమట పుట్టని మనిషి" యిటువంటి వాక్యాల్లోని 'కర్కోటకుడు' ఏమిటి? 'కర్కోటకము' నిస్సందేహంగా సంస్కృతం. దానికి అర్థం ఒకానొకపాము అనే దాన్ని బహుజనపల్లి సీతారామాచార్యులు తన శబ్దరత్నాకరంలో యిచ్చాడు. కర్కోటకుడు అంటే ఎటువంటి దయలేని ప్రమాదకారి అయిన పాములాంటి మనిషి అని అర్థం.

ఆంగ్ల భాషా ప్రభావంతో యివాళ 'పెన్ను' అంటున్నాం గాని, దాన్ని పూర్వం 'కలము' అనేవాళ్ళు. 'లేఖిని' వంటి పదాలు వుండనే వున్నాయి. అయితే 'కలము' సంస్కృత 'కలమము' నుండి పుట్టింది.

'కవి' అనే సంస్కృత శబ్దానికి ముఖ్యంగా వున్న అర్థం 'కవిత్వం చెప్పేవాడు' అని. ఈ 'కవి'ని తెలంగాణలో 'కైత్కాలోడు' అంటారు. కయిత్కాలోడు, చమత్కార సహితంగా మాట్లాడేవాళ్ళనీ 'కయిత్కాలోడు' అంటారు. కొన్నిసార్లు అబద్దాలు చెప్పేవాళ్ళనీ, అతిశయోక్తులు దొర్లించేవాళ్ళనీ ఇట్లా పిలుస్తారు. ఇక... కవిత్వం రాయడం, కవిత్వం అల్లడం అనే వాటికి సమానార్థకంగా 'కైగట్టుడు' అంటారు. గాజుప్పు, గాజుమన్ను అనే అర్థాలు కల్గిన సంస్కృతం 'కాచము' (గ్లాసు ఆంగ్లం) తెలంగాణలో 'కాంచు' అవుతుంది. "గా కాంచు గిలాసల చాయ పొయ్యి" అనే వాక్యంలోని 'కాంచు' కాచజన్యం, 'కాచము'లో 'కా' తర్వాత తెలంగాణలో నిండుసున్నా వచ్చి చేరింది. అట్లా చేరడం తెలంగాణ భాషా లక్షణం (ఉదాహరణకు క్లాసుమెంటు, రూమ్‌మెంటు, మేనింజర్ వంటి ఆంగ్లపదాల్లోనూ ఈ పూర్ణ అనుస్వారం వస్తుంది). తెలంగాణ భాష ద్రావిడ భాష అయినప్పటికీ సంస్కృతంతో దగ్గరి చుట్టరికం వుందనేది సారాంశం.

- డా॥నలిమెల భాస్కర్

బంగారు తెలంగాణ అంటే ఏంటి?



బంగారు తెలంగాణ అంటే ఏంటి?
మట్టి, పుట్ట, చేట్టూ, చేమ, నీరు, నిప్పు
అంతా బంగారమై పోతుందా?
మట్టిని బంగారమనొచ్చు కానీ
అంతమాత్రాన మట్టి బంగారం కాదు
అమూల్యమైనది ఏదైనా బంగారమే
అన్నీ ఎట్లున్నవో అట్లాగే వుంటాయి.
బంగారు తెలంగాణ అనేది
ఒక భావం మాత్రమే
భావాలు అందంగా, సొంపుగా, తియ్యగా వుంటాయి
వాస్తవాలు మాత్రం వేరుగా వుంటాయి
భావంలో స్వచ్ఛత, సమగ్రత వుండాలి
దాని రూపకల్పననే కాదు
ఆచరణ, అమలు పక్కాగా వుండాలి
కట్టె కట్టెగానే వుంటది
గంధం చెక్క చెక్కగానే వుంటది
సుగంధం మాత్రం అందులో వుంటది.
అదే దాని ప్రత్యేకత.
తెలంగాణ
బంగారు తెలంగాణ కావాలంటే
అది సమన్యాయం, సమగ్రాభివృద్ధితో
చందనం చెక్క కావాలి
అప్పుడే మట్టి తెలంగాణకు
పరిమళ మబ్బి బంగారు తెలంగాణవుతుంది
లేకపోతే, నెయ్యిలేని
నేతి బీరకాయవుతుంది.

- జలజం సత్యనారాయణ, 9849444944

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం


'రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం - 2017' ను డా॥సుంకిరెడ్డి నారాయణ రెడ్డికి ప్రదానం చేస్తారు. ఈ రోజు ఉదయం 11గంటలకు సిరిసిల్లలోని రంగినేని చారిటబుల్ ట్రస్ట్‌లో నిర్వహించే ఈ సభలో సిహెచ్.విద్యాసాగర్‌రావు, కల్వకుంట తారక రామారావు, తుల ఉమ, బోయినపల్లి వినోద్ కుమార్, డా॥చెన్నమనేని రమేష్ బాబు, డి.కృష్ణభాస్కర్, సామల పావని దేవదాస్, రంగినేని మోహన్‌రావు, నలిమెల భాస్కర్, మద్దికుంట లక్ష్మణ్, డా॥పత్తిపాక మోహన్, రంగినేని నవీన్ కుమార్ పాల్గొంటారు.

'కలల దారుల్లో' కవితా సంకలనం ఆవిష్కరణ

ఈ నెల 15వ తేదీన సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి మినీ హాల్లో 'కలల దారుల్లో' కవితా సంకలనం ఆవిష్కరణ సభ జరుగుతుంది. ఇందులో అమ్మంగి వేణుగోపాల్, గుడిపాటి, కాంచనపల్లి, ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ, రంగు నవీనాచారి పాల్గొంటారు.

- తెలంగాణ జాగృత సాహిత్య విభాగం

అయ్యో! కవీ




గుండె మీద
గీతల్వడితె
కాయిదం మీదికెక్కిస్తడు
సంఘటనల్ని జూడకుండ
సారాన్నీ వెతుక్కుంటడు
దృశ్యాల వెనకాల
అంతర్లీనపు చోదకశక్తుల్ని వెంటాడ్తడు
నీళ్ళు పడ్డె
పోతై
తామరాకు లెక్క
ఉండమంటడు

రోజూ రోజూ ఏడ్చే లోకంల
క్షణం క్షణం నగిపిస్తడు
పెదవుల మీద మురిపియ్యడు
కలేజా మీద గిలివెడ్తడు
ఉన్న తావున ఉండకుండా
ఎండ్లనో మున్గిపోతడు
జగత్తంతా గలగలమంటే
అది శాశ్వతం కావాలని
ప్రణాళిక గీస్తుంటడు

- ఏనుగు నరసింహారెడ్డి,
89788 69183

నిజామాబాద్ కవి కొరవి గోపరాజు




ఇందూరు కవిరాజు కొరవి గోపరాజు, ఆచార్య అనుమాండ్ల భూమయ్య, మనస్వినీ దేవి, పేజీలు : 165, వెల : 150/-, ప్రతులకు : నవోదయ పుస్తక కేంద్రాలు.

'కొరవి గోపరాజు సాహిత్య విశ్లేషణ' అనే యం.ఫిల్ సిద్ధాంత గ్రంథం అనుమాండ్ల భూమయ్యగారు 1983లోనే వెలువరించారు. ఇన్నాళ్ళకి తెలంగాణ ఉద్యమ ప్రభావంతో కొరవి గోపరాజును ఇందూరు (నేటి నిజామాబాద్ జిల్లా) వాసిగా గుర్తించి ఆయనను, ఆయన గొప్పదనాన్ని వివరిస్తూ ఈ గ్రంథాన్ని తీసుకువచ్చారు.

పదిహేనవ శతాబ్దినాటి కొరవి గోపరాజు రచించిన పద్యకావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'. విక్రమాదిత్య మహారాజు సాహస, పరాక్రమ, దానగుణాదులను తెలిపే కథాకావ్యమిది. ఇందులో 'సింహాసన ద్వాత్రింశిక:అవతారిక, కథాసూత్రం, ప్రజాపరిపాలన: అర్హత, సింహాసనం చెప్పిన కథలు, ప్రజాజీవనం, వర్ణనలు, పద్యరచనా సౌందర్యం, రాజు: ప్రజాసంరక్షణ, హరిహరనాథుడు, నీతి పద్యాలు మొదలైన అధ్యాయాలుగా విభజించుకుని విశ్లేషించడం కనిపిస్తుంది. ఇందులో తెలంగాణ భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక విశేషాలను గుర్తించవచ్చు. రచయిత పరిశోధనా గ్రంథంలా దీన్ని తీర్చిదిద్దిన విధానం బాగుంది.

- రాహుల్

ఉదాసీనత



నిన్నటి నీ పలకరింపు
నా హృదయం హృద్యం చేసింది
నీ ఉదాసీనత కలచివేసింది
నీకోసం ఆగని నేను
ఆగని నా పాదాలు
నన్ను బందించే నా లోకం
ప్రశ్నించే నీకళ్ళు
ఆగమని అర్థిస్తున్నాయి
ఆగే ప్రపంచం
నా పాదాల కింద లేదు
ఊహాలోకాలు
ఇక్కడ లేవు
నిజాలే
నిప్పులాంటి నిజాలు
ప్రతిక్షణం
నిప్పులపై నిలబడ్డా
ప్రేమ స్నేహం నాకు అచ్చి రావు
నా కాళ్ళ సంకెళ్లు
నా చేతుల బేడీలు
నన్ను స్త్రీ నని
అబలనని
ఆధారపడే పరాన్న
జీవినని
గుర్తు చేస్తుంది
నీతో ఆడాలన్నా
పాడాలన్నా
నీ ప్రేమ వర్షం లో
నీ స్నేహపు జల్లుల్లో
తడవాలన్నా
ఆకాశాన్ని తలెత్తి
ఆశగా చూడాలన్నా
అన్నీ ఆంక్షలే
అన్నీ అడ్డులే
నేను మరిచి
జీవించలేని జీవిని
నేనొక స్త్రీ ని
కేవలం స్త్రీ ని
అన్నింటినీ
ఆచితూచి
ఆలోచించి
అడుగు వేసే
ఆంక్షల బందీని
నాకు నేను
బందీనై ఉన్న స్త్రీ ని
ప్రపంచానికి
అర్థం కాని
ప్రశ్నని

- సర్వమంగళ

సహృదయ సాహిత్య విమర్శకుడు అమ్మంగి

అమ్మంగి వేణుగోపాల్ అన్ని సాహితీ ప్రక్రియల్లో రచనలు చేసినప్పటికీ వారు కవిగా, విమర్శకుడిగానే ఎక్కువ ప్రసిద్ధి చెందారు. ఇప్పుడు వెలువడిన వారి మూడవ విమర్శా సంపుటం 'సహృదయ సాహితీ విమర్శ - వైవిధ్యం'. ఇందులో విమర్శా వ్యాసాలు, సమీక్షా వ్యాసాలు, ముందు మాటలు కలగలిసి వున్నాయి. సమీక్ష అయినా, ముందు మాట అయినా విమర్శలో ఒక భాగమే అలా ఈ విమర్శా గ్రంథాన్ని పరిశీలిస్తే, ఇందులో అన్ని సాహిత్య ప్రక్రియల మీద వున్న విమర్శ కనిపిస్తుంది. అయినప్పటికీ కవిత్వం మీద, తెలంగాణ ప్రముఖుల మీద రాసిన వ్యాసాలు ఎక్కువగా ఇందులో చోటు చేసుకోవడం గమనార్హం.

కవిత్వానికి సంబంధించి గంగుల శాయిరెడ్డి 'కాపుబిడ్డ' మొదలుకుని, మొన్ననే వచ్చిన బి.యస్.రాములు 'విహారం' దీర్ఘ కావ్యానికి రాసిన ముందుమాట వరకు ఇందులో వున్నాయి. గ్రామీణ నేపథ్యంలో నిసర్గమైన వాతావరణంలో శ్రమైక జీవనంలో వున్న కష్టసుఖాల చిత్రణ గంగుల శాయిరెడ్డి 'కాపుబిడ్డ'లో కనిపిస్తుందంటారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో హైదరాబాద్‌లోనూ, ఇతర తొమ్మిది జిల్లాలలోనూ కొన్నివేల కవి సమ్మేళనాలు జరిగాయి. ఇవన్నీ సాహిత్య శక్తిగానే కాక సాంస్కృతిక వారసత్వంగా కూడా వ్యక్తమైనాయి. తెలంగాణలో కవి సమ్మేళనాల చరిత్రను వివరించడం ఆసక్తి దాయకంగా వుంది.



తెలంగాణలో తొలికవి సమ్మేళనం క్రీ.శ.ఒకటవ శతాబ్దంలో జరిగి వుండే అవకాశముంది. శాతవాహన రాజైన హాలుడు 273 మంది కవులు రచించిన 738 ప్రాకృత గాథలను సేకరించి, కవితా సంకలనాన్ని రూపొందించాడనే నూతన ప్రతిపాదన మనల్ని ఆలోచింపచేస్తుంది. మలిదశలో తెలంగాణ ఉద్యమ కవిత్వాన్ని పూర్తిగా విశ్లేషిస్తూనే - ఇప్పుడు వస్తున్న తెలంగాణ కవిత్వం ఎలా వుందో, రాబోయే తెలంగాణ కవిత్వం ఎలా వుంటుందో అంచనా వేయడం చూడవచ్చు. 'సినారె ముక్తకాల'ను మన కవితగా గుర్తిస్తూనే, వాటిని టి- 20 మ్యాచ్‌లతో పోల్చడం బాగుంది. 'పసివాళ్ళ ప్రపంచంలో కవి' అంటూ సిధారెడ్డి బాలలపై రాసిన కవితలలోని సొబగులను వివరించారు. మూడు దశాబ్దాలుగా కవిత్వ రంగంలో కృషి చేసిన సూరారం శంకర్ రానురాను గజల్ ప్రక్రియకే అంకితమై పోయారని నిర్ధారించారు. ఎన్ని వచన కవితలు రాసినా - చిన్న కవితకు చిరునామాగా నిలిచిన అలిశెట్టి ప్రభాకర్ మినీ కవితలు విభిన్న విన్యాసాలను ప్రదర్శించగలిగాయంటారు. ప్రజల్ని చైతన్యపరిచే సామాజిక కవిత్వాన్ని ఎక్కువగా, ప్రేమ కవిత్వాన్ని తక్కువగా రాసిన మఖ్దూం మొహియుద్దీన్ తెలంగాణ రైతాంగ పోరాటంలో నిబద్ధతతో పాల్గొని విప్లవ కవిత్వాన్ని రాశారని తెలియజేశారు. తెలంగాణ అంతరాత్మగా కాళోజీ, తర్వాత ఏనుగు నరసింహారెడ్డి, సి.నారాయణరెడ్డి కవితా వైశిష్టాన్ని తెలియజేసే వ్యాసాలున్నాయి. దాసోజు జ్ఞానేశ్వర్, పప్పుల రాజిరెడ్డి, బండారి రాజకుమార్, 'నిజం', బి.యస్.రాములు, వల్సపైడి, జలజం సత్యనారాయణ, దొరవేటి కవితా సంపుటాలకు, 'ఉర్దూ సాహిత్య సౌరభం'పై రాసిన ముందు మాటలలో ఆయా కవితా ధోరణులను - విశిష్టతను తెలియజేశారు.

'స్కెచ్ - గల్పిక' అంటే ఏమిటో నిర్వచించి వివరించిన వ్యాసంతో పాటు, విస్మృత కథకుడు కన్నసామిపై రాసిన అరుదైన వ్యాసాలు ఇందులో వున్నాయి. నెల్లూరు కేశవస్వామి, సురమౌళి, తాయమ్మ కరుణ కథలను విశ్లేషించడంతో పాటు దేవులపల్లి కృష్ణమూర్తి 'తారుమారు'కు, పూర్వ విద్యార్థి రావుల పుల్లాచారి కథా సంపుటి 'బెత్తెడు జాగ'కు రాసిన ముందుమాటలు కూడా వున్నాయి. 1960లో విశ్వనాథ రచించిన 'మ్రోయు తుమ్మెద' ఒక విలక్షణ సంగీత విద్వాంసుని జీవితం ఆధారంగా రాయబడ్డ అర్థ వాస్తవిక, అర్థ కాల్పనిక నవల అని వివరించారు. విశ్వనాథ కరీంనగర్‌లో పనిచేస్తున్న రోజుల్లో రాయటం వలన, ఆ నవలలో ఉత్తర తెలంగాణ చిత్రితమయిందని చెబుతూ, నవలా రచనలో వున్న లొసుగులను కూడా ఎత్తి చూపారు. రావూరి భరద్వాజకు జ్ఞానపీఠం వచ్చిన సందర్భంగా 'పాకుడు రాళ్ళ' నవల మీద రాసిన పరిచయ వ్యాసాన్ని కూడా ఇందులో చేర్చారు. ఆర్.విద్యాసాగర్ రచించిన 'క్షంతవ్యులు' నాటకంలో, మానసిక దౌర్బల్యాలను అధిగమించలేని మనుషులు ఇతరులకు ఎలా సమస్యాత్మకంగా తయారవుతారో వివరిస్తుంది. నాటకంలో కనిపించే 'అతి' ప్రేక్షకులకు షాక్ కలిగించి ఆలోచింపజేస్తుందంటాడు. అన్ని రచనా ప్రక్రియలపై నవీన్ రాసిన వ్యాస సంపుటి 'తెలుగులో ఆధునిక నవల'ను విశ్లేషిస్తూ, అందులో నవీన్ గీసిన 'కలం చిత్రాలు' కొన్ని కనిపిస్తాయని వాటి గురించి తెలియజేశారు. సినారె 'ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు; ప్రయోగములు' లోని ప్రతి అధ్యాయం సర్వ సమగ్రతను సంతరించుకుని, ఆధునిక కవిత్వానికి విజ్ఞాన సర్వస్వంలా తయారయింది. ఇప్పటికీ, ఎప్పటికీ ప్రామాణికమైన రెఫరెన్స్ గ్రంథంగా ఇది నిలిచిపోతుందంటారు. 'వేమన కబీరుల కవిత్వం - తులనాత్మక పరిశీలన'కు రాసిన ముందుమాటలో వారివారి జీవిత సాహిత్యాల ద్వారా, వారిద్దరి మధ్య వున్న పోలికలను విశ్లేషించి చూపడం బాగుంది. బిరుదురాజు రామరాజు విస్మృతి చెందిన ప్రాచీన కవులను 'మరుగున పడిన మాణిక్యాలు'గా, తర్వాత దాని పరివర్ధిత ముద్రణే 'చరిత్ర కెక్కని చరితార్థులు'గా వెలువడింది. ఈ గ్రంథంలో పేర్కొన్న కవిపండితుల రచనలున్న

తెలంగాణలో తొలికవి సమ్మేళనం క్రీ.శ.ఒకటవ శతాబ్దంలో జరిగి వుండే అవకాశముంది. శాతవాహన రాజైన హాలుడు 273 మంది కవులు రచించిన 738 ప్రాకృత గాథలను సేకరించి, కవితా సంకలనాన్ని రూపొందించాడనే నూతన ప్రతిపాదన మనల్ని ఆలోచింపచేస్తుంది. మలిదశలో తెలంగాణ ఉద్యమ కవిత్వాన్ని పూర్తిగా విశ్లేషిస్తూనే - ఇప్పుడు వస్తున్న తెలంగాణ కవిత్వం ఎలా వుందో, రాబోయే తెలంగాణ కవిత్వం ఎలా వుంటుందో అంచనా వేయడం చూడవచ్చు. 'సినారె ముక్తకాల'ను మన కవితగా గుర్తిస్తూనే, వాటిని టి- 20 మ్యాచ్‌లతో పోల్చడం బాగుంది.

తాళపత్ర గ్రంథాలలో చాలావాటిని వారే తొలిసారి పరిశోధించారనీ, ఇవన్నీ సమగ్ర తెలుగు సాహిత్య రచనకు ఉపయోగపతాయని ముందుమాటలో తెలియజేసిన విధానం బాగుంది. అలాగే 'ఎస్వీ రామారావు తెలుగు సాహిత్య చరిత్ర', 'సాహిత్య చరిత్రలో తెలంగాణ', 'గోలకొండ'తో పాటు 'చిందుశ్యామ్' గొప్పదనాన్ని, గోవాలో జరిగిన అఖిల భారతీయ రచయితల సమ్మేళనం తాలూకు విశేషాలకు కూడా తెలియజేశారు.

తెలంగాణ ప్రముఖుల వ్యక్తిత్వ - సాహిత్య చిత్రణలను తెలంగాణ వైతాళికులు, తెలంగాణ చిరస్మరణీయులుగా విభజించి రాసిన విధానం బాగుంది. తెలంగాణ వైతాళికులలో కాళోజీ, అళ్వారుస్వామి, దేవులపల్లి రామానుజరావు, పొట్లపల్లి రామారావు, బిరుదురాజు రామరాజు, సదాశివల గొప్పదనాన్ని పలు వ్యాసాలలో వివరించారు. అలాగే తెలంగాణ చరిత్రలో వందమంది దాకా చిరస్మరణీయులు వుంటారని చెబుతూ, గుణాఢ్యుడు మొదలుకుని ప్రొ॥జయశంకర్ వరకు ముఖ్యమైన వారిని పరిచయం చేశారు. ఇందులో అంపశయ్య నవీన్, రవ్వా శ్రీహరి, డా॥సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, జ్వలితలపై వ్యాసాలు వున్నప్పటికీ 'అస్తమించిన ప్రతిభామూర్తి వల్లపురెడ్డి బుచ్చారెడ్డి'తో పాటుబి.నరసింగరావు సమగ్ర జీవన - సాహిత్య - కళారంగాల చిత్రించిన వ్యాసాలు చెప్పుకోదగినవి. అవునూరి సమ్మయ్య ఉద్యమ వ్యక్తిత్వం, ఆదివాసీ మహిళా కార్యకర్త కనక సుగుణ, ఉద్యమజీవి శంకరయ్య, తిక్కన గాంధీ, పల్లెర్ల హనుమంతరావు, ఫొటోగ్రాఫర్ గోవిందుల విశిష్టతను - గొప్పదనాన్ని వివరించే వ్యాసాలు కూడా ఇందులో వుండడం విశేషం. మంచి పఠనీయతా గుణం కలిగిన ఈ వ్యాసాలు సమాచారాత్మకంగానే కాకుండా విజ్ఞానాత్మకంగా కూడా వున్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

- కె.పి. అశోక్‌కుమార్, 9700000948

వెన్నులో వణుకు పుట్టించాలి..!

రోడ్డుపై, పార్క్‌లో, బజారులో చాలాసార్లు మహిళలు ఒంటరిగా వెళ్లాల్సి వస్తుంది. అలాంటి సమయంలో ఎంతో ధైర్యంగా ఉండాలి. మగవారు ఒంటరిగా ఆడపిల్లలు కనిపించగానే ఏడిపించే, వేధించే ప్రయత్నం చేస్తుంటారు. ఇలాంటి వారికి ఒకసారి గట్టిగా బుద్ధి చెప్పితే మరోసారి ఇంకో ఆడపిల్లను వేధించాలంటే భయపడాలి. ఆడపిల్లల శరీరంపై చేయివేస్తే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందో ఈ వారం చూద్దాం..!

1


పార్క్‌లో ఒంటరిగా జాగింగ్ చేస్తున్న యువతపై వెనక నుంచి వచ్చిన వ్యక్తి చేయి వేశాడు. చుట్టూ ఎవరూ లేని ప్రదేశంలో అపరిచితవ్యక్తి చేయి తనపై పడగానే ఆమె ఉలిక్కి పడ్డారు. ఆసరా కోసం పక్కనే ఉన్న ఇనుప కంచెను గట్టిగా పట్టుకున్నారు.

నిర్మానుష్య ప్రాంతంలో ఆ అపరిచత వ్యక్తి తనపై దాడి చేయడానికే వచ్చాడని ఆమెకు అర్థమయ్యింది. ఒక చేత్తో కంచెను గట్టిగా పట్టుకుని.. మరోచేయి పిడికిలి బిగించి ఆ వ్యక్తి మెడపై పంచ్ ఇచ్చారు.

2


సెల్ఫ్ డిఫెన్స్

ఊహించని ఈ ఎదురుదాడితో ఆమె నడుముపై వేసిన చేతులను తీసి.. కాస్త దూరం జరుగుతాడు. తప్పించుకునేందుకు ప్రయత్నిస్తాడు. వెంటనే ఆ వ్యక్తి జుట్టు పట్టుకోవాలి. కాలితో సెంటర్ పాయింట్‌పై ఒక కిక్ ఇవ్వాలి. అంతే విలవిలలాడిపోతాడు.

3


4


ఇప్పటివరకు ఆసరా కోసం పట్టుకున్న కంచెను వదిలి రెండు చేతులతో ఆ వ్యక్తి జుట్టు పటుకుని కింది వంచుతూ.. మోకాలితో గొంతుపై అటాక్ చేయాలి. ఈ అటాక్స్ అన్నీ వెంటవెంటనే చేయాలి. తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త వహించాలి. మరోసారి ఏ అమ్మాయినైనా ఏడిపించాలన్న ఆలోచన వస్తేనే వెన్నులో వణుకు పుట్టాలి.

కష్టాలు వచ్చినప్పుడు, వేధింపులు, దాడులు జరిగినప్పుడు ఎవరో వస్తారని ఎదురుచూస్తే ప్రయోజనం ఉండదు. ఆత్మధైర్యంలో వాటిని ఎదుర్కొన్నప్పుడే జీవితంలో నిలబడగలుగుతారు.

ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నెషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170
9949039049





ప్రజలతో మమేకమై ఉంటూ.. వారి సమస్యల సాధనకు శాయశక్తుల ప్రయత్నం చేయడమే సివిల్ సర్వెంట్‌గా తన బాధ్యత అంటారు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ వెస్ట్‌జోన్ కమిషనర్ దాసరి హరిచందన ఐఎఎస్. ఏ శాఖలో పనిచేసినా తనదంటూ ప్రత్యేకమైన మార్కు కనిపించేలా ఆమె పనితీరు ఉంటుంది. కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించినా.. మరే ఇతర శాఖలో పనిచేసినా.. తనదైన శైలిలో ప్రజాసమస్యలను పరిష్కరిస్తారు. ఇప్పుడు విశ్వనగరంలో పరిశుభ్రతతో పాటు.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పేపర్‌లెస్ ఆఫీస్‌గా వెస్ట్‌జోన్ మున్సిపల్ ఆఫీస్‌ని మార్చారు. నగరంలో మహిళలకు ప్రత్యేకమైన టాయ్‌లెట్స్ ఏర్పాటుచేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఈనెల 14న ప్రపంచ ప్రేమికుల దినోత్సవాన్ని.. వృద్ధాల విడాకుల దినోత్సవంగా నిర్వహించే పనుల్లో బిజీగా ఉన్నారు. స్వచ్ఛమైన వాతావరణం కోసం 'మనసులు కలపండి.. చెత్తను వేరు చేయండి' అంటున్న ఆమె మానవితో చెప్పిన అంశాలు...

మల్టీటాస్కింగ్ మహిళలకే సాధ్యం

నాన్న దాసరి శ్రీనివాస్, రిటైర్డ్ ఐఎఎస్. అమ్మ గృహిణి, నేను, అన్నయ్య. నాన్న ఐఎఎస్ కావడంతో తరచుగా బదిలీలు ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని జిల్లాలను చిన్నతనంలోనే చూశాను. పదవ తరగతి వరకు జిల్లాల్లోనే చదువుకున్నాను. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో పూర్తి చేశాను. ఆ తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ లండన్‌లో చదివాను. అక్కడే రెండేండ్లు ప్రైవేటుగా ఉద్యోగం చేశాను. ఒక ఏడాది పాటు ప్రపంచ బ్యాంకులోనూ వర్క్ చేశాను. శాస్త్రసాంకేతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను విశ్లేషణాత్మక దృష్టితో పరిశీలించడం నా అలవాటు. నాన్న సివిల్ సర్వెంట్ కావడంతో చిన్నతనం నుంచే ఆయన ప్రభావం నాపై చాలా ఉంది. ఈ జాబ్‌లో ఉండే ఆత్మసంతృప్తి మరే జాబ్‌లోనూ ఉండదు. పాలసీ మేకింగ్‌లో కీలకపాత్ర పోషించే అవకాశం సివిల్స్ ద్వారా మాత్రమే లభిస్తుంది. పిజీ తర్వాత జాబ్ చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాను. ప్రతి ఏడాది సివిల్స్ ఎగ్జామ్ ప్యాట్రన్ మారుతుంది. చుట్టూ ఉండే ప్రపంచాన్ని గమనిస్తూ.. జనరల్ నాలెడ్జ్‌ను పెంచుకునేదాన్ని. నిపుణుల సూచనలు, సలహాలు తీసుకుంటూ ప్రిపరేషన్ కొనసాగించాను. 2010లో ఐఎఎస్‌గా సెలక్ట్ అయ్యాను.

వైజాగ్‌లో ఫస్ట్ పోస్టింగ్...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్ అసిస్టెంట్ కలెక్టర్‌గా ఏడాది పాటు పనిచేశాను. ఆ తర్వాత విజయవాడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించాను. నేషనల్ హైవేను విస్తరించడంతో భాగంగా హైవే సమీపంలోని ఉన్న వ్యవసాయ భూములను రైతుల నుంచి తీసుకోవల్సి వచ్చింది. చాలా టెన్షన్‌గా ఫీల్ అయ్యాను. వారందరినీ ఒప్పించడంతో పాటు మంచి ప్యాకేజీలో నష్టపరిహారం వారికి అందేలా చర్యలు తీసుకున్నాం. అభివృద్ధిలో భాగంగా కొన్నిసార్లు ప్రజలను ఇబ్బంది పెట్టాల్సి వస్తుంది. అయితే జరుగుతున్న అభివృద్ధి తమకోసమే అన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడితే వారే ముందుకు వచ్చి ప్రభుత్వానికి సహకరిస్తారు అన్నది ప్రాక్టికల్‌గా తెలుసుకున్నాను. ఆ తర్వాత జిఎడిలో డిప్యూటీ సెక్రటరీగా కొంతకాలం పనిచేశాను.

పేద వారి సొంత ఇంటి కల నిజం చేస్తూ...

రాష్ట్ర విభజన తర్వాత మున్సిపల్ శాఖలో పనిచేసే అవకాశం వచ్చింది. సెంట్రల్ జోన్‌లో పనిచేసే సమయంలో కవాడిగూడలో ఐడిహెచ్ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను తొమ్మిది నెలల రికార్డు టైమ్‌లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాం. మన రాష్ట్ర ప్రభుత్వం అంచలంచెలుగా మొత్తం లక్షా92వేల మందికి సొంత ఇంటికలను నిజం చేయాలన్న ప్రణాళికతో ఉంది. మరికొన్ని చోట్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.



మహిళలకు ప్రత్యేకంగా..

మల్టీటాస్కింగ్ శక్తి మహిళలకు మాత్రమే ఉంటుంది. అందుకే వారు ఇంట్లో, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తమదైన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ.. సాధికారత దిశగా పరుగు పెడుతున్నారు. అయితే ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పెరిగిన మహిళల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయలు పెరగడం లేదు. ముఖ్యంగా పబ్లిక్ ప్లేసెస్‌లో టాయిలెట్స్ లేకపోవడంతో మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. గంటల తరబడి మలమూత్రవిసర్జనను వాయిదా వేయడం వారి ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. మన నగరంలో మహిళల కోసం ప్రత్యేకంగా 'షి టాయిలెట్స్' నిర్మించాం. రద్దీగా ఉండే ప్రదేశాలను గుర్తించి ఇప్పటివరకు 20వరకు షి టాయిలెట్స్ నిర్మాణం పూర్తి చేశాం. వీటిని శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

స్వచ్ఛ భారత్ దిశగా..

పెరుగుతున్న జనాభా కారణంగా నగరంలో కాలుష్యం పెరిగిపోతుంది. దీన్ని నివారించడానికి పార్క్‌లను అభివృద్ధి చేస్తున్నాం. కాలనీ స్థాయిలోనూ పచ్చదనం పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వీటిలో పాటు చెత్త పెద్ద సమస్యగా మారింది. దీన్ని అధిగమించడానికి తడి, పొడి చెత్తలను వేరు చేసి వాటిని రీసైక్లింగ్ చేస్తున్నాం. కమ్యూనిటీ స్థాయిలో స్వేచ్ఛ దూతలుగా స్వచ్ఛందంగా పనిచేయడానికి చాలామంది మహిళలు ముందుకు వచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యతపై వీరికి శిక్షణ ఇచ్చాం. వీరు ఇంటింటికి తిరిగి చెత్తను బయట పారేయకుండా రిక్షాలోనే వేసేలా అవగాహన కల్పిస్తున్నారు. తడి, పొడి చెత్తలను వేరుచేయడం వల్ల పర్యావరణానికి కలిగే లాభాలను వివరిస్తున్నారు. ఈ రోజు మనం తీసుకునే జాగ్రత్తలు మన ఆరోగ్యానికే కాదు.. రేపటి మన పిల్లల భవిష్యత్‌కు ఎంతో అవసరమని వివరిస్తున్నారు. ఒక్కొక్క మహిళ ఒక శక్తిగా మారి.. వందలాది మందిని స్వచ్ఛ భారత్ దిశగా నడిపిస్తున్నారు.

పేపర్‌లెస్ ఆఫీస్‌గా..

పేపర్ ఎంతో విలువైంది. మనకు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పేపర్‌ను తక్కువగా ఉపయోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. మా ఆఫీస్ కంప్లీట్‌గా పేపర్‌లెస్ ఆఫీస్‌గా మార్చేశాం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు తప్ప ఇతర అన్ని రకాల కార్యకలాపాలు, డాక్యుమెంట్లు ఈ-డాక్యుమెంట్ల రూపంలోనే జారీ చేస్తున్నాం. దీంతో ఫైళ్ళ పెండింగ్ అనేది ఉండదు. ప్రతి పని లోనూ పారదర్శకత ఉంటుంది. రికార్డ్స్ మెయింటైన్ చేయడం సులభమవు తుంది. అంతేకాకుండా ఎకో ఫ్రెండ్లీ ఆఫీస్‌ను ఏర్పాటుచేస్తున్నాం.

ఏ ఇల్లు మునగకుండా..

వర్షాకాలం వచ్చిందంటే లోతట్టు ప్రాంతాల ప్రజలు నానా అవస్థలు పడుతారు. ఈ వానాకాలంలో అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలను ప్రారంభిస్తున్నాం. నగరంలోని అన్ని చెరువుల వివరాలు సేకరించి వాటికి ఎఫ్‌టిఎల్ (ఫూల్ ట్యాంక్ లేవల్) ఏరియాను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నాలాలపై ఉన్న 400 అక్రమ నిర్మాణాలను గుర్తించాం. ముందుగా బాటిల్ నెక్ ఏరియాలో ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రయత్నం చేస్తాం. ప్రజల సహకారం ఉంటేనే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, అభివృద్ధి పనులు తర్వితగతిన పూర్తి అవుతాయి. ప్రజలకు అర్థమయ్యేలా ప్రభుత్వ నిర్ణయాలను వివరించినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

వి. యశోద

ఇట్లచేద్దాం

ఆకుకూరలను పప్పుతో కలిపి వండితే పోషకపదార్థాలు బాగా లభించి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి . ఆకుకూరలను విడిగా వండేటప్పుడు నీళ్లతో ఉడికించి వండాలి. నూనె ఎంత తక్కువగా వాడితే అంత మంచిది.

అజీర్తి సమస్య ఎక్కువైతే!




అజీర్తి సమస్యతో బాధపడుతున్నారా! అయితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. లేదంటే ఇంట్లో అనుదినం ఉపయోగించే పదార్థాలను కింది విధంగా వాడితే మంచి ఫలితం కనిపిస్తుంది. అవేంటో తెలుసుకుందాం!

- వెల్లుల్లి మంచి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. కడుపు నొప్పి, అజీర్తి సమస్య ఉన్నప్పుడు ఒక చెంచా వెల్లుల్లి పేస్టును రెండు గ్లాసు నీటిలో మరిగించుకోవాలి. ఇలా మరిగించుకున్న నీరు గోరు వెచ్చగా ఉన్నప్పుడు తాగితే అజీర్తి సమస్య నుంచి త్వరగా ఉపశమనం పొందుతారు.
- కడుపులో ఉండే మంట, నొప్పి, ఇన్ఫెక్షన్ ను తగ్గించడంలో నిమ్మరసం బాగా పని చేస్తుంది. నిమ్మలో ఆమ్ల గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఒక గ్లాసు నీటిలో నిమ్మరసం కలుపుకొని రోజుకు రెండు సార్లు తాగితే అజీర్తి సమస్య దూరం అవుతుంది.
- ఆపిల్ సైడర్ వెనిగర్ ఆమ్ల గుణాలను కలిగి ఉంటుంది. గ్యాస్ట్రిక్ సమస్యతో బాధ పడే వారు దీన్ని ఉపయోగిస్తే సరిపోతుంది. ఒక గ్లాసు గోరు వెచ్చటి నీటిలో చెంచా ఆపిల్ సైడర్ వెనిగర్‌ను కలుపుకొని తాగాలి. ఇలా తాగితే అజీర్తి సమస్య నుంచి త్వరగా ఉపశమనం పొందుతారు.
- కడుపు అసౌకర్యంగా ఉంటే ఒక కప్పు తులసి ఆకులను గ్లాసు నీటిలో మరిగించుకోవాలి. ఇలా మరిగించుకున్న నీటిలో ఒక చెంచా తేనె కలుపుకొని గోరు వెచ్చగా ఉన్నప్పుడే తాగితే మంచి ఫలితం ఉంటుంది.
- ఫుడ్ పాయిజనింగ్, అజీర్తి సమస్యతో బాధపడే వారు జీలకర్రను ఉపయోగించాలి. కొద్దిగా జీలకర్రను నోట్లో వేసుకొని నమలడం లేదా గోరు వెచ్చటి నీటిలో కలుపుకొని తాగడం వంటివి చేయాలి. ఇలా చేయడం వల్ల అజీర్తి సమస్య, ఇన్ఫెక్షన్స్ దూరం అవుతాయి.



మరియా ఇవానోవ్నా వస్సిలేవా
(ఫిబ్రవరి 12, 1884 - మే 14, 1957)

పేద కళాకారుల కోసం క్యాంటీన్



మేరీ వాస్సియఫ్‌గా రష్యన్ చిత్రకళాసామ్రాజ్యంలో విశిష్ట పేరు ప్రఖ్యాతులు సంసాదించుకున్న కళాకారిణి ఆమే. ఆమె చేతిలో రూపుదిద్దుకున్న ఎన్నో అద్భుతమైన కళాఖండాలు అనేక మ్యూజియమ్స్‌లో ప్రదర్శనకు ఉంచారు. ప్యారిస్‌లోని కళాకారుల్లో ఒకరిగా కీర్తిగాంచారు.

రష్యాలోని స్మోలేనస్క్‌లో సంపన్నుల కుటుంబంలో మేరీ జన్మించారు. తల్లిదండ్రులు ఆమెను డాక్టర్‌గా చూడాలన్న ఆకాంక్షతో వైద్యశాస్త్రాన్ని అధ్యయనం చేయమని ప్రోత్సహించారు. అయితే, చిత్రకళపై చిన్నతనం నుంచి సహజంగా ఏర్పడిన ఆసక్తి వైద్యవిద్యవైపు కాకుండా చిత్రకళవైపు ఆమెను నడిపించింది. 1903లో సెయింట్ పీటర్స్‌బర్గ్ అకాడమీలో చేరారు. అక్కడ కోర్సు పూర్తి చేసిన తర్వాత 1905లో ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌కు వెళ్లారు. ప్రపంచం కళాత్మక నగరంగా పేరుగాంచిన పారిస్‌లోనే ఆమె ఉండిపోయారు. అనేక రష్యన్ వార్తాపత్రికలకు కరస్పాండెంట్‌గా ఉద్యోగం చేస్తూ.. 1908లో అకాడెమీ రస్సే (రష్యన్ అకాడమీ)ను స్థాపించారు. ఆ తర్వాతి ఏడాది నుంచి ఈ అకాడమీ వాసిలెఫ్‌గా మార్చబడింది. 1913 నాటికి ఆమె ఆర్ట్ స్టూడియో విశేషాదరణ పొందింది. కళాత్మక రంగంలోనే కాదు సేవారంగంలోనూ మేరీ ఎంతో కృషి చేశారు. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు, యుద్ధ సమయంలో ఆమె ఫ్రెంచ్ రెడ్ క్రాస్‌లో నర్సుగా స్వచ్ఛందంగా పనిచేశారు. ప్యారిస్‌ని అనేక మంది కళాకారుల కోసం 1915లో క్యాంటీన్ తెరిచారు. అర్ధాకలితో అలమటించే కళాకారులకు తక్కువ ధరకు భోజనం ఇక్కడ లభించేది. విదేశాల్లో తన కళాఖండాలతో అనేక ప్రదర్శనలు నిర్వహించిన తర్వాత ఆమె ఇటలీలో 1929లో వాసిలెఫ్ మ్యూజియాన్ని ప్రారంభించారు.

అ'శోకం' ఆపు



మన్నారం నాగరాజు

త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం అంటూ సీపీఐ(ఎం) కొన్ని ప్రయత్నాలు చేస్తున్నది. సందర్భానుసారంగా.. దశల వారీగా పోరాటాలు, ఉద్యమాలు నిర్మిస్తూ వస్తున్నది. అందులో భాగమే టీమాస్ ఫోరం ఏర్పాటు, 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్' (బీఎల్ఎఫ్) ఆవిర్భావం. అయితే వీటి ఏర్పాటుపై ఇటీవల సీనియర్ జర్నలిస్టుగా చెప్పుకునే టంకశాల అశోక్ రాసిన వ్యాసం నన్ను ఎంతగానో కలవరపెట్టింది. ఆ వ్యాసమంతా ఆయన సొంత వ్యాఖ్యానంగా చెప్పుకోవచ్చు.

అందులో ఆయన సీపీఐ(ఎం)కు కొన్ని ప్రశ్నలు వేశారు. వాటికి ఆ పార్టీ సమాధానం చెప్పటం లేదని ఆరోపించారు. వెక్కిరింతలు.. కొక్కిరింతలతో అసలైన జవాబును దాటవేస్తారని సీపీఐ(ఎం)ను దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య దేశంలో బాధ్యతాయుతమైన పౌరుడిగా ఆయన ఏ అభిప్రాయాన్ని అయినా.. మొహమాటం లేకుండా వ్యక్తపరచవచ్చు. అది ఆయనకు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ప్రాథమిక హక్కు. దాన్ని ఎవ్వరూ కాదనలేరు. ముఖ్యంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ గురించి ఆయన చేసిన విశ్లేషణకు వద్దాం. దళిత బహుజనులలో పిడికెడు మందికి ఏవో పదవులిచ్చి.. ఆ వర్గాలను భ్రమపెట్టి.. ఓట్లు సంపాదించవచ్చని బూర్జువా పార్టీల ఎత్తుగడలను సీపీఐ(ఎం) కూడా అనుసరిస్తున్నదని విమర్శించారు. ఈ విషయంలో అంతకుమించి ఎటువంటి నిజాయితీ గల ఎత్తుగడ లేదని వక్కాణించారు. దళిత బహుజనులు పిడికెడు పదవులు, ఫండ్స్ కోసం బీఎల్ఎఫ్‌లో చేరలేదన్న విషయం ముందుగా ఆయన తెలుసుకోవాలి. బీఎల్ఎఫ్ ఏర్పాటులో పీడిత, తాడితవర్గాలు కీలక పాత్ర పోషించాయి. ఇన్ని మాటలు చెబుతున్న అశోక్, అసలు దళితుడే తెలంగాణ ముఖ్యమంత్రి అవుతాడని మాట మార్చిన కేసీఆర్‌ను ఎందుకు కడిగిపారేయలేదు. కనీసం ఒక్కసారైనా దాని గురించి ఆయన కలం ఎందుకు కదలలేదని యావత్తు దళిత, బహుజన సమాజం అశోక్‌ను ప్రశ్నిస్తున్నది. రిజర్వేషన్ గురించి పోరాడుతున్న మందకృష్ణను కారాగారానికి పంపిన నీచ చరిత్ర టీఆర్ఎస్‌ది కాదా? ఆత్మావలోకనం చేసుకోవాలి. నిత్యం సామాజిక సమస్యలపైన పోరాడుతున్న విమలక్కపై తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసుల గురించి టంకశాల ఎందుకు నోరు మెదపలేకపోతున్నారు.

ఇక సీపీఐ(ఎం) ఏర్పరచిన బీఎల్ఎఫ్ గురించి అశోక్ వ్యాఖ్యానించిన తీరు నిజంగా విమర్శనీయం. ఎందుకంటే దాని ఆశయంలో స్వచ్ఛశీలతను ప్రశ్నించేందుకు అశోక్‌కు లేదు. సీపీఐ(ఎం) రాజకీయ ఐక్య సంఘటనలు రెండు రకాలుగా ఉంటాయని అభివర్ణించారు. అందులో ఒకటి త్రిపుర తరహా వామపక్ష పార్టీల ఫ్రంట్ కాగా రెండోది కేరళ తరహా ఫ్రంట్ అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆయన విశ్లేషణ ప్రకారం ఇంచుమించు కేరళ తరహా ఐక్య సంఘటనను పోలి ఉంటుందని అశోక్ చెప్పిన అంచనా. బహుజన అనే పదం ముందు చేర్చి అంతా సీపీఐ(ఎం) చేస్తుందని అశోక్ చేసిన ఆరోపణ అర్థరహితం. దళిత, బహుజనులకు రావాల్సిన హక్కులు, ప్రతిఫలాలు సాధించే క్రమంలో ఆ పార్టీ నాయకత్వం తీసుకుంటే ఏమిటీ తప్పన్నది నాలాంటి ప్రజాస్వామిక వాదుల ప్రశ్న. ఇక బీఎల్ఎఫ్‌లో లేని సీపీఐ, సీపీఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ) ఆయన సరికొత్త వ్యాఖ్యానం చేశారు. సీపీఐని సరైన విధంగా ఆహ్వానించలేదని ఆయనగారి అసంబద్ధవాదన. సరైన విధంగా ఆహ్వానించకపోవడానికి సీపీఐ(ఎం) దళిత బహుజనుల సారథ్యంలో ఏర్పడింది. ఒక ఫ్రంట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కాదని గుర్తెరగాలి. వారంతా చేసేది పెండ్లి కాదన్న విషయం మరవరాదు. పోరాటంలో ఉండాలన్న కాంక్ష సంబంధిత పార్టీలకు ఉండాల్సిన అవసరం ఉంది. సీపీఐని ఇప్పటికే బీఎల్ఎఫ్, నేతాగణం, సీపీఐ(ఎం) నాయకత్వం స్వయంగా అడిగిన విషయం తెలిసిందే. ఈ అంశాలన్నింటినీ ఎందుకు గమనించడం లేదు. ఫ్రంట్‌లో చేరిన వారిలో వామపక్షాలలో అనేకం లెటర్‌హెడ్ పార్టీలే ఉన్నాయట. దళిత, బహుజనులు అనబడే మరికొన్ని సంఘాలు కూడా లెటర్‌హెడ్ కోవకు చెందినవని ఆయన ప్రధాన ఆరోపణ. వాటిలో సగానికి పైగా పేర్లను లోగడ విన్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ పార్టీలు.. ఇదే లెటర్‌హెడ్ సంఘాలుగా అశోక్ వ్యాఖ్యానిస్తున్నవన్నీ పోరాడాయి కదా. అప్పుడు ఆయనకు ఈ విషయం గుర్తు రాలేదా? ఇంకా చెప్పాలంటే తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రస్తుతం ఏ లెటర్ హెడ్‌తో అశోక్ వ్యాఖ్యానాలు చేస్తున్నారు. కనీసం ఏ లెటర్‌హెడ్ లేకుండా ఒక పార్టీ, ప్రభుత్వానికి బాడుగ రాతలు రాస్తున్న వారు చేసే ప్రకటనలు అర్థరహితం. ఇటువంటి రాతలకంటే నేరుగా సంబంధిత పార్టీ సభ్యత్వం, అధికార ప్రతినిధి పదవి తీసుకొని మాట్లాడితే కనీసం రాజకీయ అభిప్రాయంగా సమాజంలో విలువైనా ఉంటుంది. మల్లన్నసాగర్ పోరాటంలో రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు చేస్తుంటే టంకశాల నోరేందుకు మూగ బోయిందని సామాజిక ప్రపంచం అడుగుతున్నది. రాష్ట్రంలో భూమిలేని దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని కేవలం కొద్ది మందికి ఇచ్చిన ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయటం లేదు. స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు, ఉద్యోగ నోటిఫికేషన్లతో ప్రభుత్వం ఆడుతున్న ఆటలపై ఎప్పుడూ ఆయన కలం ఎక్కుపెట్టలేదెందుకు? కానీ ఆయన మాత్రం ప్రజాసంఘాలపై చులకన భావం, సీపీఐ(ఎం)పై అక్కసు కక్కుతూనే ఉంటారు. అయితే, ఈ అక్కసు సిద్ధాంతపరమైందా? లేక వ్యక్తిగతమైందా అన్న విషయంపై ఆయన దగ్గరి నుంచే స్పష్టత రావాల్సింది.

ప్రజా సమస్యలపై స్పందించడం మరిచి అడ్డదిడ్డంగా ఆరోపణలు చేయడం ఎంతో బాధాకరం. దళితులు, బహుజనులు ఏర్పాటు చేసుకున్న ఫ్రంట్‌పై విచ్చలవిడిగా మాట్లాడి ఆయన స్థాయిని దిగజార్చుకోవద్దు. "ఫైట్ అండ్ లెట్ ఫైట్" అన్న ఇంగ్లీష్ మాట స్ఫూర్తిని ఆయన ఇప్పటికైనా కొనసాగించాలి. ఆయనకు ఏమైనా లావాదేవీలు ప్రభుత్వం, అధికార పార్టీతో ఉంటే తెల్చుకోవచ్చు. ప్రభుత్వ పాలన గురించి అద్భుతమైన వ్యాఖ్యానాలు, కవితలతో రాసుకోవచ్చు. కానీ సమసమాజ నిర్మాణానికై దళిత బహుజనుల హక్కుల కోసం నిరంతరం ఎటువంటి లాభం లేకుండా పోరాడుతున్న తమ లాంటి పార్టీలను కించపరిస్తే ఊరుకునేది లేదు. "యాక్షన్ బై రియాక్షన్" అన్న న్యూటన్ గమన సిద్ధాంతం ఇక్కడ అన్వయించుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వానికి విధేయత ఉండటం అశోక్ వ్యక్తిగత అభిప్రాయమైతే మాకు ఎటువంటి సమస్యలేదు. కానీ నిజాయితీపై అక్షరదాడి చేస్తామంటే అంతే స్థాయిలో అక్షరదాడి చేసేందుకు తాము కూడా సిద్ధమే అన్న విషయం మరవరాదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ పార్టీ ఫ్రంట్ పుట్టుకొచ్చినా ఆశీర్వదించడం కనీస ధర్మమనే విషయం గుర్తెరగాలి. ఇటువంటి అర్థసత్య బాడుగ రాతలు రాసి తనకున్న స్థాయిని కోల్పోవద్దని కోరుతున్నాను.

టంకశాల అశోక్‌కు సామాన్య నాయకుడిగా కొన్ని ప్రశ్నలు

- రైతులు ఆత్మహత్యలు మీకు కనిపించడం లేదా? మూడున్నరేండ్ల పాలనలో టీఆర్ఎస్ రైతుల ఆత్మహ్యతలు ఆపేందుకు తీసుకున్న చర్యలేమిటి?
- కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలతో మోసపోతున్న రైతులకు ప్రభుత్వం ఏమి చేసింది.
- కేంద్రంలో మెజార్టీ మతోన్మాద పార్టీ బీజేపీతో రాష్ట్రంలో మైనారిటీ మతోన్మాద పార్టీ ఏఐఎంఐఎంతో స్నేహంగా ఉంటున్న కేసీఆర్ ద్వంద్వ వైఖరిపై మీ అభిప్రాయం ఏంటీ?
- ప్రాజెక్టులతో భూమి కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం ఏమి చేసింది?
- రాష్ట్రంలో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలపై ప్రభుత్వ చర్యలేంటి?
- కేజీ టు పీజీ ఉచిత విద్య హామీ ఏమైంది.
- రాష్ట్రంలో నిజాం షుగర్, సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్, డీబీఆర్, ఐడీపీఎల్ పున: ప్రారంభానికి ప్రభుత్వ తీసుకున్న చర్యలు ఏంటీ?
- నిరుద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే భరోసా ఏంటి?
- వీధి కుక్కల బెడదతో ఉన్న హైదరాబాద్‌ను విశ్వనగరంగా ఎప్పుడు మారుస్తారు?
- నగరంలో మురికి వాడలు నిర్మూలించి ప్రభుత్వం చెప్పిన స్కైవేల పరిస్థితి ఏంటి?
- రాష్ట్ర మంత్రివర్గంలో మహిళలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఎంతమాత్రం ఇస్తున్నది.
- తెలంగాణ ద్రోహులుగా పేర్కొన్న వారికి రాష్ట్ర మంత్రి వర్గంలో పదవులు ఇవ్వడాన్ని ఏ విధంగా సమర్థిస్తారు.

సెల్ : 95508 44433

సెక్యులర్ దేవుడి దగ్గర బీజేపీ మతచిచ్చు

కందారపు మురళి

తిరుమల - తిరుపతి దేవస్థానాన్ని కేంద్రంగా చేసుకుని భారతీయ జనతాపార్టీ, సంఘ్ పరివార్ శక్తులు మత చిచ్చును రేపటానికి పథకం ప్రకారం పావులు కదుపుతున్నాయి. గత కొన్నేండ్లుగా అనేక ప్రయత్నాలు చేసి విఫలమైన బీజేపీ తాజాగా అన్యమతస్థులు ఉద్యోగులుగా టీటీడీలో ఉండరాదని రాద్ధాంతం చేస్తున్నది. ఈ రాద్ధాంతానికి టీటీడీ ఈఓ.అనిల్‌కుమార్ సింఘాల్ ఉద్యోగులకు ఇచ్చిన నోటీసులు ఆజ్యం పోశాయి. దీంతో టీటీడీలో జరుగుతున్న పరిణామాలు ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న తిరుమల - తిరుపతిలలో ఏమవుతుందోనన్న ఆందోళన ప్రజలలో వ్యక్తమవుతున్నది.

టీటీడీ యాజమాన్యం 45 మంది ఉద్యోగులను హైందవేతరులుగా గుర్తించి ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించరాదో మూడు వారాలలో తెలియజేయాలని షోకాజ్ నోటీసును జారీ చేసింది. తొలగించటానికి పూనుకున్న ఉద్యోగులలో 36 మంది ముస్లింలు, 9 మంది క్రైస్తవులు ఉన్నారు. హిందువులు కాదని తెలిసే టీటీడీ యాజమాన్యం వీరిని ఉద్యోగులుగా తీసుకున్నది. వీరిలో రాబోయే 6 నెలల్లో రిటైరయ్యేవారు, 28 ఏండ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా ఉండటం విశేషం. పైగా వీరు తమ మతాన్ని, కులాన్ని దాచిపెట్టుకుని ఉద్యోగాలు పొందలేదు. ఇప్పుడు జీవోను సాకుగా చూపి నియామకమే వివాదమైందని తొలగించి తీరాల్సిందేనని యాజమాన్యం పట్టుబడుతున్నది. జీవో రాకముందే నియమించబడ్డ ఉద్యోగులను ఇప్పుడు జీవోపేరు చెప్పి తొలగించాలనుకోవటం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమైనది. 1989లో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి మత క్రతువులలో హిందూయేతరులు ఉండరాదని జీవోతెచ్చారు. 2007లో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తన మీద వస్తున్న విమర్శల నుంచి బయటపడటానికి టీటీడీ సంస్థలు గానీ, టీటీడీ నిధులతో నడిచే సంస్థలలో హిందూయేతరుల నియామకం వద్దని జీవోఇచ్చారు. జీవోలో టీటీడీ నియమ నిబంధనలు వృత్తి రీత్యా అమలు జరపాలని స్పష్టంగా పేర్కొన్నారు.

జీవోలు రాకముందే టీటీడీలో ఉద్యోగ, నియామకాలు జరిగాయి. టీటీడీలో అన్యమతస్థులు అనేక మంది గతం నుంచి పనిచేస్తున్నారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బీజేపీలు ఓ పథకం ప్రకారం దాడి చేస్తుండటంతో పై జీవోలు వెలువడ్డాయి. తిరుమల స్వామివారే మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న దేవుడు ముస్లిం వనిత బీబీ నాంచారిని వివాహమాడినట్టుగా టీటీడీ ప్రచురించిన పుస్తకాలలో ఉంది. ఆలయంలో బీబీ నాంచారి విగ్రహం కూడా వందల ఏండ్లుగా ఉంది. మొదటి భార్య పద్మావతీ దేవి తిరుచానూరు పద్మావతి ఆలయంలో కొండ కింద ఉంటే రెండవ భార్య బీబీ నాంచారి తిరుమల ఆలయంలోనే ఉండటం విశేషం. ముస్లిం రాజులు శ్రీవారిని తమ అల్లుడుగా ప్రకటించుకున్నారు. చిత్తూరు జిల్లాలో పలుచోట్ల శనివారాలలో ముస్లింలు 'ఒక్క పొద్దు' (ఉపవాసం) పాటిస్తారు. కొందరు శనివారంనాడు చెప్పులు ధరించరు. నేటికీ తిరుపతిలోని నవాబుపేట, గాలివీధి లాంటి చోట్ల ఈ పద్ధతులు పాటించే వారు ఉన్నారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలలో స్వామి వారికి నిర్వహించే సేవలలో "బ్యాక్ సవారీ" ముఖ్యమైంది. బ్యాక్‌సవారీ అంటే దేవుడి ఉత్సవ విగ్రహాలు వెనుకకు నడిపిస్తారు. ఈ సేవను ప్రవేశపెట్టింది ముస్లిం రాజులే. ముస్లిం రాజులు సమర్పించిన ఆభరణాలను ఇప్పటికీ అలంకరిస్తున్నారు. అంతెందుకు ముఖ్యమైన సేవ 'అష్టదళ పాద పద్మారాధన'లో వినియోగించే 108 తామర పూలను సమర్పించుకున్నది ఓ ముస్లిం భక్తుడేనని మాజీ ఈవో పివిఆర్‌కె. ప్రసాద్ స్వయంగా తన రచనలో పేర్కొన్నారు. నాదస్వర బ్రహ్మగా పేరు గాంచిన సుభాన్ కాశీం అనే ముస్లిం ఇప్పటికీ తిరుమల ఆస్థాన విద్వాంసుడిగా కొనసాగుతున్నారు. స్వామివారి క్యాలెండర్లలో, చిత్రపటాలలో కనిపించే నిలువెత్తు విగ్రహ నమూనాను తయారు చేసింది ఓ ముస్లిమే. తిరుపతి గాలివీధికి చెందిన పటాల గౌస్ సాహెబ్ మహంతుల కాలంలో వెంకటేశ్వర స్వామి చిత్ర పటాలను అమ్మేవారు. ఆయన పేరుతో "రిజిస్టర్డ్ ప్రింటింగ్" అనుమతి ఉన్నది. ఆయన వారసులు తిరుపతి గాలివీధిలో ఉన్నారు. నైవేద్యం సమర్పించే 'మన్రో గంగాళం' బ్రిటిష్ కాలంలో కడప కలెక్టర్‌గా ఉండి రాయలసీమ జిల్లాలకు ఇన్ ఛార్జిగా పని చేసిన 'మన్రో' అందజేసినది. ఈయన క్రైస్తవుడు. ఇప్పటికీ మన్రో గంగాళంలోనే నైవేద్యం సమర్పించటం ఆనవాయితీ. తిరుమల గోపురం 'ఆనందనిలయం'కు బంగారు లేపనాన్ని పూసింది తిరుపతి బజారు వీధికి చెందిన టింకరింగ్ పనిచేసే రహీం సాహెబ్. వీరి వారసులు తిరుపతిలో రౌనక్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో ఇప్పటికీ వ్యాపార సంస్థను నడుపుతున్నారు. ఈ రహీం సాహెబ్ గోవిందరాజస్వామి ఆలయగోపురానికి "కళశాలలు" తయారు చేసి అమర్చాడు. జవ్వాద్ హుసేన్ తెలుగు లెక్చరర్‌గా టీటీడీ కళాశాలలో పనిచేశారు. ఈయన స్వామి వారిపై 700 పేజీల రచనతోపాటు తిరుమల శ్రీవారి వైభవం గురించి పుస్తకాలు రాశారు. జవ్వాద్ హుసేన్ మధురమైన తెలుగుకు పెట్టింది పేరు. ఆయన పేరు తెలియని సాహితీ ప్రియులు లేరు. ఆయన తదనంతరం ఆయన కుమారుడు ముస్తాక్ టీటీడీలో ఉద్యోగం పొందారు. ముస్తాక్ విధి నిర్వహణలో అంకితమున్న వారు. స్వామివారి భక్తుడు. ఈయనకు టీటీడీ తొలగింపు నోటీసులు ఇచ్చింది. సయ్యద్ బాషా ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో డ్రైవర్. ఈయన తండ్రి సైన్యంలో ఉండి పాకిస్తాన్‌పై యుద్ధంచేసి రాష్ట్రపతి అవార్డ్ పొంది ఉద్యోగం సాధించాడు. ఈయన గతించిన తరువాత ఆ ఉద్యోగాన్ని బాషా పొందారు. బాషా గురించి టీటీడీలో ఎవరినడిగినా స్వామివారి భక్తుడనే చెబుతారు. ఈయనకు నోటీసు ఇచ్చారు. సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న ఆలాం ఆలీ దేశ మంతటా తిరిగి శ్రీవారి వైభవాన్ని నాటక రూపంలో ప్రజల కు చాటారు. బర్డ్ ఆస్పత్రిలో పనిచేస్తున్న రషీద్, పగడాల భాగ్యమ్మలు కూడా భక్తులే. ప్రతి శనివారం ఆస్పత్రిలో ప్రసా దాన్ని భక్తులకు పంచుతారు. వీరి పిల్లలు, కుటుంబసభ్యులు హిందూ సాంప్రదాయాలను పాటిస్తారు. వీరికి కూడా నోటీ సులు అందించారు. సందీప్ అనే యువకుడు తిరుమలలో సాంప్రదాయ హిందూ వివాహం చేసుకున్నారు. తల్లి, తండ్రి హిందువులే. స్కూల్‌లో విద్యాభ్యాసం కోసం క్రిస్టియన్‌గా రాయించారు. తాను హిందువుగా మారటానికి సకల ప్రయ త్నాలు చేశారు. పీఠాధిపతుల్ని కూడా కలిశారు. హిందువు కాలేకపోయారు. ఈయనకు టీటీడీ నోటీసులిచ్చింది. వల్లూరి చిన్నయ్య దూదేకుల కులానికి చెందిన వారు. హిందూ సాంప్రదాయాలు పాటిస్తారు. నువ్వు ముస్లిం అంటూ టీటీడీ నోటీసు ఇచ్చింది. నేను ముస్లింను కాదని చెబుతున్నా విని పించుకోవటం లేదంటున్నారు చిన్నయ్య. టీటీడీ నియమా లను పాటించాలని జీవోలో ఉన్నది. నోటీసు అందుకున్న 45 మంది ఉద్యోగులు టీటీడీ నియమాలను పాటిస్తామని గతంలోనే ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకార పత్రంపై సంతకాలు చేశారు (ఈ ప్రమాణం టీటీడీ ఉద్యోగులందరూ విధిగా చేయాలి). ప్రతి శనివారం పంచెలు కట్టుకుని విధుల కు హాజరవుతారు. టీటీడీ నియమ నిబంధనలను పాటిస్తు న్నా టీటీడీ యాజమాన్యం నోటీసులివ్వటమేమిటని రిటైర్డు జిల్లా జడ్జి పెనుమూరు గుర్రప్ప ప్రశ్నించారు. అసలు జీవో జారీ చేయటమే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఈ జీవోల ను కోర్టులో ఛాలెంజ్ చేయాలని సూచించారు. వెంకటేశ్వర స్వామి చరిత్రలోనే మత సామరస్యం ఒక భాగం కాగా సం ఘ్ పరివార్ శక్తులు అదే పనిగా శ్రీవారిని హిందూ దేవుడిగా ప్రచారం చేస్తుండటం అన్యాయం. ఇతర మతస్థులు దర్శనం చేసుకోవచ్చు కానీ, స్వామివారి భక్తులుగా టీటీడీలో ఉద్యోగం చేయకూడదని తిరకాసు మాటలు చెబుతున్నారు.

అయినా ఇన్ని రోజులు రాని ఈ సమస్య ఇప్పుడెందుకు వచ్చిందనే చర్చ మొదలైంది. టీటీడీ ఈవోలుగా గతంలో హేమాహేమీలైన సీనియర్ ఐఏఎస్‌లు ఉన్నప్పుడు చేయలేని దుస్సాహసానికి ప్రస్తుత ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఎందుకు ఒడిగట్టారనే చర్చ జరుగుతున్నది. ఈవో సింఘాల్ నియామకమే వివాదస్పదమైనది. బీజేపీ వత్తిడి మేరకు ఉత్తరాదికి చెందిన ఐఏఎస్‌ను నియమించారని కొందరు సీనియర్ అధికారులు ప్రస్తావించారు. ఈ వివాదం ఇంకా సమసిపోలేదు. ఈవోగా సింఘాల్ బాధ్యతలు తీసుకునే రోజున సంఘ్ అధినేత ప్రవీణ్ తొగాడియా తిరుపతి రావటం, ఈవోతో సమావేశం కావటం పత్రికలలో వార్తలు రావటంతో ఈవో ద్వారా సంఘ్ పరివార్ శక్తులు మత చిచ్చుకు ఆజ్యం పోస్తారేమోనన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు వాస్తవ రూపం దాల్చింది. హిందూయేతరులు టీటీడీలో ఉద్యోగాలు చేయకూడదని బీజేపీ నేతలు ఈవోకు వినతి పత్రం ఇవ్వటం, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లు ప్రకటనలు చేయటం, ఈవో అనిల్ సింఘాల్ వెంటనే నోటీసులు ఇవ్వటంతో దీని వెనుక సంఘ్ పరివార్ శక్తుల కుట్ర ఉందని స్పష్టంగా అర్థమైంది. బీజేపీ అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత మత వైషమ్యాలను తిరుపతిలో పెంచటానికి అదే పనిగా ప్రయత్నాలు చేసింది. తిరుపతి నగరాభివృద్ధిలో భాగంగా భూగర్భ డ్రైనేజి నిర్మాణానికి టీటీడీ నిధులు రూ.25 కోట్లు వెచ్చించటాన్ని సవాలు చేస్తూ సంఘ్ పరివారం కోర్టుకెక్కి నిలుపుదల చేయించారు. కోర్టు కేసు కొట్టి వేసింది. రూ.25 కోట్లు ఖర్చు కాస్తా రూ.100 కోట్లకు చేరుకుంది. ఐవైఆర్ క్రిష్టారావు ఈవోగా ఉన్న సమయంలో టీటీడీ ఉద్యోగులకు యాజమాన్యం ఇండ్ల స్థలాలు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకెక్కింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో వ్యాజ్యం నడుపుతున్నది. చంద్రగిరిలో పేద ముస్లిం బాలికలకు చదువు నేర్పిస్తున్న విద్యా సంస్థను తీవ్రవాద కేంద్రమని ప్రచారం చేసి ఆ స్కూలును మూసివేయాలని హిందూ-ముస్లింల మధ్య ఘర్షణలు సృష్టించాలని ప్రయత్నించింది. తిరుమల ఏడు కొండలను రెండు కొండలుగా చేయాలన్న కుట్ర సాగుతున్నదనీ, కొండపై చర్చి నిర్మాణం జరుగుతున్నదనీ, మెట్లదారిలో ఏసుక్రీస్తు శిలువ పెట్టారనీ తప్పుడు ప్రచారాలు చేశారు. కరపత్రాలను పంచారు. తిరుచానూరు మాస్టర్ ప్లాను పనులు చేపట్టినప్పుడు ఆ ప్రాంతంలోని మసీదులు, చర్చిలు పడగొట్టాలని ఉద్రిక్తతను పెంచారు. ఈ సమస్యలపై కర్ణాటక రాష్ట్రంలో, ఢిల్లీలో ప్రదర్శనలు జరిగాయి. సంఘ్ పరివార్ శక్తులు ఒక పథకం ప్రకారం తిరుపతిని అయోధ్యలాగా మార్చి దేశమంతటా మత ఉద్రిక్తతలు పెంచాలన్న కుట్ర వీరి మదిలో ఉంది. తాజాగా జరుగుతున్న పరిణామాలు ఇందుకు ఊతమిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తతతో లేకుంటే ఈ పరివారం ప్రశాంతతకు మారు పేరుగా ఉన్న తిరుపతిలో చిక్కులు సృష్టించవచ్చు, బహుపరాక్.

kandharapu@gmail.com

సమాజంలో ఫ్యూడల్ అవశేషాలను అధిగమించాలి



ప్రొ॥వెంకట్ దాస్

బానిసల తిరుగు బాటును
యజమాని ఒప్పుకోడు
...
అంబేద్కర్ మాటను
మనువాది ఒప్పుకోడు
...
గొర్లకాపరి సంరక్షణను
తోడేలు ఒప్పుకోదు...
దరిద్రం కష్టాలను
ఐశ్వర్యం ఒప్పుకోదు...
ఈ తిరుగుబాటు, ఈ సంరక్షణ
ఒకరికి స్వాతంత్ర పరిరక్షణగాను
మరొకరికి స్వాతంత్ర విధ్వంసంగాను
కనిపిస్తాయి ...
ఐశ్వర్యం అరుపులను యజమాని ఆగడాలను,
మనువాది (మొసలి)కన్నీళ్లను ,
తోడేలు బెదిరింపులను
నిలువరించడానికి ...
మార్క్స్ - బానిస,
అంబేద్కర్ - గొర్ల కాపరి
ఒక్కటై నడవాలి ...
ఒకటిగా పోరాడడం
కర్తవ్యం...
అందుకు
సిద్ధంగా ఉండడం
అనివార్యం...
యుద్ధం అనివార్యం
అయినప్పుడు
సిద్ధంగా లేనివాడు
ఓడిపోతాడు
సంఘం
మార్పు కోరుకుంటుంది ...
మనస్సు అభివృద్ధి
కోరుకుంటుంది...
అందువలన
యుద్ధం మొదలైంది
నీలోన-నాలోన
మరియు సంఘంలోన

మాటతప్పి, మడమతిప్పే తెలంగాణ ఆధిపత్యవాదులు, బహుజన తెలంగాణను కష్టాలనుండి, కన్నీళ్లనుండి బంధవిముక్తి చేయలేవు. సామాజిక తెలంగాణను సాధించలేవు. గొర్లు, బర్లు, చేపపిల్లలు, ఈతచెట్లు, కల్లుముంతలతో ప్రజలను మోసంచేసి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్న కేసీఆర్ గారూ మీరు విద్యార్థిలోకానికిచ్చిన మాట మరిచితిరా? తెలంగాణ విద్యార్థులు...ఇంటికో ఉద్యోగమంటే ఆశపడి, ఆవేశపడి, ప్రాణాలను సైతం లెక్కచేయక 1200 మంది బలిదానాలతో తెలంగాణను బంగారు పళ్లెంలో మోసుకొచ్చి మీ చేతిలో పెట్టింద్రు. బంగారు పళ్లెంను మీ ఇంట్లో దాచేసి, ఆ పళ్లెంలోనుంచి తెలంగాణను తోసేసి, మట్టిలో మాజీవితాలను కలిపేసి మీరిప్పుడు బంగారు తెలంగాణ... బంగారు తెలంగాణ... అని అరుస్తుంటే వందిమాగదులుగా మారిన కొద్దిమంది మేధావివర్గం ఇంకా మిమ్ములను నమ్మి మోసపోవడానికి సిద్ధంగా ఉన్నరేమో కానీ ... సమస్త ప్రజానీకంలో, విద్యార్థి లోకంలో మీపైనా, మీ ప్రభుత్వంపైనా పెట్టుకున్న నమ్మకాలు పేక మేడల్లా మా మదిలోనుంచి కూలిపోతున్నాయి.

ప్రియమైన ప్రజలారా..

మన బహుజన మేధావి వర్గం (ఓయూ, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు అధ్యాపకులు) దొరల తెలంగాణ వద్దు, సామాజిక తెలంగాణే ముద్దని నినదించారు. నాటి తెలంగాణ అవశ్యకత దష్ట్యా ... మేధావి వర్గం వెంట ర్యాలీ కాలేకపోయాము. ఇది మన అందరికి పెద్ద చారిత్రిక తప్పిదమై నేడు మన బతుకులను చిదిమేస్తున్నది, చిందరవందర చేస్తున్నది. అయ్యా సీఎం గారు, ఇంటికో ఉద్యోగమంటివి... ఏది ఆ ఉద్యోగమని ప్రశ్నిద్దామంటే, సభలు, సమావేశాలు, నిరసనలు తెలిపే అవకాశాలను మీ ఉక్కు పాదంతో తొక్కేస్తివి. ఏడు పదుల ఈ స్వతంత్ర్య కాలంలో జమీందార్లు, జాగీర్దార్లు, దొరలు... కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, తెరాస జెండాలకింద తమ అజెండాను నిస్సిగ్గుగా అమలు పరుస్తున్న కారణంగా బహుజనులు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో న్యాయమైన వాటాను అందుకోలేకపోతున్నారు. బీజేపీ లాంటి మనువాద పార్టీలు మరోఅడుగు ముందుకేసి డా॥బిఆర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం బాగాలేదని, మార్చేసుకుందామని, అవకాశాలను దోచేసుకుందామని తెగ సంబరపడిపోతున్నారు. వీరి ఆటలకు, ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైనది.

ప్రియమైన ప్రజలారా..

కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు లాల్ నీల్ జెండాలుగా ఏకం కావాలని నినదిస్తున్నారు. వారిని మనం ఏవిధంగా అర్థం చేసుకోవాలి? అన్న మౌలిక ప్రశ్నకు సమాధానాన్ని వెతుక్కోవాలి. బహుజనులు అంబేద్కరిజంను కౌగిలించేకుంటే కమ్యూనిస్టులు సోషలిజం, కమ్యూనిజంతో పెనవేసుకున్నారు. సిద్ధాంత పరంగా అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు వేరు. యుద్ధ మార్గాలు వేరు, కానీ యుద్ధ ఫలాలు ఒక్కటే. దోపిడీ అంతం కావడానికి పోరాడాలి అనేది కమ్యూనిస్టు సిద్ధాంతం. దోపిడీ అంతం కావడానికి రాజ్యాధికారం కావాలనేది బహుజన సిద్ధాంతం. బహుజనుల రాజ్యాధికార ఆకాంక్ష న్యాయమైనదేనని గుర్తించి ఆకాంక్షలను నెరవేర్చడానికి కమ్యూనిస్టులు తమ పోరాటమార్గాలను అనుసంధానం చేయాలనుకోవడమే ఒక నూతన ప్రక్రియ. అందుకు సీపీఐ(ఎం) చొరవ తీసుకొని తెలంగాణ రాష్ట్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఏర్పాటు చేయడం భారత దేశ చరిత్రలోనే ఆహ్వానించదగ్గ పరిణామం. కమ్యూనిస్టులు ఇంత శ్రమపడి బహుజనులకు రాజదండము అందిస్తే సమాజానికి ఏం మేలు జరుగుతుంది? అనే ప్రశ్నకు సంధానంతో నా వ్యాసాన్ని ముగిస్తాను. ప్రపంచంలోని దేశాలు ఎన్నో పోరాటాల తరువాత తమ రాచరిక వ్యవస్థను రద్దు చేసుకొ ని కమ్యూనిస్టు దేశాలుగా లేదా ప్రజాస్వామ్య దేశాలుగా మనుగడ సాగిస్తున్నాయి. చైనా కమ్యూనిస్ట్ రాజ్యంగా అవతరిస్తే భారతదేశం ప్ర జాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించింది. అనగా నేడు ప్రపంచ దేశాలు కమ్యూనిస్టు రాజ్యాలుగా లేదా ప్రజాస్వామ్య రాజ్యాలుగా ఎదుగుతున్న దశ. కులం ప్రధాన అడ్డంకిగా మారడం వలన భారత దేశంలో అంబేద్కర్ కలలుగన్న ఫలప్రదమైన ప్రజాస్వామ్య ప్రక్రియను వేగవంతం చేయలేకపోయాము. అదేవిధంగా కులం నేటికీ భారతదేశాన్ని కమ్యూనిస్ట్ రాజ్యంగా మార్చడానికి భారత కమ్యూనిస్టులకు అడ్డుతగులుతుంది. పారిశ్రామిక విప్లవం ఫలితంగా బలోపేతమైన బూర్జువాలు, భూస్వామ్య వ్యవస్థను, దాని భావజాలాన్ని నాశనం చేసి సోషలిస్ట్ విప్లవానికి దారులు వేస్తారని కారల్‌మార్క్స్ సూత్రీకరిస్తాడు. భారతదేశంలో బూర్జువాలు, పెట్టీ బూర్జువాలు ఫ్యూడల్ అవశేషాల ను అంతమొందించే బదులు వాటిని కాపాడుతూ ముందుకు సాగుతున్నారు. పైన పేర్కొన్న మార్క్స్ సూత్రీకరణ భారతదేశంలో అమలు కాకపోవడానికి కులం ప్రధాన అడ్డంకని గుర్తించాలి. కులం ఉపరితల సమస్య కాదు పునాది సమస్యని తేలిపోయింది. కులాన్ని కూకటి వేళ్లతో పెకిలించడానికి అది అంత సులువైన పనేంకాదు. పీడిత తాడిత కులాల ఆయుధమే బహుజన సమాజ నిర్మాణం. ఆ బహుజన సమాజం అధికారంలోకి రావడానికి అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు కలిసి పనిచేయాలి. బహుజనులు అధికారంలోకి రావడంతో భారతదేశంలో ఫ్యూడల్ అవశేషాలు నశిస్తాయి. అప్పుడు భారత సమాజంలో కులాల కుంపట్లు సిగపట్లుండవు. ఈవిధంగా మన దేశంలో ఫ్యూ డల్ భావజాలాల అవశేషాలు నశించిన తరువా త కమ్యూనిస్టు మరియు అంబేద్కరిస్టులు ఈ దేశాన్ని మార్క్స్ మహోపాధ్యాయులు చెప్పిన కమ్యూనిస్టు-సోషలిస్ట్ దేశంగా మారుస్తారా లేదా అంబేద్కర్ ఎన్నుకున్న ప్రజాస్వామ్య ప్రక్రియలో కొనసాగుతారా అనేది రాబోయే తరాలు నిర్ణయించుకుంటాయి. ప్రస్తుత తక్షణ కర్తవ్యం ఫ్యూడల్ అవశేషాలను అంతమొందించడమే. అందుకోసం కమ్యూనిస్టులు అంబేద్కరిస్టులు కలిసి పని చేయాలి. ఆ దిశలో చొరవ తీసుకొని తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటు చేసి ముందుకు కదులుతున్న సీపీఐ(ఎం) మరి యు దాని మిత్రపక్షాలను అభినందిద్దాము, ఆదరిద్దాము.

సెల్ : 9440488428

ఆర్థిక అసమానతలు.. పెట్టుబడిదారీ వ్యవస్థ పాపాలు



ముహమ్మద్ ముజాహిద్

మన దేశ ప్రధాని మంత్రివర్యుల వారి 'సబ్ కే సాత్ సబ్ కా వికాస్' నినాదానికే పరిమితమైనది. ఎందుకంటే వికాస్ అనేది అందరికోసం కాదని కొందరి కోసమేనని రుజువైనది. కేవలం ఒక్కశాతం వారికే ప్రగతి, వికాసాలు పరిమితమయ్యాయి. మిగతా వారిలో కొన్ని చోట్ల ఆకలి మరణాలు సంభవిస్తుంటే, మరికొన్ని చోట్ల అన్నదాత చితికిపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్నాడు. పంటలు చేతికిరాక, పండినా గిట్టుబాటు ధరలు రాక హతాన్మరణం చెందుతున్నారు. దేశ నిరుద్యోగులు ఉపాధికోసం ముప్పతిప్పలు పడుతున్నారు. ఉద్యోగాన్వేషణలో వలసబాట పడుతున్నాడు. ఒకవేళ ఏదైనా కంపెనీలో వందల ఖాళీలు ఉంటే లక్షలాదిమంది ఉద్యోగాలకోసం, ఇంటర్వ్యూల కోసం క్యూ కడుతున్నారు. ఒకే ఉద్యోగానికి ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీ, ఇంటర్, టెన్త్ అని తేడాలేకుండా అంతా ఒకే క్యూలో నిలబడుతున్నారంటే పరిస్థితి ఎంతలా దిగజారిందో అంచనావేయవచ్చు. పేదలు మరింత దారిద్ర్యంలో గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ఉపాధిలేమి, మరోవైపు ధరల పెరుగుదల సగటు మనిషి బతుకును దుర్భరం చేశాయి. దావోస్‌లో పలు దేశాల ప్రతినిధులు తమతమ దేశాల పురోగతి, అభివద్ధిపై గొప్పలు చెబుతుంటే మరోవైపు ఆక్స్ ఫామ్ సర్వే మన పురోగతిని బట్టబయలు చేసింది. ప్రపంచవ్యాప్తంగా 82శాతం సంపద కేవలం ఒక్క శాతం సంపన్నుల దగ్గరే పోగుపడి ఉన్నదని సర్వే నిజాలు నిగ్గుతేల్చింది. మనదేశంలో 73శాతం సంపద కేవలం ఒక్కశాతం సంపన్నుల దగ్గర పోగుబడి ఉందని సర్వే చెప్పిన నిజాలు నిర్ఘాంతపరుస్తున్నాయి. ఆర్థిక సమానత్వం కనుచూపు మేర కూడా కానరానంతగా పెరిగిపోయింది. అంతలా ఆర్థిక అంతరాలు పెరిగిపోయాయి. సంపన్నులు-పేదల మధ్య ఈ దూరం దేశ సమగ్రతకు ప్రమాదకరంగా ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అభివద్ధి, పురోగతి కేవలం కొంతమంది వరకే పరిమితమవుతుందని ఈ సర్వే చెప్పకనే చెబుతోంది. ప్రభుత్వం కూడా కేవలం ఈ ఒక్కశాతం కోసమే పనిచేస్తోందని తేలిపోయింది. అభివద్ధి కొద్దిమందికే లబ్ధి చేకూర్చుతున్నది. వికాసం అనేది కేవలం కొంతమంది వరకే పరిమితమైనది. గతంలో అధికారం వెలగబెట్టిన పార్టీలన్నీ తమ పాలనలో ఎంతో అబివద్ధి వికాసాలు జరిగాయని గొప్పలు చెప్పుకుంటున్నాయి. మిలియనీర్లు, కోటీశ్వర్లు ఎంత వేగంగా తమ సంపదను పెంచుకుంటున్నారో దారిద్ర్యమూ అంతే వేగంగా పెరుగుతోంది. ఆక్స్ ఫామ్ నివేదిక ప్రకారం సంపన్నుల ఆస్తి 4.89 లక్షల కోట్ల నుంచి 20.7లక్షల కోట్లకు ఎగబాకింది. ఒక పేదవాడు 50ఏండ్లల్లో సంపాదించే డబ్బు ఒక కంపెనీ మేనేజర్ కేవలం 17రోజుల్లోనే సంపాదించగలడు. ఈ అసమానతలు కేవలం మనదేశానికే పరిమితం కాదు. ప్రపంచ దేశాల పరిస్థితి సైతం ఇలానే ఉంది. అనేక దేశాల్లోనూ ఆర్థిక దురవ్యవస్థ రాజ్యమేలుతోంది. సంపన్నులు మరింత సంపన్నులుగా పురోగతి సాధించే వ్యవస్థ వేళ్లూనుకొని ఉంది. సంపన్నులకు కొమ్ముకాసే ఆర్థిక వ్యవస్థ ఉంటే ఇక పేదల అభివద్ధి ఎలా సాధ్యమవుతుంది. పేదలు ఆర్థికంగా ఎలా నిలదొక్కుకోగలుగుతారు. కేవలం కొంతమంది సంపన్నుల వద్దే సంపద పోగుపడితే అభివద్ధి అందని ద్రాక్షగా మారక ఏమవుతుంది. కష్టించి, చెమటోడ్చి పనిచేసే వారికి ఉపాధి అంతంతమాత్రమే దక్కుతోంది. ఈ కష్టజీవుల శ్రమదోపిడీ చేసేవారి ఆదాయం అంతకంతకూ పెరుగుతోంది. ప్రభుత్వ పాలసీలు కూడా కష్టజీవుల కడుపుకొట్టేలానే ఉన్నాయి. పెట్టుబడిదారీవాదుల, కార్పొరేట్ దిగ్గజాల ప్రయోజనాలకు లబ్ది చేకూరేలా ప్రభుత్వ పాలసీలు అనుకూలంగా ఉన్నాయి. కాకులను కొట్టి గద్దలకు పెట్టిన చందంగా ప్రభుత్వాలు ఈ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకే కొమ్ముకాస్తుంటాయి. ప్రభుత్వాల ఈ ధోరణి పేదలు, సంపన్నుల మధ్య దూరాలు పెంచుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఈ పెద్దల సొమ్మే రాజకీయ పార్టీలకు చమురులాంటిది. ఈ కార్పొరేట్ దిగ్గజాలే ఎన్నికల ప్రచారానికి డబ్బును సర్దుతాయి. కానీ ప్రభుత్వాలు గద్దెనెక్కేది మాత్రం ఈ పేద ప్రజల ఓట్లతోనే.

పేదలు-ధనికుల మధ్య పెరుగుతున్న అంతరాలు ప్రజాస్వామ్యాన్ని డొల్లగా మారుస్తున్నాయి. నేటి ఈ ఆర్థిక వ్యవస్థ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నీరుగారుస్తున్నది. ఆర్థిక వ్యవస్థ అన్ని వర్గాల వారి ప్రయోజనాలకోసం ఉండాలే కానీ ఏదో ఒక వర్గం ప్రయోజనాలకు కొమ్ము కాసేలా ఉండకూడదు. ఎంతో కాలంగా పట్టిపీడిస్తున్న ఈ రుగ్మత సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ పుణ్యమే. వడ్డీ, వడ్డీ వ్యవస్థ పునాదులపై నిర్మితమైన ఈ వ్యవస్థ డబ్బున్న వాళ్ల ఆట. ఈ వ్యవస్థలో డబ్బున్న వాళ్లే ముమ్ముందుకు పోతారు. ఎవరి దగ్గరైతే డబ్బు లేదో వాళు రాత్రింబవళ్లు కష్టపడినా వాళ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటుంది. ఆర్థిక అసమానతలను బట్టబయలు చేసే ఎన్ని నివేదకలు వచ్చినా, ఎంతమంది ఆర్థిక నిపుణులు గొంతు చించుకున్నా ఈ వ్యవస్థ మారడం లేదు. పేదరికాన్ని అంతమొందించే మార్గాలు వెతకడం లేదు. అసలు పేదరికాన్ని నిర్మూలించే ఏ కొద్దిపాటి శ్రద్ధ కూడా పెట్టడం లేదు. ఆక్స్ ఫామ్ నివేదిక ఇప్పుడు కొత్తేమీ కాదు. ఏటా తన నివేదికను వెలువరిస్తూనే ఉంటోంది. రకరకాల పేర్లతో ఎన్నో నివేదికలు వస్తూనే ఉన్నాయి. కానీ ఈ నివేదికలపై ఎప్పుడూ ఏ దేశమూ తీవ్రంగా పరిగణిండచం లేదు. సమస్య మూలాలను పసిగట్టి చికిత్స చేసే ఆసక్తి ఏ కోశానా కానరావడం లేదు. ఎవరైతే ఈ మార్పును ఆశించడం లేదో వాళ్ల చెప్పు చేతుల్లోనే ఆర్థిక వ్యవస్థ ఉంది. అసలు సమస్యల్లా అదే.

సెల్ : 9640622076

విశ్వవిద్యాలయ సేవలన్నీ అధునీకరించాలి

కందగట్ల శ్రవణ్ కుమార్

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయ సేవలు వెంటనే ఆన్‌లైన్ చేయాలి. విశ్వవిద్యాలయ నిధుల సంఘం అన్ని విశ్వవిద్యాలయ సేవలు, పరీక్షల ఫీజు చెల్లింపులు, లావాదేవీలు నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని నోటీసు కూడా జారీ చేస్తే తెలంగాణలోని కొన్ని విశ్వవిద్యాలయాలు మాత్రం ఇప్పటికీ అమలు చేయటంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. డిజిటలైజేషన్‌లో భాగంగా విశ్వవిద్యాలయాల అన్ని సేవలు ఆన్‌లైన్ చేస్తే పారదర్శకత పెరగటంతోపాటు విద్యార్థులకు ఫీజు చెల్లింపులు ఆన్‌లైన్, డెబిట్ కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చేయటం వల్ల విశ్వవిద్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగే బాధ ఉండదు. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలు దూరవిద్యా విధానంలో అన్ని రకాల సేవలు ఆన్‌లైన్ ద్వారా విజయవంతంగా నిర్వహిస్తుంటే మన రెగ్యులర్ యూనివర్సిటీలు మాత్రం అమలు చేయడంలో ఇంకా జాప్యం చేస్తున్నాయి. దీని వల్ల ప్రజలు, విద్యార్థులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. కాబట్టి వెంటనే అన్ని విశ్వవిద్యాలయాల సేవలు ఆన్‌లైన్ ద్వారా జరిగేల చర్యలు తీసుకోవాలి. నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించి విద్యార్థులు సులువుగా సర్టిఫికెట్స్ తీసుకొనేలా కషి చేయాలి. ఇలా చేయటం ద్వారా విశ్వవిద్యాలయాల్లో పారదర్శకత పెరుగుతుంది.

అధ్యక్షుడు, సామాజిక రచయితలసంఘం వరంగల్ అర్బన్

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

\- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228


దేశానికే ఆదర్శంగా నిలవాలి

కమిషన్ ఆవిర్భావ పరిచయ సదస్సులో మంత్రి జూపల్లి

- కేసీఆర్ బీసీల పక్షపాతి : స్వామిగౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఆర్థిక కమిషన్ పని చేయాలని రాష్ట్ర మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. ఆదివారం రవీంద్రభారతిలో రాష్ట్ర ఆర్థిక కమిషన్ ఆవిర్భావ పరిచయ సదస్సు జరిగింది. ఆ సందర్భంగా తెలంగాణ ఆర్థిక కమిషన్ చైర్మెన్ రాజేశంగౌడ్, సభ్యులు చెన్నయ్యలను ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ రానున్న బడ్జెట్‌లో స్థానిక సంస్థలకు నేరుగా నిధులు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ ఆలోచన చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా పరిపుష్టం చేసేలా కమిషన్ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఆర్థిక కమిషన్ పనితీరుతో దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్


మాట్లాడుతున్న జూపల్లి

మాట్లాడుతూ ఆర్థిక కమిషన్ చైర్మెన్ పదవి ఆషామాషీ కాదని, అయితే ఇది లోన్లు ఇస్తుందనే అపోహలో చాలా మంది ఉన్నారన్నారు. ఆర్థిక కమిషన్ ఎలాంటి రుణాలను ఇవ్వదని, ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం జరిగేలా పర్యవేక్షణ చేస్తుందన్నారు. ఇంతటి గురుతర బాధ్యతను ఎంతో అనుభవం ఉన్న రాజేశంకు ఈ బాధ్యత అప్పగించిందన్నారు. మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తాము యువకులుగా ఉన్నప్పుడే మంత్రిగా పని చేసిన అపార అనుభవశాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మెన్ బిఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, రాములు నాయక్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్ బాపురెడ్డి, రాకేశ్, ధర్మపురి దేవస్థాన కమిటి చైర్మెన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు సంఘాల గుర్తింపు

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : జోగు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కొత్తగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చే విషయమై సర్కారు నిబంధనల మేరకు ఉంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఈ విషయాన్ని గత సీఎస్ దృష్టికి తీసుకుపోయామనీ, తర్వలో కొత్త సీఎస్‌నూ కలిసి సంఘాల గుర్తింపు విషయాన్ని చర్చిస్తామని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో బీసీ ఉపాధ్యాయ సంఘం(బీసీటీయూ) రాష్ట్ర మహాసభ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జోగు రామన్న మాట్లాడుతూ...ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని అన్నారు. బీసీల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రమోషన్లలోనూ రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతూ బీసీ ప్రజాప్రతినిధుల కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదించామని తెలిపారు. బీసీ క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలనీ, ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలకూ రక్షణ చట్టం ఉండాలని ప్రతిపాదించినట్టు చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ మాట్లాడుతూ..రాబోయే



పార్లమెంట్ సమావేశాల్లో ఓబీసీ కమిషన్ బిల్లు ఆమోదం పొందే అవకాశముందని అన్నారు. సీపీఎస్ రద్దు కోసం రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీసీ కమిషన్ చైర్మెన్ బీఎస్ రాములు మాట్లాడుతూ.. సంచార జాతుల పిల్లలకు జిల్లాకొక గురుకులాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు చెప్పారు. గురుకులాల్లో ఆదర్శవంతమైన విద్యాబోధన జరుగుతుందని అన్నారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం కోసం ఏకం కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో పీసీసీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రమణ, బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, బీసీ ఉపాధ్యాయ సంఘం నేతలు శ్రీనివాస్, సురేశ్, వినోద్‌కుమార్, నిరంజన్, దుర్గయ్య పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

నవతెలంగాణ-సిరిసిల్ల

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు(అన్నదమ్ముళ్లు) చనిపోయారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మండలం చంద్రంపేటలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒరిస్సా నుంచి రూపాధర్, మీనాసునా అనే దంపతులు ఇటుకల బట్టిలో పనిచేసేందుకు చంద్రపేట గ్రామానికి మూడు నెలల కింద వచ్చారు. ఎనగంటి శ్రీను వద్ద పనికి కుదిరారు. ఆదివారం మధ్యాహ్నం తల్లిబట్టలు ఉతుకుతుండగా...ఐస్‌క్రీం బండి వచ్చింది. చిన్నారులు బీజుసునా(5), రింకుసునా (3) ఐస్‌క్రీం కొనుక్కోవడానికి వెళ్లారు. చిన్నారులు తిరిగిరాకపోవడంతో ఆందోళన పడ్డ తల్లి చుట్టుపక్కల వెతికింది. ఆచూకీ లభించలేదు. ఇటుకల తయారీకి నీటి నిల్వ కోసం తవ్విన గుంతలో వెతకగా ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభించాయి.

షో







ప్రేమ.. ఇష్క్.. కాదల్..




ప్రేమంటే.. ఏదీ ఆశించకుండా ఉండటమా..?, త్యాగమా...?, ప్రేమించిన వ్యక్తి స్వేచ్ఛను గౌరవించడమా..? ఇలా రకరకాలుగా వినిపించినప్పటికీ ఇప్పటివరకు ఎవ్వరూ కచ్చితమైన నిర్వచనమివ్వలేకపోయారనేది వాస్తవం. కానీ ప్రేమలో పడితే ఎలాంటోళ్లైనా సరే ఓ సరికొత్త అద్భుతమైన ప్రపంచంలో ఉన్నామనే ఫీలింగ్‌తో ఉంటారని చాలా మంది స్వీయానుభవాల సారం చెబుతోంది. అంత గొప్ప ఫీలింగ్‌ని కలుగజేసే ఈ ప్రేమను దర్శక, నిర్మాతలు అత్యద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించారు. వారి వారి కోణాల్లో ప్రేమ గురించి చెప్పేందుకు చేసిన ప్రయత్నాల్లో ప్రేక్షకుల మనసుల్ని గెల్చుకున్నారు. ప్రేమికుల దినోత్సవాన్ని (ఈనెల 14.. బుధవారం) పురస్కరించుకుని ప్రేక్షకుల్ని ఫిదా చేసిన కొన్ని ప్రేమకథా చిత్రాల గురించి అందిస్తున్న స్పెషల్ షో..























ది లాంగెస్ట్ రైడ్

గేమ్ ఆడుతున్న సమయంలో సోఫియా అనే అందమైన అమ్మాయిని చూసి బుల్ రైడర్ ల్యూక్ ప్రేమలో పడతాడు. వారిద్దరూ కలిసి సరదాగా జర్నీ చేస్తున్న సమయంలో కారు యాక్సిడెంట్‌కు గురైన ఓ వృద్ధుడిని కాపాడతారు. ఈ జోడీని చూసిన ఆ వృద్ధుడు తన గతంలోకి వెళ్ళిపోతాడు. బుల్ రైడరైన ఆ వృద్ధుడి ప్రేమ ఎలా సాగింది?, ఆ ప్రేమలోని మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ ఆ యువ జంటతో పంచుకోవడమే ఈ చిత్ర కథాంశం. యాదృచ్ఛికంగా ఇద్దరు జంటలు ఒకే నేపథ్యానికి చెందిన వాళ్ళు కావడం ఇక్కడ విశేషం. నికోలస్ స్పార్క్స్ రాసిన 'ది లాంగెస్ట్ రైడ్' అనే అత్యంత పాఠకాదరణ పొందిన నవల ఆధారంగా దర్శకుడు జార్జ్ టిల్మన్ జూనియర్ రూపొందించారు. 2015లో విడుదలైన ఈ రొమాంటిక్ డ్రామా చిత్రంలో ల్యూక్ పాత్రలో స్కాట్ ఈస్ట్‌వుడ్, సోఫియా పాత్రలో బ్రిట్ రాబర్ట్సన్ నటించగా, మరో జంట పాత్రలో జాక్ హస్టన్, ఊనా చాప్లిన్‌ల నటన మెస్మరైజ్ చేస్తుంది.

ది ఏజ్ ఆఫ్ అడలిన్

29 ఏండ్ల అడలిన్ అనే అమ్మాయి కారు యాక్సిడెంట్ కారణంగా కోమాలోకి వెళ్తుంది. కొన్నేండ్ల వరకు ఎలాంటి ఉనికి లేకుండా ఏకాంతంగా బతికేస్తుంది. తనెవరు?, తన బ్యాక్‌గ్రౌండ్ ఏంటి?, తనకు ఏమైందనేది అడలిన్‌కు తెలియదు. అనేక సంవత్సరాల తర్వాత ఆమెను ఓ వ్యక్తి కలుస్తాడు. దీంతో ఆమె తన గతంలోకి వెళ్ళి యుక్త వయసులోని తన ప్రేమను, తన జీవితాన్ని గుర్తు చేసుకుంటుంది. మరి తన గత ప్రేమ ఎలా సాగింది?, ఎలాంటి పరిణామాలను చవి చూసిందనేది సినిమా. ఆద్యంతం మంత్రముగ్ధుల్ని చేసే ఈ రొమాంటిక్ ఫాంటసీ చిత్రాన్ని దర్శకుడు లీ టోలాండ్ క్రిగర్ రూపొందించారు. 2015లో విడుదలై భారీ కలెక్షన్లను రాబట్టింది. ఇందులో అడలైన్ పాత్రలో బ్లేక్ లైవ్లీ నటన ఆద్యంతం అద్భుతం.

టంబుల్‌డౌన్

మ్యూజీషియనైన తన భర్త అకాల మరణంతో హన్నా అనే మహిళ జీవితం గతంలో మాదిరిగా సాగలేని స్థితిలో ఉంటుంది. కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు సంఘర్షణ పడుతున్న తరుణంలో అనుకోకుండా ఓ రచయిత పరిచయమవుతాడు. హన్నా భర్త మరణానికి సంబంధించిన ఇన్వెస్టిగేషన్‌కు అతను హెల్ప్ చేస్తుంటాడు. ఈ క్రమంలో హన్నా ఆమె ప్రేమలో పడుతుంది. అనంతరం వీరి ప్రేమ ఎలా సాగిందనేది సినిమాలో ఆసక్తికరం. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని దర్శకుడు సీన్ మెవాషా రూపొందించారు. హన్నా పాత్రలో రెబెక్కా హల్, రైటర్ పాత్రలో జాసన్ సుడైకిస్ నటించి మెప్పించారు. 2015లో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల అభినందనలు, విమర్శకుల ప్రశంసలనూ సొంతం చేసుకుని మంచి విజయం సాధించింది.

అలోహ

మిలిటరీ కాంట్రాక్టర్ తన పనిని విజయవంతంగా పూర్తి చేశాక తిరిగి తన క్యాంప్‌కు వస్తాడు. అక్కడ తనతో పనిచేసే ఎయిర్ ఫోర్స్ మహిళా అధికారి ప్రేమలో పడతాడు. అత్యంత మధురంగా వీరు తమ ప్రేమ బంధాన్ని అనుభవిస్తుంటారు. కానీ అనుకోని పరిస్థితుల్లో ప్రేమ దూరమైనప్పుడు ఆ జంట పడిన సంఘర్షణ ఏంటనేది సినిమా కథాంశం. రొమాంటిక్ కామెడీగా రూపొందిన ఈ చిత్రానికి కామెరాన్ క్రౌ దర్శకత్వం వహించారు. మిలిటరీ అధికారిగా బ్రాడ్లీ కూపర్, లేడీ అధికారి పాత్రలో ఎమ్మా స్టోన్‌ల నటన మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

బ్లైండ్

కారు ప్రమాదానికి గురై ఓ నవలా రచయిత తన కళ్ళతోపాటు, భార్యనూ కోల్పోతాడు. దీంతో ఒంటరి వాడైన అతన్ని నేరారోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యాపారవేత్త భార్య కలుస్తుంది. భర్త నిర్లక్ష్యానికి గురైన ఈ మహిళ తరచూ రచయితను కలవడం, అభిరుచులు కలవడం వల్ల ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడుతుంది. అది ప్రేమగా మారుతుంది. మరి వారి ప్రేమ నిజమైనదా? కాదా అని తేల్చుకోవాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు ఇద్దరూ ఎదుర్కొన్న మానసిక సంఘర్షణే ఈ సినిమా. లేటు వయసులో పుట్టే ప్రేమను తెలిపే ఈ చిత్రానికి మైఖేల్ మెయిలర్ దర్శకత్వం వహించారు. 2017లో విడుదలైన ఈ రొమాంటిక్ డ్రామా చిత్రం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో రచయిత పాత్రలో అలెక్ బాల్డ్‌విన్, వ్యాపారి భార్య పాత్రలో డెమి మూరే నటన అలరించడంతోపాటు ఆలోచింప చేస్తుంది.

బ్రీత్

పోలియో కారణంగా వచ్చిన భయంకరమైన వ్యాధి (నెక్ పెరాలిసిస్) బాధపడిన అడ్వకేట్ రాబిన్ కావెండిష్ జీవితం ఆధారంగా రూపొందించిన చిత్రమిది. తనకు ఆ వ్యాధి రాకముందు డయానా బ్లాకర్‌తో ప్రేమలో పడతాడు. ఇద్దరు ఒక్కటై ఎంతో సంతోషకరమైన ప్రేమ జీవితాన్ని గడుపుతారు. 28 ఏండ్ల వయసులో రాబిన్‌కి నెక్ పెరాలిసిస్ వస్తుంది. అయినప్పటికీ దాన్ని ఎదిరించి తన జీవితాన్ని సంతోషంగా గడిపేందుకు, తను అనుకున్నది సాధించేందుకు అతను పడే తపన, ఈ క్రమంలో తన భార్య డయానా అందించిన సపోర్ట్‌ను తెలిపే చిత్రమిది. అంతేకాకుండా తనలా బాధపడేవారికి స్ఫూర్తిగా ఉండేందుకు ఈ భార్యాభర్తలు చేసిన సుదీర్ఘ ప్రయాణమే ఈ చిత్రం. ఆద్యంతం హృదయాలను స్పృశించేలా సాగే ఈ చిత్రానికి ఆండీ సెర్కిస్ దర్శకత్వం వహించారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం టొరంటో వంటి అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో పలు అవార్డులను అందుకుంది. ఇందులో రాబిన్ పాత్రలో ఆండ్రూ గార్ఫీల్డ్, డయానా పాత్రలో క్లైర్ ఫోయ్‌ల నటన మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

బ్రూక్లిన్

బ్రూక్లిన్‌కు వలస వచ్చి హోమ్ సిక్‌గా ఫీలవుతున్న ఐర్లాండ్‌కు చెందిన ఓ అమ్మాయికి టోని అనే ఓ ఛార్మింగ్ కుర్రాడు పరిచయమవుతాడు. అతని సాన్నిహిత్యంతో హోమ్ సిక్ ఫీలింగ్ నుంచి బయటపడుతుంది. ఇద్దరూ ప్రేమలో పడతారు. హఠాత్తుగా తన సోదరి చనిపోయినట్టు తెలియడంతో ఆ అమ్మాయి తిరిగి ఐర్లాండ్ వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. మళ్ళీ ఎలాగూ బ్రూక్లిన్ వస్తాననే నిర్ణయంతో టోనిని అదరాబాదరగా పెళ్ళి చేసుకుంటుంది. ఐర్లాండ్ వెళ్ళాక తిరిగి రావడం కష్టంగా మారుతుంది. ఐర్లాండ్‌లో ఉండలేక, బ్రూక్లిన్‌కు రాలేక తనెలాంటి ఇబ్బందులు పడింది?, ఈ ప్రేమ జంట జీవితంలో అనూహ్యంగా చోటు చేసుకున్న మార్పులేంటనేది సినిమా కథాంశం. జాన్ క్రౌలీ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ డ్రామా చిత్రం 2015లో విడుదలై మంత్రముగ్ధుల్ని చేసింది. ఐర్లాండ్ అమ్మాయిగా సోయిర్స్ రోనన్, టోనీ పాత్రలో ఎమోరీ కోహెన్‌ల నటనకు ప్రేక్షకులు ఫిదా అయిపోతారు.

ది స్పేస్ బిట్వీన్ అజ్


అంగారక గ్రహంపై ప్రయోగ నిమిత్తం కొంత మంది వ్యోమగాములు రాకెట్‌లో బయలుదేరుతారు. అందులో గర్భవతి అయిన ఓ మహిళా వ్యోమగామి కూడా ఉంటుంది. కొన్ని ఏండ్లపాటు అక్కడ ప్రయోగాలు జరుగుతాయి. అంగారక గ్రహంపైనే ఆ మహిళకు ఓ కొడుకు జన్మిస్తాడు. దాదాపు 16ఏండ్ల తర్వాత వారు భూమిపైకి వస్తారు. అంగారక గ్రహంపై జన్మించిన ఆ కుర్రాడు భూమి వాతావరణ పరిస్థితులకు అలవాటు కావడానికి చాలా టైమ్ పడుతుంది. ఈ క్రమంలో ఓ అందమైన అమ్మాయి ప్రేమలో పడతాడు. భూమిపై మనుగడ కోసం, తన ప్రేమ కోసం ఈ ప్రేమికులిద్దరు పడే తపనే ఈ చిత్రం. పీటర్ చెల్సోమ్ దర్శకత్వంలో రూపొందిన ఈ రొమాంటిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం గతేడాది విడుదలైంది. గారి ఓల్డ్ మాన్, ఆసా బటర్ఫీల్డ్, కార్లా గుగినో, బ్రిట్ రాబర్ట్సన్‌ల నటన అందర్నీ ఫిదా చేస్తుంది.

మీ బిఫోర్ యు


నాలెడ్జ్‌తోపాటు అమాయకత్వం లూయిసా క్లర్క్ సొంతం. సేవ చేసే గుణం కూడా ఎక్కువే. అప్పటి వరకు చేస్తున్న జాబ్ అర్థాంతరకంగా పోతుంది. యాక్సిడెంట్ కారణంగా పక్షవాతం రావడంతో తల తప్ప శరీరంలోని ఇతర భాగాలను కదిలించలేని విల్‌కు కేర్ టేకర్‌గా లూయిసా జాయిన్ అవుతుంది. అతని గురించి తెలుసుకుని ప్రేమించడం ప్రారంభిస్తుంది. వీరి ప్రేమ బలపడిన తర్వాత ఒకరికొకరు తోడ్పడుతూ ఒకరి జీవితాలను మరొకరు ఎలా మార్చుకున్నారనేది కథ. అద్భుతమైన ప్రేమ కథకు, హృదయాలను కదిలించే భావోద్వేగాలకు ఈ చిత్రం ప్రతిరూపం. ఈ బ్రిటీష్-అమెరికన్ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని 'మి బిఫోర్ యు' అనే నవల ఆధారంగా దర్శకుడు థియ షారోక్ 2016లో రూపొందించారు. 20 మిలియన్ డాలర్లతో తెరకెక్కి 208 మిలియన్ డాలర్లను వసూలు చేసింది.






















ఆరోగ్యం ప్రయి'వేటే'



(మొదటిపేజీ తరువాయి)

బీమా పథకంగా దీనిని అభివృద్ధి పరచనున్నట్టు కేంద్రం ఇప్పటికే తెలిపింది. అందులో భాగంగా మొదట దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఈ పథకాన్ని అమలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ప్రయోగాత్మకంగా ఈ పథకం అమలుకు బీజేపీ పాలిత 19 రాష్ట్రాలకు కేంద్రం ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే ఈ పథకానికి సబంధించిన నమూనాను రూపొందించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. బీమా(ఇన్సూరెన్స్) కంపెనీలను ఈ పథకంలో భాగస్వాములను చేయనున్నట్టు కేంద్రం ఇప్పటికే సూచనప్రాయంగా తెలిపింది.

ఒకే దేశం, ఒకే పథకం భావనతో ఈ పథకాన్ని రూపొందించనున్నట్టు చెబుతున్నారు. అయితే, ఈ పథకాన్ని లక్ష్యించిన లబ్దిదారులకు చేర్చడానికి వృత్తి నైపుణ్యతతో కూడిన మధ్యవర్తి సిబ్బంది, మౌలిక వసతుల కల్పనపై కేంద్ర అధికారులు దృష్టి సారించినట్టు చెబుతున్నారు. అందుకు అవసరమైన ప్రాథమిక, మాధ్యమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతోపాటు నిర్వహణా సిబ్బంది కోసం ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిలో టెండర్లను ఆహ్వానించనున్నట్టు తెలుస్తోంది. అందుబాటులో ఉన్న పరిమిత ఆరోగ్య సిబ్బందితో ఈ పథకానికి సంబంధించిన ప్రాథమిక సేవలను సమర్థవంతంగా లక్ష్యిత వర్గాలకు చేర్చడం ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాల్ అంటూ నిటి ఆయోగ్(ఆరోగ్య విభాగం) సభ్యుడు వికె పౌల్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. వనరులకు ఇబ్బంది లేదు. పథకానికి కావలసినన్ని నిధులున్నాయి. అన్ని స్థాయిలలో ఆరోగ్య సేవలను అందించేందుకు శిక్షణతో కూడిన సిబ్బందే సవాల్ అని పౌల్ అన్నారు. సాంకేతిక నైపుణ్యమున్న ఆరోగ్య కార్యకర్తలు, మధ్యస్థ స్థాయిలో సేవలందించేందుకు వృత్తి వైద్యులు అవసరమని ఈ పథకం అమలుకు సంబంధించి కసరత్తు చేస్తున్న అధికారులు భావిస్తున్నారు.

ఈ పథకం అమలులో ఆరోగ్య కేంద్రాలకు భాగస్వామ్యం కల్పించనున్నట్టు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా లక్షా 50 వేల ఆరోగ్య కేంద్రాలను(హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్) ఏర్పాటు చేయనున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పిన విషయం గమనార్హం. ప్రాథమిక వైద్య సేవలతోపాటు ఉచితంగా మందులను అందించే ఈ కేంద్రాల ఏర్పాటును 2022లోగా పూర్తి చేయనున్నట్టు జైట్లీ చెప్పారు. అయితే, వీటి కోసం 2018-19 బడ్జెట్‌లో కేటాయించింది మాత్రం రూ.1200 కోట్లు మాత్రమే.

ఎన్‌హెచ్‌పీఎస్‌ను కేంద్రం చెప్పినట్టు 10 కోట్ల పేద కుటుంబాలకు(50 కోట్లమందికి) అమలు చేయాలంటే ఏటా రూ.10,000 కోట్ల నుంచి రూ.12000 కోట్ల వరకూ ఖర్చు కాగలదని అంచనా. ఒక్కో కుటుంబానికి ఏటా రూ.5 లక్షలమేర ఉచిత వైద్య సేవలు అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. సామాజిక ఆర్థిక,కుల గణన(ఎస్ఈసీసీ)-2011 డేటా ఆధారంగా పేద కుటుంబాలను గుర్తించాలని నిటి ఆయోగ్ సూచించింది. ఈ పథకంలోకి వచ్చే ఒక్కో కుటుంబం కోసం రూ.1000 నుంచి 1200 వరకూ ప్రీమియం కింద చెల్లించాలి. ఈ మొత్తాన్ని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంలో భరించాలి.

మోడీ నేతృత్వంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికి ఈ పథకం అమలుకు మరో ఏడాది మాత్రమే గడువు ఉన్నదన్నది తెలిసిందే. ఈలోగా దీనిని అమలులోకి తెస్తే.. అది 50 శాతం లబ్దిదారులకు మాత్రమే అందుబాటులోకి రానున్నట్టు నిటి ఆయోగ్ అంచనా. అందుకు ఈ ఆర్థిక ఏడాది(2018-19)లో రూ.5000 కోట్లు అవసరమని భావిస్తున్నారు. ఈ మొత్తాన్ని కేంద్రం, రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో సమకూర్చాలి. హిమాలయ, ఈశాన్య రాష్ట్రాల విషయంలో మాత్రం 90 శాతం నిధుల్ని కేంద్రమే భరించాలి. ఈ బడ్జెట్‌లో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఉన్న రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన(ఆర్ఎస్‌బీవై)కు కేటాయించిన రూ.2000 కోట్లలో కొంత భాగాన్ని ఎన్‌హెచ్‌పీఎస్ కోసం మళ్లించనున్నట్టు తెలుస్తోంది. కాగా ప్రయివేట్ దవాఖానాలకు కాసులు కురిపించే ఆరోగ్య పథకాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌నుంచే షురూ అయిన విషయం విదితమే. ప్రస్తుతం మోడీ అమలులోకి తేనున్న ఈ పథకం కూడా దేశవ్యాప్తంగా ఉన్న బడా బాబుల దవాఖానాలకు మేలు చేసేందుకేనన్న వాదన వినిపిస్తున్నది. సర్కారు వైద్యాన్ని తుంగలోకి తొక్కేలా మోడీ సర్కారు అడుగులు వేస్తున్నదని ప్రజాసంఘాలు,ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

మావోయిస్టుల్లో విద్యాధికులు ఎంతమంది?

- సమాచార సేకరణలో ఐబీ బిజీ
- జంపన్నను విచారించిన ప్రభావిత రాష్ట్రాల నిఘా అధికారుల నివేదిక పరిశీలన



నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

మావోయిస్టుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్నదా? తగ్గుతున్నదా? అన్నదానిపై ఇంటలిజెన్స్(ఐబీ)బ్యూరో నిఘాపెట్టింది. ప్రభావిత రాష్ట్రాల నుంచి సమాచారాన్ని రాబడుతున్నది. తొమ్మిది ప్రభావిత రాష్ట్రాలలో సాగుతున్న మావోయిస్టుల కార్యకలాపాలపై ఐబీలోని ప్రత్యేక విభాగం ఈ దిశగా కూపీ లాగుతున్నట్టు తెలిసింది. మావోయిస్టు విప్లవోద్యమానికి, కార్యకలాపాల విస్తరణకు, కొత్త క్యాడర్‌ను ఆకర్షించడానికి సిద్ధాంతపరంగా ఆరి తేరిన మేధావులు కీలక పాత్ర పోషిస్తున్నారు. పదిహేనేండ్లలో అప్పటి ఉమ్మడి ఏపీ రాష్ట్రంతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార్ఖండ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో చెరుకూరి రాజ్‌కుమార్ ఎలియాస్ ఆజాద్ మొదలుకుని పలువురు కీలక నేతలు మరణించారు. ఐటీ రంగం విస్తరించడం, ఉద్యోగావకాశాలు పెరగటంతో మావోయిస్టుల వైపునకు విద్యావంతుల రిక్రూట్‌మెంట్ కొన్నేండ్లుగా తగ్గిందని రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల నిఘా విభాగాలు గతంలో నివేదికలు ఇచ్చాయి. కానీ, ప్రస్తుతం మావోయిస్టుల్లోకి కొత్తగా విద్యావంతులు చేరుతున్నారన్న ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఐబీ నిశితంగా దృష్టి సారించినట్టు తెలిసింది. చదువుకోని వారు ఎందరు చేరినప్పటికీ విద్యావంతులు చేరడం వల్ల ఆ పార్టీ కార్యకలాపాలు, దాని భావజాలం వేగంగా విస్తరించే ప్రమాదం ఉందని నిఘా అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ, ఏపీల నుంచి కొత్తగా రిక్రూట్‌మెంట్ జరగట్లేదని నివేదికల్లో ఉన్నప్పటికీ...ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఒడిషా, కర్నాటక రాష్ట్రాల నుంచి రిక్రూట్‌మెంట్ జరుగుతున్నదని ఐబీకి సమాచారం ఉన్నట్టు తెలుస్తోంది. ఎవరు ఎక్కువగా మావోయిస్టుల వైపునకు ఆకర్షితులవుతున్నారు? వారిలో ఎంత మంది చదువుకున్నవారున్నారు? విస్తరణే నిజమైతే, అడ్డుకట్ట వేయడానికి ఇటు కేంద్ర ప్రభుత్వం, అటు ఆయా నక్సల్స్ ప్రభావిత రాష్ట్ర ప్రభుత్వాలు ఏ చర్యలు తీసుకోవాలి? అనే అంశాలపైనా ఐబీలోని ప్రత్యేక విభాగం నివేదికను సమర్పించే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. కాగా, ఇటీవల డీజీపీ మహేందర్‌రెడ్డి ముందు లొంగిపోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మిలిటరీ కమిషన్ బాధ్యులు అయిన జినుగు నర్సింహ్మారెడ్డి ఎలియాస్ జంపన్నను రాష్ట్రంతో పాటు వివిధ మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల నిఘా అధికారులు, ఐ అధికారులు విచారించారు. కాగా, ఈ రాష్ట్రాలన్నింటి విచారణాంశాలను కూడా ఐబీ పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తున్నట్టు తెలిసింది. జంపన్న ద్వారా కొత్తగా ఏదైనా సమాచారం మావోయిస్టులకు సంబంధించి వెలుగులోకి వచ్చిందా? లేదా? అని ఐబీ అధికారులు తరచి చూస్తున్నారని తెలిసింది. దండకారణ్యంలో మావోయిస్టుల కార్యకలాపాలు ఇటీవల పెరిగాయని, ముఖ్యంగా పీపుల్స్ గెరిల్లా ఆర్మీని మరింత పటిష్ఠం చేశారని వస్తున్న సమాచారంలో ఏ మేరకు నిజముంది అనేది కూడా ఐబీ అధికారులు ఆయా రాష్ట్రాల నిఘా అధికారులతో సంప్రదిస్తూ నిగ్గు తేల్చే యత్నంలో ఉన్నట్టు తెలిసింది. తాజాగా కేంద్ర హోంశాఖ సైతం ప్రభావిత రాష్ట్రాలలో మావోయిస్టుల కార్యకలాపాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యల గురించ చర్చించినట్టు తెలిసింది. ఆ చర్చల్లో భాగంగానే ఐబీ విభాగం ఈ కొత్త అసైన్‌మెంట్‌ను చేపట్టినట్టు విశ్వసనీయ వర్గాలను బట్టి తెలిసింది.

పైసల్లేని ప్రజారోగ్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకాశ్ కరత్ తెలిపారు.ఈ పథకానికి అవసరమైన నిధుల్లో 40శాతం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సిఉందని, మిగిలిన నిధుల కేటాయింపు విషయంలోనూ కేంద్రానికి స్పష్టత లేదన్నారు. ఆచరణలో మాత్రం ఈ పథకం కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకే ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసి, మౌలికవసతులు కల్పించకుండా కార్పొరేట్లకు మేలు చేసే ఈ తరహా పథకంతో సామాన్యప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరవని అన్నారు. సీపీఐ(ఎం)పార్టీ 25వ ఏపీ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనడానికి భీమవరం వచ్చిన ఆయన పర్స సత్యనారాయణ నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.దేశ ప్రజానీకం ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారం పట్ల మోడీ సర్కారుకు చిత్తశుద్ధి లేదని కరత్ విమర్శించారు. మోడీ ప్రభుత్వం పేదల పేరు చెబుతూ ఆచరణలో కార్పొరేట్లకుసేవ చేస్తోందన్నారు.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ బడ్జెట్ ద్వారా రైతులకు కనీస మద్దతు ధర ఇచ్చినట్టుగా గొప్పగా చెప్పుకుంటున్నారని, అయితే, ఇది మాటల గారడి మాత్రమేనని చెప్పారు. వ్యవసాయ పంటలకు ఉత్పత్తిధర పైన అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర ఇచ్చినట్టు చెప్పిన కేంద్ర ప్రభుత్వం దీనికి 2వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడానికి కనీసం లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారని, ఆ దిశలో కేటాయింపులు చేయకుండా భారీగా ప్రచారం చేసుకోవడం రైతాంగాన్ని మభ్య పెట్టడానికేనని చెప్పారు. వాస్తవానికి స్వామినాథన్ కమిషన్ నివేదికలో ఈ అంశమే అత్యంత కీలకమైనదని, దీని అమలు కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రైతాంగాన్ని ప్రభుత్వం మోసం చేసిందని చెప్పారు.

ఇన్నాండ్లు నిద్రపోతున్నారా...!

విభజన చట్టంలోని హామీల అమలుకోసం తెలుగుదేశం పార్టీ ఎంపీలు చేస్తున్న ఆందోళనను ప్రస్తావిస్తూ 'ఇన్నాండ్లు నిద్రపోతున్నారా?' అని కరత్ ప్రశ్నించారు. పార్లమెంటులో ఏపీ టీడీపీ ఎంపీల ఆందోళనకు వామపక్ష పార్టీలు మద్దతు ఇవ్వడం లేదని తెలుగుదేశం నేతలు చెబుతున్నారన్న ప్రశ్నకు స్పందిస్తూ ' బీజేపీకి టీడీపీ మిత్రపక్షం. నాలుగేండ్లుగా రాష్ట్ర ప్రజలను మాయమాటలు చెబుతూ మోసం చేశారు. ప్రత్యేకహోదాతో చట్టంలోని హామీల అమలు కోసం డిమాండ్ చేస్తూ వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపునకు అనూహ్య స్పందన రావడంతో తెలుగుదేశం పార్టీ ఇప్పుడు మాట్లాడుతోంది. ప్రజలను మరోసారి మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తోంది.

వాస్తవానికి ఈ అంశాలపై మొదటినుండి మాట్లాడుతోంది వామపక్షాలు మాత్రమే' అని చెప్పారు. ప్రత్యేక హోదాకు బదులుగా ప్యాకేజీని ఇస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుందని, ఇప్పుడు ప్యాకేజీ కూడా లేదని, అదనపు నిధులు మాత్రమే ఇస్తామని కేంద్రం చెబుతోందని తెలిపారు. బీజేపీ,టీడీపీలు కలిసి రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని అన్నారు. జమ్మూ కాశ్మీర్లో ఆర్మీ క్యాంపుపై ఉగ్రవాదులు చేసిన దాడిని కేంద్ర ప్రభుత్వ విధాన వైఫల్యంగా ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో సైనికులు మృతి చెందడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్జికల్ స్ట్రైక్స్‌తో ఉగ్రవాదులను నిర్మూలించినట్లుగా కేంద్రం చేసిన ప్రకటనలో వాస్తవం లేదని తేలిపోయిందని అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ తరువాత ఈ తరహా దాడులు పెరిగాయని, దీనివల్ల సైనికులను నష్టపోవడంతో పాటు, సాధారణ ప్రజానీకం కూడా అనేక సమస్యలను ఎదుర్కోంటోందని తెలిపారు. పాకిస్తాన్‌తో చర్చలు జరపడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉందని అన్నారు. మోడీ సర్కారు దీనికి సిద్ధపడటం లేదని అన్నారు. రాఫెల్ వ్యవహారంపై అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ ఈ వ్యవహారంలో వాస్తవాలు వెల్లడించడానికి కేంద్ర సర్కారు సిద్ధపడటం లేదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ తయారుచేస్తున్న వాటిని కాదని, కార్పొరేట్లకు అనుకూలంగా ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. అనిల్ అంబానీకి చెందిన సంస్థకు 21వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం చెల్లించనుందని, దీనిపైనే తాము ప్రశ్నించామని అన్నారు. ఆర్థికాంశాలకు సంబంధించిన ఈ ప్రశ్నకు జవాబివ్వడానికి బదులుగా రక్షణ రహస్యాల చాటున ప్రభుత్వం దాక్కుంటోందని అన్నారు.



మాట్లాడుతున్న ప్రకాశ్‌కరత్

మన జెండా కొత్త ఎజెండాతో ముందుకు..

- బహుజన-లెఫ్ట్ ఫ్రంట్‌కు అదే నాంది పలికింది: సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలో తమ్మినేని సందేశం

భీమవరం: "పార్టీ నిర్వహించిన మహాజన యాత్ర విజయం వెనుక ఉన్న మంత్రం మన జెండా కొత్త ఎజెండాని తీసుకోవడమే., అదే ప్రజలను కదిలించింది. బహుజన - లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటుకు నాంది పలికింది. ఇదే రేపటి రోజున రాజకీయాలను ప్రభావితం చేసే ఫ్రంట్" అని సీపీఐ(ఎం) తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భీమవరంలో జరుగుతున్న సీపీఐ(ఎం) ఏపీ 25వ రాష్ట్ర మహాసభల్లో రెండోరోజు శనివారం ఆయన సందేశం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వేర్వేరు అయినప్పటికీ మనమంతా ఒక్కటేనని, ఇది సెంటిమెంట్‌గా చెప్పడం లేదని, ఉభయ రాష్ట్రాల్లో సమస్యలు, ప్రభుత్వ స్వభావం ఒక్కటేనని అన్నారు. కాబట్టి ఇరు రాష్ట్రాల పార్టీలూ ఒకటిగానే ఆలోచించాలన్నారు. పాలకవర్గాల స్వభావ రీత్యానేగాక.. అనేక సమస్యలపై ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతం నేర్చుకోవలసింది ఎంతో ఉంటుందని అన్నారు. ఇరు రాష్ట్రాల్లో ఉన్నది తెలుగు ప్రజలే కనుక ఈ రాష్ట్రాల అభివృద్ధికి పరస్పర సహకారంతో.. కలిసి పనిచేస్తే ప్రజా ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. భవిష్యత్తులో ఇరు రాష్ట్రాల్లోనూ పార్టీ ఎన్నో పోరాటాలు నిర్వహించాల్సి ఉందని, వీటిని కలిసి పంచుకోవాలని సూచించారు.ఏపీలో పార్టీ ఆధ్వర్యాన మూడేండ్లుగా నిర్వహిస్తున్న పోరాటాలు తమనెంతో ఉత్సాహపరుస్తున్నాయన్నారు. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని ఉద్యమ నిప్పురవ్వ రాజేయడం గమనించామని, మీ నివేదికలోనూ, చర్చల్లోనూ అది వ్యక్తమైందని అన్నారు. తెలంగాణాలో కూడా పార్టీ ఆధ్వర్యంలో 'మల్లన్న సాగర్' పోరాటాన్ని కూడా ఇలాగే నిర్వహించామని, ఇది ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తలనొప్పిగా తయారైందని తెలిపారు. కేసీఆర్ 'హరితహారం' పేరుతో గిరిజనులను అడవి నుంచి తరిమివేసే పథకం ప్రవేశపెట్టాడని, దీనిపై ఉధృతంగా నిర్వహించిన పోరాటం వల్ల ఆయన వెనక్కి తగ్గాడని వివరించారు. ఇంకా భూ నిర్వాసితుల, సామాజిక, తదితర సమస్యలపై చేసిన పోరాటాలు తెలంగాణాలో పెద్ద ప్రభావం తెచ్చాయన్నారు. పార్టీ విశాఖ అఖిల భారత మహాసభ సూచించిన విధంగా ఇంకా పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉందని అన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వంపై అక్కడి ప్రజలకు ఇంకా భ్రమలున్నాయని, తెలంగాణా సెంట్‌మెంట్ ఇంకా ఉందని అన్నారు. తెలంగాణ ఏర్పాటుతో ఒక విజయం సాధించారని, అలాంటి దశలో ప్రజలు వెంటనే పోరాటాల్లోకి దిగడం జరగదని, కొంత సమయం పడుతుందని అన్నారు.



మాట్లాడుతున్న తమ్మినేని

కేసీఆర్‌ను సవాల్ చేస్తున్నది సీపీఐ(ఎం) ఒక్కటే

తాను ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి గంటలు గడిచి.. ఒక రోజల్లా పట్టిందని.. విద్యార్థులు సీపీఐ(ఎం) అనుసరిస్తున్న విధానాలపై ప్రశ్నల పరంపరం కొనసాగించారని వీటన్నిటికీ ఓపిగ్గా సమాధానాలిచ్చానని అన్నారు. ఒక పీహెచ్‌డీ స్కాలర్.. తెలంగాణ ఉద్యమంలో సీపీఐ(ఎం) ఖతం అయ్యిందని అనుకున్నానని, ఏడు తాడిచెట్ల లోతున భూమిలో పాతిపెట్టామని.. అయినా మీరు పెకలించుకొని ఎలా బయటకు వచ్చారని, ఉస్మానియా యూనివర్సిటీకీ మీరు రావడం ఎంత ధైర్యం అని ప్రశ్నించారని గుర్తుచేశారు. దీనికి కారణం తాము ప్రజల్లో ఉండటమేనని ఆ స్కాలర్‌కు తేలికగా సమాధానం చెప్పానని వివరించారు.

కాషాయ రంగు వదిలితేనే..

(మొదటిపేజీ తరువాయి)

అడిగిన పలు ప్రశ్నలకు కమల్‌హాసన్ సమాధానాలిచ్చారు. నటుడు రజనీకాంత్ బీజేపీతో చేతులు కలిపే అవకాశాలున్నాయన్న ఊహాగానాలపై కమల్ స్పందించారు. గతేడాది డిసెంబర్ 31న తాను రాజకీయాల్లోకి రావడం ఖాయమని రజనీకాంత్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 21న కమల్‌హాసన్ తన రాజకీయ పార్టీపై ప్రకటన చేయనున్నారు.

తప్పనిసరైతే ఇతర పార్టీలతో కూటమికి అవకాశాలుంటాయని కమల్‌హాసన్ తెలిపారు. అయితే, ఎన్నికల తర్వాత కూటముల పట్ల ఆసక్తి లేదని అన్నారు. మెజారిటీ రాకపోతే అది ప్రజల తీర్పుగా భావించి ప్రతిపక్షంలో కూర్చొని తదుపరి ఎన్నికల వరకూ వేచి చూస్తానన్నారు. తాను ప్రజల వెంట ఉండేందుకు పార్టీ స్థాపించాలని నిర్ణయించాను, రాజకీయ నాయకుల కోసం కాదని కమల్‌హాసన్ అన్నారు. తమిళనాడు పరిస్థితి ఏమీ బాగోలేదని ఆయన అన్నారు. లవ్ జిహాద్‌పై ప్రశ్నించగా..తనకు జిహాద్ గురించి తెలియదు. ప్రేమ మాత్రం ద్వేషాన్ని జయిస్తుందని కమల్‌హాసన్ అన్నారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో కూటమి ఆలోచన ఉన్నదా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ..తాను కేజ్రీవాల్ నుంచి మాత్రమే కాదు, ఇతరుల నుంచి కూడా వారి అనుభవాలు తెలుసుకుంటున్నానని చెప్పారు. కేజ్రీవాల్‌తోపాటు కేరళ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) నేత పినరయి విజయన్‌తోనూ కమల్‌హాసన్ చర్చలు జరిపిన విషయం తెలిసిందే.

ఈ నెల 21 నుంచి కమల్‌హాసన్ తమిళనాడులో పర్యటించనున్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం స్వస్థలమైన రామేశ్వరం నుంచి ఆయన తన పర్యటన ప్రారంభించనున్నారు. నలాయీ నమాధే(రేపటిరోజు మనదే) పేరుతో ఈ పర్యటన జరగనున్నది. అదేరోజున ఆయన తన పార్టీపై ఓ ప్రకటన చేయనున్నారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు తెలుసుకునేందుకు ఈ పర్యటనను ఉద్దేశించినట్టు కమల్ తెలిపారు. తమిళనాడులోని ఒక్కో జిల్లా నుంచి ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయనున్నట్టు కమల్‌హాసన్ తెలిపారు. మొదట ఓ గ్రామంతో తన కార్యక్రమాలు ప్రారంభించి ప్రతి జిల్లాకూ విస్తరిస్తానని తెలిపారు. మహాత్మాగాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్య భావన తనకు ప్రేరణ అని కమల్ తెలిపారు.

భూ కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

నెంబర్లలో 553 ఎకరాల 22 గుంటలు, తర్వాత రాఘవరెడ్డి, గోవిందరెడ్డి, రత్నారెడ్డిలు 118 సర్వే నెంబర్లలో 394 ఎకరాల 16 గుంటల భూముల ఖాతాదారులుగా సాగు చేయించినట్టుగా రికార్డుల్లో ఉంది. ఈ భూములన్నీ ప్రస్తుతం అన్యాక్రాంతమైనాయి. 2011లో ఆ గ్రామానికి చెందిన గూళ్ల రాజు అనే సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం ద్వారా రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు తీసుకోగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

నిజాం లొంగిపోయిన తర్వాత కూనారం గ్రామానికి చెందిన ఖాతాదారులు ఆ భూములను వదిలెళ్లారు. వాటిని కొందరు ఆక్రమించి భూస్వాములుగా చెలామణి అవుతున్నారు. నిజాం కాలంలోనే పశువుల మేత కోసం ఉంచిన 1091 ఎకరాల పోరంబోకు భూములను సైతం కబ్జా చేశారు. అయితే 1971-73 సీలింగ్ చట్టాల ప్రకారం భూస్వాములు ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వానికి అప్పగించకుండా కబ్జా చేసి బినామీ పేర్లతో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు, ఇతరులకు, స్థానికేతరులకు అక్రమంగా అమ్ముకున్నట్టు సమాచారం. ఆక్రమించుకున్న నిజాం భూములనే రాజకీయ ప్రోద్బలంతో తిరిగి ప్రభుత్వానికి అమ్ముకున్నట్టు తెలిసింది. 1984లో భూస్వాముల ఆక్రమణలో ఉన్న 208 ఎకరాలను అదే గ్రామానికి చెందిన పేదలకు పంపిణీ చేసేందుకు అసైన్డ్ చేసి పట్టాలిచ్చారు. అందులో ఇప్పటికీ 106 మందికి భూ పంపిణీ చేయలేదు. 2015లో కూనారం గ్రామ శివారులో అప్పటి ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి ఆక్రమణలో ఉన్న దేశపాండ్ ఖాతాలోని 150 ఎకరాలను వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి అమ్ముకున్నారు. ఈ నేపథ్యంలో అన్యాక్రాంతమైన నిజాం భూములను గ్రామంలోని పేదలకు పంపిణీ చేయాలని భూ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో 2015 నుంచి దశలవారీగా గ్రామస్తులు పోరాడుతున్నారు. వారి దీక్షలకు టీమాస్, సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్ నాయకులు సైతం మద్దతు తెలిపినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది.

పట్టాలిచ్చారు..భూమి చూపలేదు: ఓర్సు స్వరూప, కూనారం

చానా ఏండ్ల కింద శివారులోని పరంపోగు భూములను అసైన్డ్‌మెంట్ చేసి ఎకరం చొప్పున భూములిస్తామన్నారు. పట్టాలూ ఇచ్చారు. భూములను మాత్రం చూపలే. దీంతో అటవీ ప్రాంతంలోని చెట్లను నరికి సాపు చేసుకున్నాం. పోలీసోళ్లు కేసులు పెడ్తమని బెదిరించారు.

ఇచ్చిన పట్టాలను తీసుకున్నారు : జునుమాల సారయ్య, పోరాట కమిటీ సభ్యుడు

పడావు భూములను పంపిణీ చేయాలని గ్రామస్తులమంతా కలిసి పోరాటం చేశాం. ఎకరానికి పట్టాలిచ్చి.. 20 గుంటలే భూమి చూపించారు. తర్వాత ఇచ్చినవాటిని అధికారులు తీసుకున్నారు. ఇప్పటికీ మాకు భూములు లేవు.

పేదలకు పంపిణీ చేయాలి : డాక్టర్ గూళ్ల రాజు, భూ సాధన పోరాట సమితి కన్వీనర్, కూనారం

ఆక్రమణకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. అక్రమ పట్టాలను రద్దు చేయాలి. సీలింగ్ చట్టం ప్రకారం ప్రభుత్వమే జోక్యం చేసుకొని ఆ భూములను పేదలకు పంచేలా చర్యలు తీసుకోవాలి. దీనిపై సర్కారు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

కుటుంబ పాలన అభివృద్ధికి ఆటంకం

నవతెలంగాణ-క్లాక్‌టవర్/చిట్యాల

రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని టీజేఏసీ రాష్ట్ర చైర్మన్, ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని లయన్స్‌క్లబ్‌లో టీవీవీ ఆధ్వర్యంలో 'నాలుగేండ్ల తెలంగాణలో నల్లగొండ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 'ఉద్యమ ఆకాంక్షలు-అభివృద్ధి' అంశంపై ప్రొఫెసర్ కోదండరాం, 'ఫ్లోరైడ్ నాడు-నేడు' అంశంపై టీజేఏసీ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మార్జున్, 'చేతి వృత్తులు- భవిష్యత్' అంశంపై చేతి వృత్తుల రంగం నిపుణులు తడక యాదగిరి, 'వ్యవసాయ సంక్షోభం-పరిష్కారాలు' అంశంపై రైతు జేఏసీ నాయకులు కన్నెగంటి రవి ప్రసంగించారు. తొలుత కోదండరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం కాకుండా కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చే విధంగా పని చేస్తోందని ఆరోపించారు. రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో పాలకులు రూ.కోట్లు వెనకేసుకుంటున్నారని విమర్శించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గురి జాల రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి తిప్పర్తి యాదయ్య, ఉపాధ్యక్షుడు అంబటి నాగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎస్ఎస్ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన కోదండరామ్ వాహనం

టీజేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ కోదండరామ్ వాహనం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి చౌరస్తా వద్ద జాతీయ రహదారి 65పై ఆదివారం ప్రమాదానికి గురైంది. నల్లగొండలో జరిగిన టీవీవీ సదస్సుకు కోదండరామ్ హాజరయ్యారు. సాయంత్రం ఆయన తన కారులో హైదరాబాద్‌కు బయలు దేరారు. వాహనం చిట్యాల మండలం పిట్టంపల్లి చౌరస్తా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి, డివైడర్‌ను గుద్దుకుంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసమైంది. కారులో ఉన్న కోదండరాంకు ఎలాంటి గాయాలూ కాలేదు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. అనంతరం కోదండరాం మరో వాహనంలో హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. సంఘటనా స్థలాన్ని సీఐ పాండురంగారెడ్డి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కూలిన విమానం శకలాలు.. 71 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

రాడార్ సంబంధాలు తెగిపోయాయి. అదృశ్యమైన విమానం కోసం దాదాపు 10గంటల పాటు అన్వేషించారు. సరటోవ్ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తున్న ఏఎన్-148 రకం విమానం మాస్కోలోని అర్గునోవ్ అనే గ్రామం సమీపంలో కూలిపోయింది. ప్రమాదం జరిగిన విషయాన్ని అధికారులు ధ్రువీకరించారు. సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. రష్యా ప్రభుత్వం ఈ ప్రమాద ఘటనపై క్రిమినల్ దర్యాప్తునకు ఆదేశించింది. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కాగా విమానం ఆకాశంలో ఉన్నప్పుడు అకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో ఈ ఘోరం జరిగిందని స్థానికులు అంటున్నారు. ప్రమాదానికి గురైన ఏఎన్-148 రకం విమానం కొత్తదే. దీనిని సర్వీసులోకి తీసుకొని కేవలం 8 ఏండ్లే అవుతోందని ఎయిర్‌లైన్స్ సంస్థ తెలిపింది. దీనిని అంతర్జాతీయ సర్వీసులకు కూడా నడిపారు. మృతుల కుటుంబాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రగాఢ సంతాపం తెలిపారు. రష్యా రవాణా మంత్రి మాక్సిమ్ సొకలోవ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. విమానంలోని సిబ్బందితో సహా ప్రయాణికులంతా మృతి చెందినట్టు మంత్రి ధ్రువీకరించారు. విమానం కూలిపోయిన ప్రాంతంలో లభించిన శకలాలను సంబంధించిన దృశ్యాలను రష్యా స్టేట్ మీడియా ప్రసారం చేసింది. 2016, మార్చిలో రోస్తోవ్ ఆన్ డాన్ విమానాశ్రయంలో ఫ్లైదుబాయ్ జెట్‌విమానం ల్యాండ్ అవుతున్న క్రమంలో కూలిపోయింది. ఈ ఘటనలో 62 మంది ప్రయాణికులు మృతి చెందారు. ప్రతికూల వాతావరణం కారణంగా విమానం కూలిపోయినట్టు దర్యాప్తు బృందాలు పేర్కొన్న విషయం విదితమే.తాజాగా జరిగిన విమానప్రమా దానికి కారణం కూడా వాతావరణం అనుకూలంగా లేకపోవటమేనని విమానయాన అధికారులు చెబుతున్నారు.

ఆమె కడుపులో సిరంజీలు

(మొదటిపేజీ తరువాయి)

కడుపునొప్పితో బాధపడుతుండేదని ఆమె భర్త వికాస్ ద్వివేది తెలిపారు. దీంతో ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా కడుపులో రెండు సిరంజీలున్నట్టు డాక్టర్లు గుర్తించారన్నారు. ఎక్స్‌రే తీసుకోవాలని సూచించగా.. ఎక్స్‌రేలో మరో మూడు సిరంజీలు పొట్టలో ఉన్నట్టు తెలిసిందన్నారు. 2013లో సుందర్‌లాల్ ఆస్పత్రిలోనే డెలివరీ ఆపరేషన్ చేసుకున్నప్పుడు కూడా దూది, మాంసాన్ని పొట్టలోనే ఉంచి కుట్లు వేసిన విషయం విదితమే. తన భార్యకు ఆపరేషన్ చేసిన మహిళా వైద్యురాలు సిరంజీలను కడుపులోనే వదిలిపెట్టిందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్టు లంకా ప్రాంతానికి చెందిన పోలీసు సంజీవ్ మిశ్రా తెలిపారు. దర్యాప్తు ప్రారంభించామని అన్నారు. స్వయంగా దేశ ప్రధాన మంత్రి ప్రాతినిధ్యంవహిస్తున్న వారణాసిలోని సర్కారు ఆస్పత్రిలోనే ఇలాంటి వైద్య నిర్లక్ష్యాలు బయటపడటం గమనార్హం.

నోట్ల లెక్కింపు కొనసాగుతూనే..

(మొదటిపేజీ తరువాయి)

చేరినవెన్నో స్పష్టంగా వెల్లడించలేదు. కానీ గతేడాది జూన్ 30నాటికి 15.25లక్షల కోట్ల రూపాయల విలువైన రద్దుచేసిన నోట్లు తిరిగి చేరాయని తెలిపింది. 59 ప్రత్యేక యంత్రాల(కరెన్సీ వెరిఫికేషన్ అండ్ ప్రాసెసింగ్ మెషిన్)తో లెక్కిస్తున్నామని పేర్కొన్నది. కానీ ఆ యంత్రాలు ఎక్కడ ఉన్నాయో స్పష్టంచేయకుండా.. కమర్షియల్ బ్యాంకులకు చెందిన ఎనిమిది యంత్రాలతో పాటు ఆర్‌బీఐ రీజనల్ కార్యాలయాల్లోని.. లీజుకు తీసుకున్న మరో ఏడు యంత్రాలను మాత్రమే వినియోగిస్తున్నట్టు తన సమాధానంలో పేర్కొన్నది. గతేడాది ఆగస్టులో ఆర్‌బీఐ విడుదల చేసిన 2016-17 ఏడాది నివేదికలో చెలామణిలో ఉన్న 15.44లక్షల కోట్ల రూపాయల విలువైన పెద్దనోట్లకుగాను 15.28 లక్షల కోట్ల విలువైన(99శాతం) నోట్లు బ్యాంకులకు చేరాయని వెల్లడించింది. కేవలం 16,050కోట్ల రూపాయలు మాత్రమే తిరిగి రాలేదని వివరించిన సంగతి తెలిసిందే.

కాంగ్రెస్‌ది కుర్చీల కొట్లాట

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధికి రూ.23కోట్లు ఖర్చుచేశామన్నారు. ఖమ్మంలో ఇప్పటికే ఐటీ హబ్ నిర్మాణం జరుగుతోందని, త్వరలో నగరం చుట్టూ 400 ఎకరాల్లో ఫారెస్ట్ పార్క్ రాబోతోందని, దాన్ని నెలరోజుల్లో ప్రారంభిస్తామని అన్నారు. నగరం చుట్టూ రాజధాని రోడ్లను మించేలా రింగ్‌రోడ్డు నిర్మించనున్నట్టు చెప్పారు. గ్రానైట్ పరిశ్రమ ఇబ్బందుల్లో ఉందని వ్యాపారులు, యజమానులు వస్తే రాత్రికి రాత్రే వారికి సడలింపునిచ్చామని గుర్తు చేశారు. కామేపల్లి, కారేపల్లి, రఘునాథపాలెం మండలాలకు బుగ్గవాగు ప్రాజెక్టు ద్వారా సాగునీరందించేందుకు అవసరమైన రూ.37 కోట్లను వారం పది రోజుల్లో మంజూరు చేస్తామని హామీనిచ్చారు. రోడ్లు భవనాల శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గోళ్లపాడు ఛానల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బాలసాని, బుడాన్ బేగ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లోకేష్‌కుమార్, ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు బాణోత్ మదన్‌లాల్, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, డీసీసీబీ చైర్మన్‌మువ్వావిజయబాబు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ బుడాన్‌బేగ్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, జడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత, నగర మేయర్ డాక్టర్ పాపాలాల్, కార్పొరేషన్ కమిషనర్ ఝా, ఆర్జేసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు తప్పనిసరి!

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 'విదేశాల్లో విద్యనభ్యసించి వచ్చే 12 నుంచి 15 శాతం మంది గ్రాడ్యుయేట్లు.. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) నిర్వహించే ఫారీన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్(ఎఫ్ఎంజీఈ)ను పూర్తి చేయాలి. లేకపోతే వారు ప్రాక్టీస్‌కు అనర్హులు. అలాంటి సందర్భాలలో వారు అక్రమంగా ప్రాక్టీస్ చేస్తే చాలా ప్రమాదకరం. అందుకే విదేశాల్లో వైద్య విద్యనభ్యసించాలనే విద్యార్థులకు నీట్‌ను తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనలు చేస్తున్నాం' అని ఆయన తెలిపారు. విదేశాల్లోని ఏదేని మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందడానికి విద్యార్థి తనకు నచ్చిన కోర్సు తీసుకొని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) నుంచి అత్యవసర ప్రమాణ పత్రాన్ని పొందే అవకాశం ప్రస్తుతం ఉంది. కాగా కొత్త ప్రతిపాదన అమలులోకి వస్తే నీట్‌ను సాధించిన విద్యార్థులు.. విదేశాల్లో వైద్య విద్యనభ్యసించడానికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్ఓసీ)ను పొందుతారని అధికారి తెలిపారు. గత ఐదేండ్లలో 13నుంచి 26.9 శాతం మంది ఎఫ్ఎంజీఈని పూర్తి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఎఫ్ఎంజీఈ పేపర్ చాలా కఠినంగా ఉందని వచ్చిన ఫిర్యాదులతో సంబంధిత సిలబస్‌ను సమీక్షించడానికి ఓ కమిటీ ఏర్పాటు చేశారు.

సెన్సెక్స్ ▼310
34,757

నిఫ్టీ ▼94
10,666

డాలరుకు రూపాయి విలువ
64.06


బంగారం(10.గ్రా)
రూ. 30,909


వెండి (కేజీ)
రూ. 42,600


కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



దుబాయ్‌లో అతిపెద్ద హోటల్ ప్రారంభం



దుబాయ్: దుబాయ్‌లో మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. ప్రపంచంలోనే అతి పొడువైన హోట్‌ల్ గోవోరా సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. దాదాపు 356 మీటర్ల (1167.98 అడుగుల) ఎత్తుతో దీనిని దుబయ్‌లోని షేక్ జాయద్ రోడ్‌లో నిర్మించారు. ఈ హోటల్‌లో మొత్తం 75 అంతస్తులు, 528 రూములతో పాటు నాలుగు రెస్టారెంట్‌లు ఉండనున్నాయి. ఇప్పటి వరకు ప్రపంచంలో అతిపెద్ద హోటల్‌గా జేడబ్ల్యూ మారియట్ మార్కిస్ హోటల్ రికార్డులకెక్కుతూ వస్తోంది. 2012లో ప్రారంభమైన ఈ హోటల్‌ను దాదాపు 1,165 అడుగుల ఎత్తుతో నిర్మించారు. ఇందులో మొత్తం 1,608 రూములు ఉన్నాయి. ఇప్పుడు కొత్త హోటల్ ఈ రికార్డును తిరగరాయనుంది. గోవోరా హోటల్‌లో చిన్న డీలక్స్ రూములు 46 చదరపు అడుగల విస్తీర్ణంతోను, పెద్ద రెండు పడక గదుల సూట్‌లు 85 చదరపు అడుగులతోను లభించనుంది. బంగారపు రంగులో సిద్ధమైన ఈ భవనానికి ఓపెన్ ఎయిర్‌పూల్ డెక్‌తో పాటు విలాసవంతమైన స్పా, హెల్త్ క్లబ్, జకూజీలు అదనపు హంగులుగా ఉండనున్నాయి. ఈ రెండు హోటళ్లకు తోడు దుబయ్‌లో రోజ్‌రెహాన్ (1,093 అడుగులు), బుర్జ్ అల్ అరబ్ (1,053 అడుగులు) పేరుతో మరో రెండు పొడువైన హోటళ్లు కూడా ఉన్న సంగతి తెలిసిందే.

రూ.53,625 కోట్ల రుణాలు రద్దు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు దాదాపు రూ.53,625 కోట్ల మేర రుణాలను రాని బాకీల కిందకు జమచేస్తూ రద్దు చేశాయి. సెప్టెంబరు నాటికి ఈ మొత్తం నమోదు అయినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.81,683 కోట్లు మొండి బకాయిలను రద్దు చేశారు. వీటిలో అత్యధికంగా భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) రూ.20,339 కోట్ల మేర రుణాలను రాని బాకీలుగా రద్దు చేసింది. 2012-13లో పీఎస్‌బీ రద్దు చేసిన రుణాల మొత్తం రూ.27,231 కోట్లుగా నమోదైంది. గత ఐదేళ్లలో దాదాపు మూడు రెట్లు అధికంగా మొండి బాకీలను ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దు బాకీల పద్దుల చేర్చాయి. ఎస్‌బీఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్ 2016-17లో రూ.9205 కోట్లను, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 7346 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.5,545 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.4348 కోట్ల మేర రుణాలను రాని బాకీలుగా రద్దు చేశాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల్లో బ్యాంకులు రద్దు చేసిన రుణాల మొత్తం రూ.53,625 కోట్లకు పెరిగింది. ఆర్‌బీఐ వద్ద అందుబాటులో ఉన్న నివేదికల మేరకు గత సెప్టెంబరు ముగింపు నాటికి మొత్తం 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో దాదాపు 9 బ్యాంకుల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 15 శాతాన్ని దాటేశాయి. మరోవైపు ఆర్‌బీఐ అంచనాల ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తుల విలువ 15 శాతానికి పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. బ్యాంకులు ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న క్రమంలో పీఎస్‌యూ బ్యాంకులకు రానున్న రెండేళ్లలో రూ 2.11 లక్షల కోట్ల మూలధనం సమీకరించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

ప్రపంచ మార్కెట్లతో ప్రమాదమే..!

స్టాక్ మార్కెట్లు మరింత కుంగొచ్చు

- మదుపరుల్లో అప్రమత్తత అవసరం
- కొనసాగనున్న 'గ్లోబల్' ప్రతికూలత
- ప్రభావం చూపనున్న గణాంకాలు, ఆర్థిక ఫలితాలు, క్రూడ్, డాలర్..
- 10,276 వద్ద నిఫ్టీకి తక్షణ మద్దతు!



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశీయ స్టాక్ మార్కెట్లలో ఈ రోజు నుంచి ప్రారంభమయ్యే ట్రేడింగ్ వారంలో కూడా తీవ్ర ఒడిదొడుకులు నమోదు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రానున్న వారం రోజుల పాటు కూడా ప్రపంచ మార్కెట్లలో భారీ అమ్మకాలు కొనసాగే అవకాశాలు మెండుగా ఉన్నాయని.. దీనికి తోడు ఈ వారం వెలువడనున్న ప్రధాన గణాంకాలు కూడా మార్కెట్ల కదలికపై ప్రభావం కనబరిచే అవకాశాలున్నందున మదుపరులు అప్రమత్తంగా ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. దీనికి తోడు తృతీయ త్రైమాసిక ఫలితాలు, ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, విదేశీ మదుపరుల నుంచి వచ్చే నిధుల వరద, రూపాయి స్థితిగతులు తదితర అంశాలు కూడా మార్కెట్ నడవడిని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని వారు చెబుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థపై కొనసాగుతున్న ఊహాగానాలు, ఫెడ్ వడ్డీరేట్ల పెంపు విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో ప్రపంచ మార్కెట్ల నుంచి మదు పరులు ఎక్కువగా వైదొలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రభావంతో ఆసియా మార్కెట్లు, ఐరోపా మార్కెట్లు కూడా భారీగా కుంగేందుకు చాన్స్ ఉన్నట్లుగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ ధరల వద్ద దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు షేర్ల కొనుగోలు పట్ల ఎలాంటి దృక్పథాన్ని ప్రదర్శిస్తారన్న అంశం కూడా మార్కెట్లను నడిపించే అవకాశాలున్నాయి. మార్కెట్ పరిణామాలపై స్టాక్ ఎక్స్ఛేంజీల నియంత్రణ సంస్థ సెబీ అధినేత అజయ్ త్యాగీ మాట్లాడుతూ ప్రపంచ ప్రతికూలత ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మరికొన్ని రోజుల పాటు ఒడిదొడుకులకు లోనయ్యే అవకాశాలు ఉన్నట్టుగా సంకేతాలిచ్చారు.

వెల్లడి కానున్న కీలక ఆర్థిక ఫలితాలు...

ప్రపంచ మార్కెట్లలో ప్రతికూల ఫలితాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం అనూహ్య నష్టాలను నమోదు చేశాయి. నిరాశపరిచే బడ్జెట్ స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై పన్ను వంటి అంశాలు తోడవడంతో గత వారం బీఎస్‌ఈ సెన్సెక్స్ దాదాపు 1060.99 పాయింట్ల మేర కుంగింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా దాదాపు 305 పాయింట్ల వరకు పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ వారం ప్రధానంగా గెయిల్, ఇండియన్ హోటల్స్, డీఎల్ఎఫ్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, జీఎంఆర్ ఇన్‌ఫ్రా, వెల్‌స్పన్ ఇండియా, ఐడియా సెల్యులార్, జెట్ ఎయిర్‌వేస్, నెస్లే ఇండియా, సన్ ఫార్మా తదితర సంస్థలు ఈ వారం తృతీయ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రంగాల షేర్లు కొంత ప్రభావితం అయ్యే అవకాశాలున్నాయి. దీనికి తోడు ఈ వారం (12న) విడుదల కానున్న పారిశ్రామిక ప్రగతి గణాంకాలు, టోకు ధరలు, రిటైల్ ధరల ద్రవ్యోల్బణంతో పాటు వాణిజ్య రంగ గణాంకాలు కూడా బహిర్గతం కానున్నాయి. ఈ అంశాలు కూడా మార్కెట్లను ప్రభావితం చేయవచ్చు. టెక్నికల్ విశ్లేషణ ప్రకారం నిఫ్టీ 10,276 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభించే ఆస్కారం కనిపిస్తోంది.. ఒక వేళ అనూహ్య ర్యాలీతో ముందుకు సాగితే నిఫ్టీకి 10,703 వద్ద తీవ్ర ప్రతికూలత ఎదరయ్యే అవకాశం కనిసిస్తోంది.

ఊపందుకోనున్న నియామకాలు!

10-15% పెరిగే ఆవకాశం

- ఇండియా స్కిల్స్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: నిరుద్యోగులకు శుభవార్త. గత ఏడాది కాలంగా స్తబ్దుగా ఉన్న ఉద్యోగ నియామకాల ప్రక్రియ వచ్చే ఏడాది ఊపందుకోనుంది. కార్పొరేట్ నియమకాల్లో వచ్చే ఏడాది దాదాపు 10-15 శాతం మేర వృద్ధి నమోదయే అవకాశం ఉందని 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్-2018' వెల్లడించింది. హెచ్‌ఆర్ టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ పీపుల్స్ స్ట్రాంగ్, నైపుణ్యత అంచనా సంస్థ వీల్‌బాక్స్, పియర్‌కాన్, సీఐఐ, ఏఐసీటీఈ, యూఎన్‌డీపీ, ఏఐయూ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే ఆదారంగా ఈ నివేదక వెల్లడైంది. వచ్చే ఏడాది నియామకాల్లో అనుకూలత కనిపిస్తోందని.. వృద్ధి కూడా 10-15 శాతానికి మధ్య ఉంటుందని ఈ నివేదిక పేర్కొంది. దాదాపు 120 మేటి కార్పొరేట్ సంస్థలు, 5.1 లక్షల మంది విద్యార్థుల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను తయారు చేశారు. దేశం ప్రస్తుతం డిజిటల్‌తో పాటు పలు రంగాలలో పరివర్తన దశలో ముందుకు సాగుతోందని.. ఈ దశలో సప్లైతో పాటు డిమాండ్ వైపున కూడా అత్యధికంగా కొత్త ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉన్నట్టుగా ఈ నివేదిక తెలిపింది. ఢిల్లీ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధికంగా ఉద్యోగ అవకాశాలకు ఆస్కారం ఉన్నట్టుగా నివేదిక తెలిపింది. ఉద్యోగిత రిత్యా బెంగళూరు నగరం ప్రథమ స్థానంలో కొనసాగొచ్చని సర్వే తెలిపింది. ఆ తరువాత స్థానాల్లో చెన్నై, ఇండోర్, లక్నో, ముంబయి, నాగపూర్, న్యూఢిల్లీ, పుణె, తిరుచురాపల్లి నగరాల్లో ఎక్కువ కొలువులకు ఆస్కారం ఉందని సర్వే తెలిపింది. 18-25 సంవత్సరాల లోపు వారికి 46 శాతం, 26-29 శాతం వారికి 26 శాతం మేర ఉద్యోగ వనరులు అందుబాటులో ఉండనున్నట్టుగా సర్వే వివరించింది.

దేశీయ సూచీల ట్రేడింగ్ నిలిపివేత!



న్యూఢిల్లీ: దేశీయ మదుపరుల పెట్టుబడులు విదేశీ మార్కెట్లకు తరలిపోకుండా... ఇకపై అంతర్జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజిల్లో తమ సూచీల ట్రేడింగ్‌ను నిలిపివేయాలని మూడు ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలు నిర్ణయించుకున్నాయి. దీంతో మార్కెట్లపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ, మెట్రోపాలిటన్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా (ఎంఎస్ఈఐ) ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సింగపూర్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎస్‌జీఎక్స్) తాజాగా నిఫ్టీ 50లో భాగమైన కంపెనీల స్టాక్స్ ఫ్యూచర్స్‌లో కూడా ట్రేడింగ్ ప్రారంభించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఎస్‌జీఎక్స్ తదితర ఎక్స్ఛేంజిల ధోరణులతో... దేశ మార్కెట్ల నుంచి లిక్విడిటీ విదేశీ మార్కెట్లకు తరలిపోయే అవకాశం ఉందనే ఆందోళన నెలకొంది. విదేశీ ఎక్స్ఛేంజీలు, ట్రేడింగ్ ప్లాట్‌ఫాంల డెరివేటివ్స్ ట్రేడింగ్‌కి సంబంధించి సూచీలు, స్టాక్స్ ధరల వివరాలను అందించేందుకు కుదుర్చుకున్న లైసెన్సింగ్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకుంటున్నట్లు మూడు ఎక్స్ఛేంజీలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

రాష్ట్రమొచ్చినా నిరాశలోనే ప్రజలు

సీపీఐ(ఎం) జాతీయ మహాసభలను జయప్రదం చేయండి : చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-ఎల్బీనగర్

ప్రత్యేక రాష్ట్రమొచ్చినా ప్రజల జీవితాలు మారలేదని, వారంతా నిరాశలోనే ఉన్నారని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఇంటింటికీ సీపీఐ(ఎం) కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని మన్సూరాబాద్ డివిజన్‌లోని సహారా ఎస్టేట్‌లో ఆయన తిరిగారు. సీపీఐ(ఎం) జాతీయ మహాసభల కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉద్యమించి రాష్ట్రం తెచ్చుకున్నా...నీళ్లు రాలేదని, నియామకాలు చేపట్టడం లేదని, ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని చెప్పారు. ప్రజాసమస్యలపై టీమాస్ అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి పోరాడుతున్నదన్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరిగే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభల జయప్రదం కోసం తమవంతు విరాళాలు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శి భూపాల్, సహారా స్టేట్ కాలనీ అధ్యక్షుడు ఎండీ జానీ, నాయకులు చంద్రమోహన్, అంజయ్య, సుదర్శన్‌రెడ్డి, మద్దిలేటి, ప్రకాశ్, శ్రీను, యాదగిరి, యాదయ్య, సత్యనారాయణ, మల్లేష్, మనోహర్, సరోజ, లక్ష్మి, నాగమణి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పే ధ్యేయం

- రామంతాపూర్ పాలిటెక్నిక్ కాలేజీ అల్యూమ్ని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజ మార్పే తమ ధ్యేయమని హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీ అల్యూమ్ని ప్రకటించింది. 1979 నుంచి 2000 వరకు ఆ కాలేజీలో చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. వారు చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. వివిధ హోదాల్లో ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో పనిచేస్తున్న 500 మంది వరకు హాజరయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ అసోసియేషన్‌కు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఏడీఈ దేవళ్ల సమ్మయ్యను అధ్యక్షునిగా, కె భూమారెడ్డి గౌరవాధ్యక్షులుగా, కె రాంచందర్ ప్రధాన కార్యదర్శిగా, ఏ వెంకటనారాయణరెడ్డిని అసోసియేట్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి 1981 బ్యాచ్‌కి చెందిన ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, 1986 బ్యాచ్‌కి చెందిన సినీగేయరచయిత చంద్రబోస్, వివిధ హోదాల్లో పనిచేస్తున్న శ్రీకళ, శశికళ, శ్యామల, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. రామంతాపూర్ పాలిటెక్నిక్ కాలేజీ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని వారు అన్నారు. రామంతాపూర్ ప్రాంగణంలోనే మహిళా పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే ఆ కాలేజీని సందర్శించాలని కోరతానని ఉప్పల్ ఎమ్మెల్యే ప్రభాకర్ చెప్పారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతామని నూతన అధ్యక్షుడు సమ్మయ్య అన్నారు. త్వరలోనే ట్రస్టు ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

మున్సిపాల్టీల్లో పారిశుధ్య కార్మిక గ్రూప్‌లు

- పురపాలక శాఖ ఆదేశాలు జారీ
- సరికాదంటున్న కార్మిక సంఘాలు
- సర్కారు బాధ్యతల విస్మరణ: సీఐటీయూ విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పట్టణ స్థానిక సంస్థల్లో పారిశథ్య కార్మిక గ్రూప్(ఎస్‌డబ్ల్యూజీ)లను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పట్టణ, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ గత నెల 29న ఉత్తర్వులు జారీచేశారు. జీవో నెంబరు 52ను విడుదల చేశారు. కాంట్రాక్టర్ల వ్యవస్థను ఎత్తివేస్తూ కొత్త విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్టు అందులో పేర్కొంది. రాష్ట్ర స్థాయి సలహా బోర్డు(ఎస్ఎల్‌ఏబీ) ప్రతిపాదన మేరకు నూతన విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్టు జీవోలో తెలియజేశారు. దీనిపై కార్మిక సంఘాలు భిన్నంగా స్పందించాయి. గ్రూప్‌ల ఏర్పాటు సరికాదని, తద్వారా కార్మికులు తమ హక్కులను కోల్పోతారని చెప్పాయి. కార్మికులను మభ్యపెట్టడానికే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించాయి.


(ఫైల్)

జీవోలోని ముఖ్యాంశాలు

1. జీవో నెంబరు 52లో ఏడుగురు పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య కార్మికుల గ్రూప్(ఎస్‌డబ్ల్యూజీ)లను ఏర్పాటు చేస్తారు. 2017, జూన్ నాటికి పనిలో(మస్టర్స్‌ల రోల్స్) ఉన్నవారికి మాత్రమే గ్రూప్‌లో అవకాశం ఉంటుంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు లేదా ఆపైన ఒకే గ్రూప్‌లో చేర్చకూడదు.
2. ఈ గ్రూపులను మెప్మా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నామినల్ ఫీజు చెల్లించాలి.
3. ఏడుగురిలో ఆరుగురు పనిచేస్తే, మరోకరు సెలవులో ఉంటారు. ఇతర సభ్యుల అంగీకారంతో సెలవును మార్చుకోవచ్చు.
4. వేతనాలను ఏదైనా జాతీయ బ్యాంకులోని సంయుక్త ఖాతాలో వేస్తారు. కార్మికులు వ్యక్తిగత ఖాతాలు సైతం అదే బ్యాంకుకు చెందిన ఒకే బ్రాంచ్‌లో తెరవాలి.
5. ఆధార్‌తో కూడిన బయోమెట్రిక్ హాజరును అమలుచేస్తారు. సంబంధిత అధికారులు కార్మికుల దగ్గరకు వెళ్లి ప్రతిరోజూ నమోదు చేస్తారు.
6. ఆరు నెలల అవసరాలకుగాను కూపన్లు అందజేస్తారు.
7. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలను బ్యాంకులోని గ్రూప్ జాయింట్ ఖాతాలో వేస్తారు. అక్కడి నుంచి కార్మకుల వ్యక్తిగత అక్కౌంట్‌లోకి వెళతాయి. ఉమ్మడి ఖాతా నుంచి నేరుగా డబ్బు డ్రా చేయానికి వీలు కాదు.
8. ఈ విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహస్తారు.
9. నోడల్ ఏజెన్సీ ద్వారా ఈఎస్ఐ, ఈపీఎఫ్ సొమ్మును చెల్లించేలా చర్యలు తీసుకుంటారు.

కార్మికులను విచ్ఛిన్నం చేయడమే.

కార్మికులను విచ్ఛిన్నం చేయడమే: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు

కొత్త విధానం సరికాదు. కార్మికులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ చేయాలన్న తదితర డిమాండ్లను పట్టించుకోకుండా ప్రభుత్వం వదిలేసింది. ప్రభుత్వం పారిశుధ్య కార్మిక గ్రూప్‌లు ఏర్పాటు ద్వారా వారి మధ్య చిచ్చుపెట్టింది. పేరుకు ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేస్తున్నట్టు అనిపించినా, వాస్తవం అది కాదు. కార్మికులను గ్రూపులుగా ఏర్పాటు చేయడం ద్వారా కార్మిక సంఘాలకు వారిని దూరం చేసే ప్రయత్నం జరుగుతున్నది. జీవో 52 తో వారి హక్కులు ప్రశ్నార్థకమవుతాయి. తీవ్రంగా నష్టపోతారు. దీనిపై సీఐటీయూ నేతృత్వంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్, ఉద్యోగుల యూనియన్ పోరాడుతుంది.

పీహెచ్‌డీ విద్యార్థులకు 'పీఎంఆర్‌ఎఫ్' స్కాలర్‌షిప్స్

న్యూఢిల్లీ: సైన్స్, సాంకేతిక విద్యలో పరిశోధనలను మెరుగుపర్చటం కోసం ఉద్దేశించి బడ్జెట్‌లో ప్రతిపాదించిన 'ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్'(పీఎంఆర్‌ఎఫ్) పథకాన్ని ఆచరణలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ పథకం అమలుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి పీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని ఏడేండ్లపాటు అమలు చేయడానికి రూ.1650 కోట్లు అవసరమవుతాయని కేంద్రం తన బడ్జెట్ ప్రతిపాదనల్లో అంచనా వేసింది. రాబోయే మూడేండ్లలో ప్రతీ ఏటా వెయ్యిమంది చొప్పున ప్రతిభావంతులైన బీటెక్ లేదా ఎంటెక్ లేదా ఎంఎస్సీ సైన్స్ విద్యార్థులకు (పీహెచ్‌డీ ఎంచుకున్నవారికి) ఈ పథకం కింద పెద్ద మొత్తంలో స్కాలర్‌షిప్ అందజేస్తామని కేంద్రం తెలియజేస్తోంది. ఎంపికైన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ద్వారా ప్రతీనెలా రూ.70 వేల నుంచి 80 వేలు అందజేస్తామని తెలిపింది. దీంతో, ప్రతిభావంతులైన విద్యార్థులు ఇక నుంచి విదేశీ స్కాలర్‌షిప్స్‌పై ఆధారపడే అవసరముండదని కేంద్ర మానవ వనరుల మంత్రి ప్రకాష్ జవదేకర్ చెబుతున్నారు. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల మేధో వలస 'మేధో సంపద'గా మారుతుందని జవదేకర్ అన్నారు. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో పరిశోధనను ప్రోత్సహించటం కోసం ఈ నిధుల్ని ఖర్చు చేయనున్నట్టు ఆయన చెప్పారు.

తద్వారా విద్యార్థుల 'బ్రెయిన్ డ్రెయిన్-బ్రెయిన్ గెయిన్'గా మారుతుందన్నారు. 2018-19 నుంచి మూడేండ్లపాటు ప్రతి ఏడాది 1000 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇవ్వనున్నారు. మూడేండ్లలో గరిష్టంగా 3000మందికి ఈ పథకం ద్వారా లబ్ది చేకూర్చనున్నట్టు కేంద్రం తెలిపింది.



పవన్‌తో ఉండవల్లి భేటీ

- విభజన హామీలు...ఏపీకి కేంద్ర నిధుల కేటాయింపుపై చర్చ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం నిధుల కేటాయింపు, ఇప్పటి వరకు వచ్చిన నిధులు, ఖర్చు తదితర అంశాలపై చర్చించేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ భేటీ అయ్యారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో సుమారు గంటపాటు జరిగిన సమావేశంలో విభజన హామీల అమలు, సాధనకు ఏం చేయాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పవన్ కళ్యాణ్ విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై ప్రజలతో పాటు తనకూ అనుమానాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎప్పుడూ లేనంత గడ్డు పరిస్థితుల్లో ఉందని...ప్రజలకు అసలు నిజాలు తెలియాల్సిన అవసరముందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు.

నవ్వుపై నో జీఎస్టీ

- నాకు ఎవరి అనుమతి అవసరం లేదు : కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి



పనాజీ: పార్లమెంట్‌లో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి విమర్శల పరంపర కొనసాగుతూనే ఉంది. నవ్వుపై ఎలాంటి జీఎస్టీ లేదు...తాను నవ్వడానికి ఎవరి అనుమతి అవసరం లేదని ఆమె అన్నారు. ఆదివారం గోవాలోని పనాజీలో "డిఫికల్ట్ డైలాగ్స్" అనే సమావేశంలో రేణుక పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ... మోడీ చేసిన వ్యాఖ్యలు మహిళల పట్ల ఆయనకున్న అభిప్రాయాన్ని తెలియజేశాయని విమర్శించారు. ప్రధాని వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మహిళల నుంచి ఆమెకు మద్దతు లభించిందని తెలిపారు. ప్రస్తుత కాలంలో మహిళలు చాలా మారారని, వారెలా మాట్లాడాలో కూడా తెలుసుకున్నారనే విషయాన్ని మోడీ మర్చిపోయారని అన్నారు. ప్రజల్లో ఉన్నంతకాలం ప్రజల మద్దతు తనకుంటుందన్నారు. 'మహిళలను పురుషులతో సమానంగా ఎలా గౌరవించాలనే విషయంలో పార్లమెంటు సభ్యులను మనం విద్యావంతుల్ని చేయాల్సిన అవసరముందని' అన్నారు. ప్రస్తుతం మన సమాజం ఎలా ఉందో పార్లమెంటులో తెలుస్తున్నదని రేణుక అన్నారు. గత శుక్రవారం పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోడీ మాట్లాడే సందర్భంలో రేణుకాచౌదరి నవ్వడంపై 'రామాయణం సీరియల్ తర్వాత అలాంటి నవ్వు వినే అదృష్టం నాకు దక్కింది' అని ఆయన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.



ఏసీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దళితులపై దాడులు-అగ్రకుల పాలన గుర్తులు

భూపతి వెంకటేశ్వర్లు

కొత్త రాష్ట్రం, సరికొత్త పాలన స్వయం పాలనంటే సంబరపడ్డాం. దండిగా ఓట్లు వేసి గెలిపించిన నాటి నుంచి వరుసగా దళితులపై దాడులు జరుగుతున్నాయి. పాత మహబూబ్‌నగర్ జిల్లా పాతపల్లిలో మాదిగ యువకుడు వివాహం చేసుకొని అంజనేయస్వామి గుడిలోకి ప్రవేశిస్తే వారిపై దాడి చేసి గ్రామ బహిష్కరణ చేశారు. ఇక్కడి నుంచి మొదలైన అఘాయిత్యాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయి. ఈ ఘటన తరువాత మెదక్ జిల్లా సదాశివపేట మండలం ఎల్లారం గ్రామంలో దళితులను గ్రామంలోకి రానివ్వకుండా కంచె అడ్డంగా వేసి సాంఘిక బహిష్కరణ చేశారు. నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం తాడ్వాయి మండలంలో 150 ఎకరాల దళితుల భూమిని స్థానిక ఎమ్మెల్యే దర్జాగా కబ్జా చేసుకొని వారిపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపించారు. అలాగే ఆర్మూర్‌లో తళారి సత్యం చేపూరి రవిల హత్య, ఆదిలాబాద్ జిల్లా సారంగపూర్‌లో దళిత యువతి శైలజను గ్యాంగ్‌రేప్ చేసి చంపేయడం, కరీంనగర్ జిల్లా వీణవంకలో దళిత విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్, వరంగల్ జిల్లా ములుగులో గిరిజన విద్యార్థులైన ప్రియాంక, భూమికలను కిరాతకంగా హతమార్చడం, మంథనిలో మధుకర్ హత్య, కమలాపూర్‌లో రాజేష్ హత్య, నిజామాబాద్‌లో ఇజ్రాయిల్ హత్య, దళితుడిని ప్రేమించినందుకు కన్న తండ్రి చేతనే సజీవ దహనం చేయబడ్డ రోజా వంటి అమ్మాయి బలిదానం. ఇలాంటి ఘటనలు కన్నీరు పెట్టిస్తున్నాయి.

ఫిబ్రవరి 2న ఉదయం 8గంటలకే సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై సింగిడి వేసినట్టు 40 కార్లు 28 పార్టీల జెండాలు ఎవ్వరి కండువాలు వాళ్ల వేసుకున్నా.. ఆశయం మాత్రం "బహుముఖ పోరాటాలు నిర్వహిద్దాం. బహుజన రాజ్యాన్ని సాధిద్దాం" అన్న తపన కనిపించింది. తెలంగాణలో దళితులపై దాడులు, అడుగడుగునా వివక్ష ఇంకానా? ఇకపై సాగదు. దళితులపై దాడులు జరిగిన చిన్న కందుకూర్‌కు సాగిన సంఘీభావ యాత్ర కదం తొక్కుతూ పదం పాడుతూ దారి పొడవునా ధైర్యం నింపుతూ దళితులకు ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తూ "గోగుండాల్లారా ఖబర్దార్" అని సవాల్ విసురుతూ సాగింది. అంబేద్కర్‌కు దండలు వేసి దండంపెట్టి కదిలింది కందుకూర్ గ్రామానికి...

కందుకూర్‌లో ఏం జరిగింది?

యాదాద్రి భువనగిరి జిల్లాకు కూతవేటు దూరంలో ఉన్న కుగ్రామం చిన్న కందుకూర్. 155 దళిత కుటుంబాలు. తాతల నాటి ఆహారపు అలవాటు ఎద్దు మాంసం తినడం. పండుగనాడు కూడా పచ్చి పులుసుతో తినలేము కదా. ఆ రోజు జనవరి 14 తెల్లారితే సంక్రాంతి పండుగ. రాత్రి 2 గం.లు కూలీ నాలీ చేసి కూడబెట్టిన డబ్బులతో సంతలో చావుకు దగ్గరైన బక్క ఎద్దును కొనుక్కొని ఊరికి దూరాన అర్ధరాత్రి మాంసం పంచుకుంటున్నారు. అంతే రెక్కల చప్పుడు లేని రాబందుల్లా గో గుండాలు బైకులు, కార్లపై కర్రలు, ముఖానికి ముసుగులతో దళితులపై విరుచుకు పడ్డారు. దొరికినోళ్లను దొరికినట్టుగా చితక బాదారు. "మాదిగ లం... కొడుకుల్లారా! మీరు హిందువులా, తురుకోళ్ళురా? గొడ్డును కోసిన కత్తితోనే మాదిగల తలకాయలు నరుకుతం. గొడ్డు మాంసం ఎవరు తిన్నా జైల్లలో పెడుతం" అంటూ నానా బూతులు తిడుతూ పారిపోతున్నా పట్టుకొని కర్రలతో చితకబాదారు. కాళ్లు వేళ్ల పట్టుకున్నా కనికరించని గోగుండాలు కసితీరా కొట్టారు. మాంసాన్ని గోతిలో పాతిపెట్టించారు. దళితుల ఇండ్లపై పడి వ్యవసాయ ఆవుల్ని పట్టుకెళ్లి యాదాద్రి గోశాలలో వేశారు. "బతికితే హిందువుగా బతకండి. లేకపోతే పాకిస్తాన్ లేదా ఖబరాస్తాన్ వెళ్లండి ఖబర్దార్" అంటూ కర్రలతో కత్తులతో వీరంగం సృష్టించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితులైన దళితుల ఇండ్లపైనే దాడి చేసి లిక్కర్ బాటిల్స్ ఎత్తుకెళ్లారు. ఆ అరాచకానికి కారకులు రవిందర్‌రెడ్డి, సందీప్ అనే శావుకారి. వారు మాత్రం బలాదూర్‌గా తిరుగుతున్నారు. ఇటువంటి ఘటనలు ఉత్తరప్రదేశ్‌లోనే, బీజేపీ రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయి కానీ తెలంగాణలో ఇటువంటి ఘటనలా? యాదగిరి గుట్ట పేరు యాదాద్రిగా మార్చి పర్యాటక కేంద్రంగా, ఆధ్యాత్మిక నిలయంగా కేసీఆర్ ప్రకటించిన నాటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ ఊపిరిపోసుకుంది. వీటి ఆర్గనైజర్ రవిందర్‌రెడ్డి. వీళ్లకు అండగా ఎమ్మెల్యే, ఎంపీ, డీసీపీలు ఉన్నారు. అందుకే అగ్రకుల మతోన్మాద సర్పం కుబుసం విడిచి కోరలు చాస్తున్నది. ఇదే జిల్లాలో అంబోజు నరేష్, స్వాతిల రక్తపు మరకలు ఆరకముందే కాటేపల్లి గ్రామంలో గీత కార్మికులపై గ్రామ బహిష్కరణలు, చిన్న కందుకూర్‌లో గో గుండాల దాడులతో భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటున్న దళిత బహుజనులకు ఇరవై ఐదు పార్టీల నాయకుల ప్రసంగాలు, కదిలిన ఊరేగింపు. కలిసి తిన్న సహపంక్తి భోజనం. దళితులలో కొండంత ధైర్యాన్ని నింపింది. ఊరంతా దళితులకు అండగా నిలబడ్డారు. బాధితుల్లో కొండంత ఆత్మ విశ్వాసం నింపారు. మరోపక్క ఈ ఘటన అగ్రకుల పాలనలో దళిత, బహుజనులపై దాడులు ఎందుకు కొనసాగుతున్నాయి? అనే ప్రశ్నను లేవనెత్తింది.

వరుసగా దళితులపై దాడులు

కొత్త రాష్ట్రం, సరికొత్త పాలన స్వయం పాలనంటే సంబరపడ్డాం. దండిగా ఓట్లు వేసి గెలిపించిన నాటి నుంచి వరుసగా దళితులపై దాడులు జరుగుతున్నాయి. పాత మహబూబ్‌నగర్ జిల్లా పాతపల్లిలో మాదిగ యువకుడు వివాహం చేసుకొని అంజనేయస్వామి గుడిలోకి ప్రవేశిస్తే వారిపై దాడి చేసి గ్రామ బహిష్కరణ చేశారు. ఇక్కడి నుంచి మొదలైన అఘాయిత్యాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయి. ఈ ఘటన తరువాత మెదక్ జిల్లా సదాశివపేట మండలం ఎల్లారం గ్రామంలో దళితులను గ్రామంలోకి రానివ్వకుండా కంచె అడ్డంగా వేసి సాంఘిక బహిష్కరణ చేశారు. నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం తాడ్వాయి మండలంలో 150 ఎకరాల దళితుల భూమిని స్థానిక ఎమ్మెల్యే దర్జాగా కబ్జా చేసుకొని వారిపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపించారు. అలాగే ఆర్మూర్‌లో తళారి సత్యం చేపూరి రవిల హత్య, ఆదిలాబాద్ జిల్లా సారంగపూర్‌లో దళిత యువతి శైలజను గ్యాంగ్‌రేప్ చేసి చంపేయడం, కరీంనగర్ జిల్లా వీణవంకలో దళిత విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్, వరంగల్ జిల్లా ములుగులో గిరిజన విద్యార్థులైన ప్రియాంక, భూమికలను కిరాతకంగా హతమార్చడం, మంథనిలో మధుకర్ హత్య, కమలాపూర్‌లో రాజేష్ హత్య, నిజామాబాద్‌లో ఇజ్రాయిల్ హత్య, దళితుడిని ప్రేమించినందుకు కన్న తండ్రి చేతనే సజీవ దహనం చేయబడ్డ రోజా వంటి అమ్మాయి బలిదానం. ఇలాంటి ఘటనలు కన్నీరు పెట్టిస్తున్నాయి. వీటితోనే ఆగకుండా ఆర్మూర్ మండలంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయగా, రెంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి దళితులు తమ ఇండ్ల ముందు నుంచి ఊరేగింపు నిర్వహిస్తున్నారని కొంతమంది అగ్ర కులస్తులు, బీసీలు కల్సి దాడి చేయడం, భీమ్‌గల్ మండలం అట్లూర్ గ్రామంలో మాదిగల్ని సాంఘిక బహిష్కరణ చేశారు. పెద్దపల్లి జిల్లాలో పంట చేనుకు నీరు పెడుతున్న దళిత మహిళ కుటుంబాన్ని పోలీసులే స్టేషన్‌కు తీసుకెళ్లి దారుణంగా కొట్టారు.



ప్రజా సంఘాల నాయకులకు ఆవు మంసాన్ని పాతిపెట్టిన ప్రదేశాన్ని చూపిస్తున్న దళితులు

నేరేళ్ల సంఘటనలో మంత్రి గారి అండతో రెచ్చిపోయిన పోలీసులు థర్డ్ డిగ్రీని ప్రయోగించి అతి కిరాతకంగా వేధించి హింసించడం. ఆ దారుణం నుంచి తేరుకోక ముందే వేములవాడలో కడమంచి వెంకటేష్ అనే బుడిగజంగం కులానికి చెందిన అమాయకుడిని చేయని నేరానికి స్టేషన్‌కు తీసుకెళ్లి ప్రాణాలు పోయేలా చిత్రహింసలు పెట్టి, చనిపోయే స్థితిలో జైలుకు పంపించగా, జైలర్ అతని స్థితిని చూసి లోపలికి తీసుకోవడానికి నిరాకరించి ఆస్పత్రికి పంపించగా రక్తం కక్కుతూ మరణించడం మొదలైన క్రూరమైన సంఘటనలతో దళిత సమాజం భీతిల్లిపోతున్నది. ఈ దారుణమైన నేరాలలో మెజారిటీ నిందితులుగా ఉన్న వాళ్లు ఎవరని లెక్కలు తీస్తే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, పాలకుల అండదండలతోనే జరుగుతున్నాయని అర్థమవుతున్నది. నేరస్తులను శిక్షించకుండా ప్రభుత్వమే కాపాడుతుందా? అనే అనుమానం కలుగుతుంది. తెలంగాణలో నూతన రూపం సంతరించుకున్న నేటి పోలీసులే రాజ్యమేలుతున్నారా? అన్నట్టుగా పోలీసులు చెప్పినట్టే ఫిర్యాదులు రాయాలి. కేసులు పెట్టాలి. అవసరమైతే వెనక్కి తీసుకోవాలి. లేదంటే బెదిరింపులు. ఇటీవల నవీపేట మండలం అభంగపట్నం గ్రామంలో లక్ష్మణ్, రాజేష్ అనే దళితులు తనను నిలదీశారనే అహంతో భరత్‌రెడ్డి బీజేపీ నాయకుడు దళితులిద్దరినీ ఊరి శివారులో కట్టెలతో తరుముతూ, భూతులు తిడుతూ పులి ముందర లేడి పిల్లలవలే వణుకుతున్నా మునికాళ్ల మీద కూర్చోబెట్టి భూమికి ముక్కును రాయించాడు. ముడ్డి మీద కాళ్లతో తన్నాడు. రోడ్డు పక్కన మురికి నీటి గుంతలోకి ఆ యువకులను తోసివేసాడు. ఎముకలు కొరికే చల్లని బురద నీటిలో మునగమని ఆ యువకులను ఒడ్డు మీద ఉండి దుడ్డుకర్రతో బెదిరించాడు. ప్రాణ భయంతో బురద నీటిలో మునిగినప్పుడు ఆకాశం కన్నీళ్లు పెట్టుకుంది. భూమి సిగ్గుతో తల దించుకున్నది. పోలీసులు మాత్రం కనీసం చలించలేదు. పైగా పోలీసుల డైరెక్షన్‌లో చక్కటి కథ అల్లించి వల్లించారు. "మమ్ములను ఎవరూ అవమానించలేదు. సినిమా షూటింగ్ కోసం ముక్కు నేలకు రాసి బురద నీటిలో మునిగాం" ఈ మాట కోసం 24వేలు ఇస్తామని బాధితుల చేత బయపెట్టి బహిరంగంగా చెప్పగలిగినప్పటికీ ధనస్వామ్యం, దొరస్వామ్యం, ఇంత నిస్సిగ్గుగా సమాజం అవమానపడేలా నాటకానికి తెరలేపారు. దళితులను ఊళ్ల నుంచి వెలివేయవచ్చును. దళితులను చంపవచ్చును. చిత్రహింసలు పెట్టవచ్చును. ఘోరంగా అవమానించవచ్చును. రాజ్యం మౌనంగా ఉండటంలోనే మర్మం అర్థమవుతుంది. హక్కులు అమలుకాని చోట ఎవర్ని ఏమడగాలి. అమలు చేయమని అడగాలి. హక్కులను రక్షించుకోవడానికి పోరాటం కూడా ఒక హక్కు. బహుజన తెలంగాణ కోసం దళిత, బహుజన లెఫ్ట్ మిత్రులందరు ఒక్కటవుతున్నారు. దళిత బహుజనులపై దాడులు తెలంగాణలో ఎక్కడ జరిగినా అక్కడ ప్రత్యక్షమతున్నారు. బహుముఖ పోరాటాలు నిర్వహిస్తూ బహుజన రాజ్యం కోసం బాటలు వేస్తున్నారు.

సెల్ : 9490098343

గిరిజన పోరాట వీరుడు బిర్సాముండా

పెనుక ప్రభాకర్

బిర్సాముండా భారతీయ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు, జానపద నాయకుడు, ముండా గిరిజన జాతికి చెందినవాడు. 19వ శతాబ్ధం చివరి కాలంలో బ్రిటీష్ పాలనలో నేటి బిహార్, జార్ఖండ్ గిరిజన ప్రాంతంలోని మిల్లేరియన్ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్నారు. బిర్సాముండా చాలా ఆనందకరమైన బాల్యదశను గడిపాడు. బిర్సా తన మొదటి ప్రాయాన్ని తల్లిదండ్రులతో చల్కాడ్ వద్ద గడిపాడు. అతని చిరుప్రాయం సాధారణ ముండా బాలురకు భిన్నంగా ఏమీ లేదు. తన స్నేహితులతో మన్ను, దుమ్ముతో ఆడుతూ పాడుతూ ఎదిగాడనీ, ధడంగా అందంగా ఉండేవాడనీ, జానపదం ద్వారా తెలుస్తుంది. బాహుందా అడవిలో గొర్రెలు మేపేవాడు. కాలక్రమంలో ఎదిగేటప్పటికి అతనికి వేణు వాయిద్యంపై మక్కువ ఏర్పడింది. దాంట్లో ప్రావీణ్యం సంపాదించాడు. గుమ్మడికాయతో చేసిన, ఒక తీగ కలిగిన "తులియా" వాయిద్యాన్ని ఒక చేతిలో నడుముకు పిల్లనగ్రోవిని ధరించి సంచరిస్తుండేవాడు. అతని బాల్యదశలోని ఆనందకరమైన సమయమంతా ఆఖలా (గ్రామ నత్య మైదానం)లో గడిపాడు.



గిరిజన సమతా వ్యవస్థ, ఫ్యూడల్ రాష్ట్రంగా మార్పుచెందేందుకు బ్రిటీష్ వారి వలన కారణమైంది. గిరిజనులు తమ ఆదిమ సాంకేతికతతో చాలినంత సంపద ఉత్పత్తి సాధించలేకపోయేవారు. దాంతో ముఖ్యుల ద్వారా చోట నాగపూర్ నుండి గిరిజనేతర రైతులను గిరిజన ప్రాంతాల్లో స్థిరపడి వ్యవసాయం చేసుకునేందుకు గాను ఆహ్వానింపబడ్డారు. ఇది గిరిజన భూములు అన్యాక్రాంతం అయ్యేందుకు కారణమైంది. కొత్త తరగతి వారైన అధికారులు అత్యాశపరులు, ఇతరులు వాటిని స్వాధీనం చేసుకుందుకు ప్రయత్నించారు. 1856లో దాదాపుగా 600 మంది జాగీర్దార్లు ఒక గ్రామంలో మొదలుకొని 150 గ్రామాలను స్వాధీనం చేసుకున్నారు. 1874 నాటికి పాత ముండా అధిపతులు రైతుల నుండి దాదాపుగా భూములన్నీ లాగేసుకున్నారు. భూకా మందు వ్యవస్థను ప్రవేశపెట్టారు. కొన్ని గ్రామాల్లో ఆదివాసులు పూర్తిగా తమ యాజమాన్య హక్కులు కోల్పోయి, రైతు కూలీలుగా మిగిలిపోయారు.

అగ్రేరియాన్ జంట సవాళ్లయినా ఆటంకం, సంస్కతి మార్పులపై బిర్సా తన ముండా జాతి వారితో కలిసి నిరంతరంగా ఉద్యమించాడు. తన నేతత్వంలో అవి ఉవెత్తున సాగాయి. ఈ ఉద్యమంలో భూమి నిజమైన యజమానులైన ముండాలా హక్కుల గురించి చెప్పడమే కాక, మధ్య దళారులు, బ్రిటీష్ వారిని వెళ్లగొట్టింది. వంచనతో బిర్సాముండా 3 ఫిబ్రవరి 1900 కాలంలో పట్టుబడి, నమ్మకశ్యం కానీ రీతిలో 9 జూన్ 1900 సంవత్సరంలో రాంచి జైల్లో మరణించాడు. అతనికి కలరా వ్యాధి చిహ్నలేవి లేనప్పటికీ, బ్రిటీష్ ప్రభుత్వం మాత్రం కలరాతో బిర్సా చనిపోయాడని ప్రకటించింది. 25 సంవత్సరాల అతి తక్కువ జీవిత కాలం గడిపినప్పటికీ, అతడు గిరిజన మానసిక విధానంలో మార్పు తేగలిగాడు. గిరిజనులను చోటా నాగపూర్‌లో సమావేశపరిచి బ్రిటీష్ వారికి సింహ స్వప్నమయ్యాడు. కానీ అతని మరణంతో ఉద్యమం నీరుగారిపోయింది ఏమైనప్పటికీ ఆ ఉద్యమం రెండు విధాలుగా గుర్తుండిపోతుంది. మొదటిది వంచకులచే (డికున్) గిరిజన భూములను సులువుగా తీసుకునేందుకు వీలుపడని రీతిలో, చట్టాలను రూపొందించేందుకు గాను వలస పాలకులపై ఒత్తిడి తేగలిగారు. రెండవది అన్యాయాన్ని ఎదిరించే శక్తి గిరిజనులకు ఉందని, ఆ ఆగ్రహాన్ని వలస పాలకులపై చూపగలరని మరోసారి నిరూపించాడు. 15 నవంబరు 1875 జన్మించిన బీర్సా 9 జూన్, 1900లో మరణించాడు.

సెల్ :9494283038



ఆదర్శ పెండ్లీలు ఆ ఊరిలో పెక్కు

కిచ్చన్నగారి మహేశ్

- **కుల, మతాంతర వివాహాలతో ఆదర్శంగా నిలుస్తున్న భూంపల్లి**
- **నాటి నుండి నేటి వరకు సాఫీగా జీవనం**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం భూంపల్లి గ్రామంలో యువత కుల, మతాలకు అతీతంగా ఆదర్శ వివాహాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నది. తొలినాళ్లలో ప్రేమ నుంచి పెండ్లిలుగా మారాయి. అయితే అవి ఒకే కులంలో అంతర్లీనంగా జరిగినవికావు. కులాలు, మతాల సాంప్రదాయానికి భిన్నంగా జరిగినవే ఎక్కువ. ఇందులో కొందరు కుల కట్టుబాట్లలో జీవనం సాగిస్తున్నా, కొందరు మాత్రం కుల సాంప్రదాయానికి భిన్నంగా జీవనం కొనసాగిస్తున్నారు. ఇలా ఆదర్శ వివాహం చేసుకునే వారిని పౌర సమాజం అక్కున చేర్చుకోవాల్సి ఉంది. ఈ కుల, మత సాంప్రదాయాలను ధిక్కరించి, నైతిక విలువలు, మానవీయ సమానవీయ భావాజాలాన్ని నేటికీ కొనసాగించేందుకు ప్రధాన కారణాలను, అందుకు ఉపయోగపడిన చైతన్యాన్ని అందించిన ఆ సామాజిక విప్లవ స్ఫూర్తిని తెలుసుకోవడం కోసం నవ తెలంగాణ భూంపల్లి గ్రామాన్ని సందర్శించింది.





గతేడాది సమ్మేళనానికి హాజరైన ఆదర్శ దంపతులు, వారి పిల్లలు

శైలజ (కాపు) - తాళ్ల ప్రభాకర్ (పద్మశాలి). ఈ గ్రామంలో కిందికులాల అండతో తొలి ప్రేమపెండ్లి 1992లో చెప్పవచ్చు. గౌడ కుటుంబంలో విజయ, ముస్లిం మతంలోని సిరాజ్‌లు ప్రేమించి 1993లో పెండ్లి చేసుకున్నారు. స్వయం ఉపాధితో జీవనం గడుపుతున్నారు. విజయ కుటుంబాన్ని గౌడ కులం వాళ్లు బహిష్కరించారు. విజయ, సిరాజ్‌ల సహజీవనం నేటికీ బాగానే ఉంది. వడ్ల లక్ష్మి నర్సవ్వ - మల్లేశ్ ముదిరాజ్‌లు ప్రేమించుకుని 1995లో పెండ్లి చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు, మల్లేశం స్థానిక విద్యుత్ స్టేషన్‌లో ఉద్యోగం చేసుకుంటుండగా, నర్సవ్వ స్వయం ఉపాధితో జీవనం గడుపుతున్నారు. వంగరి విజయ పద్మశాలి, మల్లేశం ముదిరాజ్‌లు 1996లో వివాహం చేసుకున్నారు. ఈ రెండు కుటుంబాలను ఆయా కులాల వారు బహిష్కరించారు. ప్రేమించిన వారినే పెండ్లి చేసుకుని జీవించాలనే నైతిక విలువతో అనేక కష్టాలను ఈ రెండు కుటుంబాలు ముఖ్యంగా విజయ పద్మశాలి (తల్లిదండ్రులు-అన్నలు) కుటుంబం చిత్రహింసలను భరించి చివరకు ఓ విప్లవ పార్టీ అండతో విజయ పద్మశాలి-మల్లేశ్ ముదిరాజ్‌లు పెండ్లి చేసుకుని జీవిస్తున్నారు. వీరు స్వయం ఉపాధితో పాటు కూలీ చేసుకుంటున్నారు. ప్రస్తుతం వీరు నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు వలసవెళ్లారు. వీరి కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. ఆనాడు ఈ విజయ కుటుంబాన్ని ముదిరాజ్ కులం అక్కున చేర్చుకోవాలని కుల పెద్దలను, పెత్తందారులను జనశక్తి విప్లవ పార్టీ హెచ్చరించడంతో వారి సమస్య పరిష్కారమైంది.

1996 కాలంలో కర్నాల రమ-కొండల్‌రెడ్డి ప్రేమించుకోగా రెడ్డీలు అంగీకరించకపోగా వివాదాస్పదమైంది. విప్లవ పార్టీలు అండగా ఉండి కొండల్‌రెడ్డి, రమలకు పెండ్లి జరిపించారు. కొండల్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. రమ గృహిణి. వీరి జీవన క్రమం కూడా సాఫీగా సాగుతుంది. ఇందిరారెడ్డి - ఎల్లం గౌడ్‌లకు 2004లో పెండ్లి జరిగింది. వీరు స్వయం ఉపాధితో జీవిస్తున్నారు. రజిత పద్మశాలి - బక్కి సురేశ్ మాల కులాంతర వివాహం చేసుకున్నారు. రజిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, సురేశ్ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. స్వప్న గౌడ్ - ఎర్మని దుబ్బరాజం మాలకు 2004లో పెండ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు, స్వప్న గృహిణికాగా దుబ్బ రాజం స్వయం ఉపాధి చేసుకుంటూ జీవిస్తున్నారు. మంజుల మున్నూరు కాపు - రాజు ముదిరాజ్‌లు 2004లో పెండ్లి చేసుకున్నారు. ప్రయివేట్ స్కూల్‌లో ఉద్యోగం చేసుకుంటున్నారు. 2005లో రాధారెడ్డి - కుమ్మరి హరికృష్ణల పెండ్లి జరిగింది. వీరిరువురూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. చాకలి గౌతమి - నర్సింలు గౌడ్ 2006లో పెండ్లి చేసుకున్నారు. గౌతమి గృహిణి. నర్సింలు కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు.

ప్రవంతి కటికె - మధు వడ్ల. వీరి ప్రేమ పెండ్లి 2007లో జరిగింది. ప్రవంతి గృహిణిగా, మధు స్వయం ఉపాధితోపాటు సామాజిక, నాస్తిక ఉద్యమంలో పాల్గొంటున్నాడు. వీరి ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. నేటికీ ఉమ్మడి కుటుంబంలోనే జీవిస్తున్నారు. ముత్తన్నగారి జలెందర్‌రెడ్డి, భార్య మార్వాడి. వీరందరు స్థానికంగా కులాలు వేరైనా కుటుంబాలను ఒప్పించి సాంప్రదాయ పద్ధతిలో పెండ్లి చేసుకుని జీవిస్తున్నారు.



నాగరాజు - రేణుక



ఎల్లాగౌడ్ - ఇంది



శ్రీనివాస్ - సుజాత



మధు - ప్రవంతి

స్థానికంగా కొన్నికుటుంబాలు గ్రామాన్ని అంటిపెట్టుకున్నా, కొన్ని కుటుంబాలు గ్రామాన్ని వదిలి జీవనోపాధి లేని కారణంగా వివిధ ప్రాంతాల్లో జీవిస్తున్నారు. ఒకే కులం వాళ్లు అయినా ఒకరిద్దరు జంటలు బ్రాహ్మణ పంతులు లేకుండా స్టేజీ వేసుకుని ఆదర్శ వివాహం చేసుకుని జీవిస్తున్నారు. ఈ పెండ్లిలు మొదట విప్లవ పార్టీ అండతో జరగ్గా చాలా వరకు పెండ్లిలకు ఆటంకం కలగలేదు. అయితే చాకలి గౌతమి - నర్సింలుగౌడ్‌లు పెండ్లి చేసుకున్నాక జనాధిక్యత గల గౌడ కులం వాళ్లు ఈ జంటను అనేక ఇబ్బందులపాలు చేసినట్టు తెలిసింది.

కమ్మరి రేణుక - నాగరాజు గౌడ్ 2002లో పెండ్లి చేసుకున్నారు. వీరు ఇరువురు పోస్టు గ్రాడ్యుయేట్లు. నాగరాజు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. నేడు సామాజిక తెలంగాణ మహాసభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, రచయితగా కొనసాగుతున్నారు. రేణుక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ కథలు బహుజన స్త్రీ జీవన చిత్రణపై పరిశోధక విద్యార్థిగా ఉన్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు. ఒకరు 7వ తరగతి, మరొకరు 3వ తరగతి. సుజాత వడ్డెర - శ్రీనివాస్ బోయిలు వివాహం చేసుకున్నారు. శ్రీనివాస్ 2004లో గ్రామ సర్పంచ్‌గా, ఆ తర్వాత ఎంపీటీసీగా, నేడు జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారిగా నామినేట్ చేయబడ్డారు. గతంలో సుజాత విప్లవ పార్టీ సానుభూతిపరురాలు. ప్రస్తుతం గృహిణి. వీరికి ఒక్క కుమారుడు, వీరు కుల సాంప్రదాయానికి భిన్నంగా కుల నిర్మూలన దృక్పథంతో బ్రాహ్మణ పంతులు లేకుండా ఆదర్శంగా వందలాది మంది పాల్గొన్న సభలో పెండ్లి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దీనికి కారణం ఈ పెండ్లిలకు విప్లవ పార్టీ, పౌర సమాజం, మేధావులు, బుద్ధి జీవుల అండదండలు ఉండడం వల్లనే వీరికి ఆటంకం కలిగించలేదని అంటున్నారు. ఏదిఏమైనా భూంపల్లి గ్రామంలో యువత కుల, మతతత్వాలకు వ్యతిరేకంగా ముందుకు సాగుతున్నారు. ఇలాంటి గ్రామాలు దేశంలో లేదా రాష్ట్రంలో మరిన్ని నిర్మాణం అవ్వాల్సి ఉంది.

సెల్: 9550926524

వర్షం, మిల్లర్ వల్లే..

నాల్గో వన్డేలో భారత్ ఓటమిపై శిఖర్ ధావన్


శిఖర్ ధావన్


నవతెలంగాణ- జోహనెస్‌బర్గ్

దక్షిణాఫ్రికాతో శనివారం జరిగిన వన్డేలో వర్షం అంతరాయం కలిగించడం, డేవిడ్ మిల్లర్ దూకుడుగా ఆడటం వల్లే టీమిండియా విజయావకాశాలు దెబ్బతిన్నాయని ఓపెనర్ శిఖర్ ధావన్ అన్నాడు. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో గెలిచి, సిరీస్‌లో 1-3తో నిలిచింది. ఇక ఛేదనలో సౌతాఫ్రికా మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ మిల్లర్‌కు రెండు సార్లు జీవన దానాలు లభించాయి. మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ బౌలింగ్‌లో డేవిడ్ మిల్లర్ 6 పరుగులతో ఉండగా అతడి క్యాచ్‌ను శ్రేయాస్ అయ్యర్ వదిలేశాడు. మళ్లీ అదే ఓవర్లో మిల్లర్ బౌల్డయినప్పటికీ.. అది నోబాల్‌గా తేలడంతో అతను మరోసారి బతికిపోయాడు. జీవన దానాలు లభించిన ఉత్సాహంలో మిల్లర్ దూకుడు పెంచాడు. 28 బంతుల్లోనే 39 పరుగులు చేశాడు. నాల్గు ఫోర్లు, రెండు సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు.

ఈ విషయమై మ్యాచ్ అనంతరం మీడియాతో గబ్బర్ మాట్లాడుతూ.. 'మిల్లర్ క్యాచ్‌ను చేజార్చుకోవటం, వికెట్ తీసిన బంతి నోబాల్‌గా తేలడం మా ఓటమికి ప్రధాన కారణాలు. ఈ రెండు పొరపాట్లు మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చేశాయి. దానికి ముందు వరకు మా జట్టుకు మెరుగైన విజయవకాశాలున్నాయి. ఇక మరో కారణం వర్షం. చినుకుల కారణంగా మా స్పిన్నర్లు రాణించలేకపోయారు. తొలి మూడు మ్యాచుల్లో తిప్పినట్టు మా స్పిన్నర్లు బంతిని తిప్పలేకపోయారు. బంతి తడిచినప్పుడు బౌలింగ్ అనుకున్నదాని కంటే భిన్నంగా ఉంటుంది' అన్నాడు. రెండు సార్లు వర్షం రావడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 28 ఓవర్లకు కుదించారు. అంతకు ముందు భారత్ ఇన్నింగ్స్‌లోనూ వరుణుడు పలకరించినా, ఓవర్ల కుదింపు జరుగలేదు. కోహ్లి సేన ఏడు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. 'ఈ పిచ్‌పై సాయంత్రం వేళలో బంతి బాగా తిరుగుతుందని మేం తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాం. ఆ సమయంలో వీచే గాలుల ప్రభావం సైతం బౌలింగ్ మీద ఉంటుంది. మా ఇన్నింగ్స్‌లో వర్షం రావటంతో పరుగుల సాధనలో తేడా వచ్చేసింది. నేను ఔట్ అయ్యాక పరుగులు చేయటం కష్టంగా మారింది. అయినప్పటికీ మా టీమ్ రాణించారు. ఇక సఫారీల ఇన్నింగ్స్‌లో రెండు సార్లు వర్షం రావడంతో ఔట్‌ఫీల్డ్ అంతా చిత్తడిగా మారింది. దానికి తోడు మిల్లర్ చాలా బాగా ఆడాడు. అదష్టవశాత్తూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని మ్యాచ్ గమనాన్ని మార్చేశాడు. మా యువ స్పిన్ ద్వయం కుల్దీప్, చాహల్ ఇప్పటి వరకు చాలా మంచి ప్రదర్శనలు చేశారు. వారికి మా మద్దతుగా ఎల్లవేళలా ఉంటుంది. ప్రతి ఒక్కరి కెరీర్‌లోనూ ఇలాంటి రోజులు వస్తాయి. సాధారణంగా మా స్పిన్నర్లు నోబాల్‌లు వేయరు.' అని గబ్బర్ వివరించాడు. డెత్ ఓవర్ స్పెలిష్టులు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్‌లకు ఆఖరి ఓవర్లలో అవకాశం ఇవ్వకపోవటంపై స్పందిస్తూ.. కోహ్లి నిర్ణయాన్ని వెనకేసుకొచ్చాడు. ' స్పిన్నర్లు వికెట్లు తీస్తారని మా కెప్టెన్ భావించి ఉంటాడు. అందుకే భువి, బుమ్రాకు బంతి ఇవ్వలేదు. కొన్ని నిర్ణయాలు రిస్క్ తీసుకుని అమలు పరుస్తాం. అయితే ప్రతిసారి సానుకూల ఫలితం రాకపోవచ్చు. అది సహజం. నాల్గో వన్డేలో జరిగిందదే. ఛేదనలో వికెట్లు కూల్చటం చాలా ప్రాముఖ్యం ఆ విషయంలో మేం విఫలమయ్యాం. నా వందో మ్యాచులో వంద పరుగులు చేయడం చాలా సంతోషం. చక్కటి ఇన్నింగ్స్ ఆడగలిగాను. ప్రత్యర్థులు కట్టడి చేయాలని చూసినా.. నా లయను కొనసాగించాను' అని ధావన్ తెలిపాడు.

కోహ్లి నైరాశ్యం

తమకు గెలిచే అర్హత లేదన్న టీమ్ ఇండియా సేనాని


విరాట్ కోహ్లి

జోహనెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో వన్డేలో భారత్‌కు గెలిచే అర్హత లేదని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. ఆతిథ్య సఫారీ జట్టు చేతిలో ఓడిన తీరుపై అతడు అసంతప్తి వ్యక్తం చేశాడు. వర్షం వల్ల మ్యాచ్‌కు రెండు సార్లు అంతరాయం కలగటంతో మ్యాచ్‌ను కుదించగా, లక్ష్యాన్ని ఛేదించటంలో సఫారీలు సఫలమయ్యారు. మ్యాచ్ అనంతరం కోహ్లి మాట్లాడుతూ..' లక్ష్యాన్ని కుదించడంతో ఈ వన్డే ఓ టీ20 మ్యాచ్‌ను తలపించింది. మాకు అనుకూలంగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోలేకపోయాం. మేము మ్యాచ్‌లో గెలుపొందేందుకు అనర్హులం' అని ఆవేదన వ్యక్తం చేశాడు. మ్యాచ్‌లో వచ్చిన సదవకాశాలను పోగొట్టుకోకూడదు. ప్రత్యర్థులను కట్టడి చేయాల్సిన తరుణంలో ఒకే ఓవర్లో డేవిడ్ మిల్లర్ రెండుసార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో విరాట్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఛేదనలో 6 పరుగుల వద్ద క్యాచ్ మిస్సవ్వగా, 7పరుగుల వద్ద చాహల్ నోబాల్ విసిరాడు. ఈరెండు అవకాశాలే మ్యాచ్‌ను మలుపుతిప్పాయి.

సఫారీలకు జరిమానా

- స్లో ఓవర్ రేటు కారణంగా మ్యాచ్ ఫీజులో కోత

జోహానెస్‌బర్గ్: భారత్‌తో జరిగిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) జరిమానా విధించింది. శనివారం వాండరర్స్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత టీమిండియా బ్యాటింగ్ చేసింది. ఆసమయంలో నిర్ణీత సమయంలో 50 ఓవర్లు బౌలింగ్ చేయాల్సి ఉండగా, ఒక ఓవర్ ఆలస్యంగా సఫారీలు బౌలింగ్ చేశారు. ఇందుకు గానూ ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఆతిథ్య జట్టుపై జరిమానా విధించారు.

ఐసీసీ నిబంధనల ప్రకారం స్లో ఓవర్ రేట్ కారణంగా సఫారీ జట్టులోని ప్రతి ఆటగాడికి వారి మ్యాచ్ ఫీజులో 10శాతం, కెప్టెన్‌కు 20శాతం కోత విధించబడుతుంది. మ్యాచ్ ముగిసిన అనంతరం స్లో ఓవర్‌రేట్ కారణంగా జరిమానా విధిస్తున్నట్లు మ్యాచ్ రిఫరీ ప్రతిపాదించగా.. దక్షిణాఫ్రికా తాత్కాలిక కెప్టెన్ మార్‌క్రమ్ ఎలాంటి వాదనలు చేయకుండానే అంగీకరించాడు.

శివ కేశవన్ వీడ్కోలు

- లూగ్ విభాగంలో 34వ స్థానం
- శీతాకాల ఒలింపిక్స్

పియాంగ్‌చంగ్ : భారత్ వింటర్ స్పోర్ట్స్ ఆటగాడు శివకేశవన్ ఆదివారం తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాలుగా భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన శివ తాజా ఒలింపిక్ గేమ్స్‌లో 34వ స్థానంలో నిలిచాడు. శివ ఒలింపిక్స్‌లో పాల్గొనటం ఇది ఆరోసారి. మొత్తం 40 మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీలో తొలి మూడు రౌండ్లకే శివ పరిమితమయ్యాడు. 36 ఏండ్ల శివ మూడో ప్రయత్నంలో 1,344 మీటర్ల ట్రాకును 48.9 సెకన్లలో స్లైడ్ చేసి వ్యక్తిగత అత్యుత్తమ 30వ స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా 34వ స్థానంలో నిలిచాడు. టాప్ 20లో లేని కారణంగా తదుపరి రౌండ్లలో



తలపడే అవకాశాన్ని కోల్పోయాడు. ఫినిషింగ్ గీతను దాటిన తర్వాత తన స్లైడింగ్ బోర్డ్‌ను భారత అభిమానులవైపు చూపిస్తూ చివరిసారిగా అభివాదం చేసిన శివ దరహాసంతో కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. 2006 ఇటలీలో జరిగిన శీతాకాల ఒలింపిక్స్‌లో శివకెరీర్ అత్యుత్తమ 25వ స్థానంలో నిలిచాడు.

శుభ్‌మన్ అజేయ శతకం

- కర్నాటకపైపంజాబ్ విజయం
- విజయ్ హజారే ట్రోఫీ



ఆలూర్ (కర్నాటక) : టీమ్ఇండియా టెస్టు బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్ శతకం వృథా అయింది. కర్నాటక నాల్గు పరుగుల తేడాతో పంజాబ్ చేతిలో ఓడిపోయింది. విజయ్ హజారే ట్రోఫీ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగిన గ్రూప్ ఏ మ్యాచ్‌లో అండర్ 19 ప్రపంచ కప్ స్టార్ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్ (123 నాటౌట్, 122 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ శతకంతో చెలరేగాడు. ఔట్ ఫీల్డ్ తడిగా మారటంతో మ్యాచ్‌ను 42 ఓవర్లకు కుదించగా.. నిర్ణీత ఓవర్లలో పంజాబ్ మూడు వికెట్ల నష్టానికి 269 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. మన్‌దీప్ సింగ్ (64, 76 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. పంజాబ్ కెప్టెన్ యువరాజ్ సింగ్ (36), గుర్‌క్రీత్ సింగ్ మన్ (35 నాటౌట్)లు రాణించారు. ఇక ఛేదనలో కర్నాటక ఆదిలోనే ఓపెనర్ కరున్ నాయర్ వికెట్ పోగొట్టుకున్నది. అయినా వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన రాహుల్ (107) జట్టు నమ్మకాన్ని కోల్పోనివ్వలేదు. పవన్ దేశ్‌పాండే (53) హాఫ్ సెంచరీ మెరుపులతో కర్నాటక గెలుపు సాధ్యమయ్యేదే. కానీ చివరి ఓవర్లలో పరుగుల వేగం మందగించటంతో ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఓటమి తప్పలేదు. పంజాబ్ బౌలర్లలో సిద్ధార్థ్ కౌల్ మూడు, బైరీందర్ సింగ్ రెండు వికెట్లు తీసుకున్నారు. మయానక్ మకరంద్, అభిషేక్ శర్మలకు చెరో వికెట్ దక్కింది. గ్రూప్ ఎ లో కర్నాటక అగ్రస్థానంలో ఉండగా.. రైల్వేస్, పంజాబ్ జట్టు వరుసగా రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఇక గ్రూప్ డి లో 12 పాయింట్లతో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న హైదరాబాద్ నేడు జమ్ము కశ్మీర్ జట్టుతో తదుపరి లీగ్ మ్యాచ్ ఆడనున్నది.

భారీ పద్దులు.. అవినీతికి పీటలు...

- పరపతున్న కాంట్రాక్టర్లకే బిల్లులు
- లేదంటే అంతే సంగతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న భారీబడ్జెట్లు.. రాష్ట్రంలో పరోక్షంగా అవినీతికి పెద్దపీట వేస్తున్నాయా..? అంటే అవుననే అంటున్నాయి అధికారవర్గాలు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ హయాం నుంచి భారీబడ్జెట్ల ప్రహసనం కొనసాగతూ వస్తున్నది. లక్ష కోట్లనే మాట.. ఇప్పుడు లక్షన్నర కోట్లకు చేరింది. ఈ నేపథ్యంలో రాబోయే బడ్జెట్ ఏకంగా రూ.2 లక్షల కోట్లకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ భారీ పద్దులే ఇప్పుడు అవినీతికి ఊతమిస్తున్నాయని సమాచారం. వాస్తవ ఆదాయాలు, రాబడులను పరిగణనలోకి తీసుకోని రాష్ట్ర ప్రభుత్వం.. భారీ స్థాయిలో పద్దులను ప్రవేశపెట్టి ప్రజల్లో అంచనాలను రెట్టింపు చేస్తున్నది. పైగా నెలకోసారి ముఖ్యమంత్రో, ఆర్థికమంత్రో, ఇతర ఉన్నతాధికారు



లో తెలంగాణ ధనిక రాష్ట్రం, మిగులు రాష్ట్రమంటూ ప్రకటిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో వివిధ నిర్మాణ పనులను నిర్వర్తిస్తున్న కాంట్రాక్టర్లు సైతం బడ్జెట్లను చూసి ఆశలు పెంచుకుంటున్నారు. కానీ రాబడుల విషయంలో సర్కారు తన అంచనాలను అందుకోలేకపోవ టంతో నిధుల విడుదల్లోను, బిల్లుల చెల్లింపులో నూ ఇబ్బందులేర్పడుతున్నాయి. గత మూడేండ్ల కాలంలో నిర్వహించిన వివిధ పనులకుగాను ఇప్పటి వరకూ బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. దీంతో వందల సంఖ్యలో ఉన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించటం ప్రభుత్వానికి కత్తిమీద సామే అవుతున్నది. మరోవైపు బిల్లుల కోసం కాంట్రాక్టర్లు సచివాల యం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ పరిణా మాల వల్ల కొందరు అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో ఉన్నత స్థాయిలో చర్చిం చకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లులు చెల్లిం చొద్దంటూ ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. కానీ అర్థబలం, పరపతి ఉన్న కాంట్రాక్టర్లకు ఈ నిబంధ నలేం వర్తించటం లేదు. వారు తమ బిల్లులను బ్రహ్మాండంగా రాబట్టుకుంటున్నట్టు తెలిసింది. ఇందుకోసం వారు డబ్బును ఎరగా వేస్తున్నట్టు తెలిసింది. ఉన్నతస్థాయి నుంచి కిందిస్థాయి వరకు ఈ వ్యవహారం కొనసాగుతున్నట్టు సమాచారం.

అయినప్పటికీ ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కొందరు కాంట్రాక్టర్లు తమకు రావాల్సిన బిల్లుల పరిస్థితి గురించి తెలుసుకునేందుకు సచివాలయానికి వచ్చారు. 'డబ్బులు విడుదల చేయాలంటూ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెద్దోళ్లు పట్టించుకోవటం లేదు...' అని ఈ సందర్భంగా వారిలో ఒకరు ఆవేదన వ్యక్తం చేయటం గమనార్హం. మొత్తం మీద భారీ బడ్జెట్లతో ఇటు ప్రజల్లోను, అటు కాంట్రాక్టర్లలోనూ ఆశలు రేపుతున్న సర్కారు.. ఆ స్థాయిలో నిధులు విడుదల చేయకపోవటంతో అంతిమంగా అనేక పర్యవసానాలు చోటు చేసుకుంటున్నాయని ఆర్థికశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అసోంలో రైలు ఢీకొని ఐదు ఏనుగులు మృతి



న్యూఢిల్లీ: వేగంగా వెళ్తున్న ఒక రైలు ఢీ కొనడంతో ఐదు ఏనుగులు మృతి చెందిన సంఘటన అసోంలోని నాగోన్ జిల్లాలో శనివారం జరిగింది. గువహతి- సిల్చార్ పాసింజర్ రైలు హవాయ్ పూర్ రైల్వే స్టేషన్‌ను దాటుకుని వెళ్తున్న సమయంలో ఆప్రాంతంలో ఉన్న ఏనుగుల గుంపు అడ్డుగా రావడంతో ఈ సంఘటన జరిగిందని రైల్వే అధికారి పిజె శర్మ తెలిపారు.ఈ సంఘటనలో నాలుగు ఏనుగులు అక్కడికక్కడే మృతి చెందాయని తెలిపారు. గాయపడ్డ మరో ఏనుగు కూడా చనిపోయింది. అయితే ఈ ఘటనలో ప్రయాణికులు గాయపడనప్పటికీ రైలు ఇంజను పట్టాలు తప్పిందని ఆయన చెప్పారు. విషయం తెలుసుకున్న వెంటనే అధికారులు ప్రత్యేక రైలును ఏర్పాటు చేసి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించినట్లు చెప్పారు. ఏనుగుల స్థావరంగా గుర్తించబడిన ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. అస్సాంలో ప్రమాదాల కారణంగా మృతి చెందుతున్న ఏనుగుల సంఖ్య పెరిగిపోతున్నది. 2016లో 110 ఏనుగులు, 2015లో 118 ఏనుగులు మృతి చెందినట్టు రాష్ట్ర అటవీ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

నగరం.. ట్రాఫికర్

నగరాలు, పట్టణాల్లో తీవ్రమవుతోన్న ప్రయాణ కష్టాలు

- ప్రచారార్భాటాల కోసం.. 'గాలి రిక్షా'లంటూ పాలకుల గాలి మాటలు
- 'ఎయిర్ క్రాఫ్ట్ లలో డ్రోన్ టెక్నాలజీ'పై డీజీసీఏ నిషేధం
- ఐదేండ్ల కాలంలో.. హైదరాబాద్‌లో 20కి.మీ తగ్గిన వాహన వేగం
- సరికొత్త ప్రణాళికలతో బెంగళూరులో ట్రాఫిక్ కి చెక్
- "2050 నాటికి దేశంలోని మొత్తం జనాభాలో సుమారు 60శాతం ప్రజలు..

(కడవేర్గు)

నగరాలు/పట్టణాల్లోనే నివాసం ఉంటారని అంచనా.దీంతో రానున్న కాలంలో మెట్రో నగరాలలోనే కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో సైతం ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రతరం కానున్నాయ"ని పట్టణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ లెక్కలేసి చేతులుదులుపుకుంటున్నది. ఐతే, జనాభా పెరుగుదలతో తీవ్రమవనున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే విషయంలో మాత్రం ఆయా శాఖలు ఇంకా కదలడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గాలి మాటలేనా?

బీజేపీ పాలకుల మాటలు వట్టివేనని.. ప్రచారం, ఆర్భాటాల కోసం డాంబికాలకు కొదవేమీ లేదని మరోసారి రుజువైంది. నెలరోజుల క్రితం.. "నగరాల్లో ట్రాఫిక్ అవస్థల బారి నుంచి బయటపడి, ప్రజలు సుఖంగా ప్రయాణించేలా మన దేశంలో త్వరలోనే డ్రోన్ టెక్నాలజీ సాయంతో నడిచే ఎయిర్ రిక్షాలు(గాలి రిక్షాలు) అందుబాటులోకి రానున్నాయ"ని జంషెడ్ పూర్ నగరంలోని జేఆర్డీ టాటా స్పోర్ట్సు కాంప్లెక్స్ లో టాటా స్టీల్, సీఐఐ సంయుక్తంగా ఏర్పాటుచేసిన సదస్సులో కేంద్ర విమానయానశాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా ఆర్భాటంగా వెల్లడించారు. అంతేనా, ఆకాశంలో ప్రయాణించడానికి అయ్యే వ్యయం ఆటోరిక్షాల్లో ప్రయాణానికి అయ్యే వ్యయం(4రూ./కి.మీ)కంటే తక్కువని ఆయన సెలవిచ్చారు. డ్రోన్ టెక్నాలజీతో నడిచే ఎయిర్ రిక్షాలు నడిపేందుకు వీలుగా తమ విమానయాన మంత్రిత్వ శాఖ నిబంధనలు రూపొందిస్తుందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. నెలరోజులు గడిచాయో లేదో.. మొన్నటికి మొన్న పార్లమెంట్ సమావేశాల్లో సభ్యులు అడిగిన ఓప్రశ్నకు సమాధానమిస్తూ.. "డ్రోన్ల పరిజ్ఞానంతో నడిచే ఎయిర్ రిక్షాలపై ఎలాంటి ప్రతిపాదన మా మంత్రిత్వశాఖ పరిశీలనలో లేద"ని సాక్షాత్తూ అదే మంత్రి తెలపడం గమనార్హం. కాగా, వైమానిక రంగంలో అన్ మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ లేదా డ్రోన్లను ఉపయోగించరాదని ఏవియేషన్ రెగ్యులేటర్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సంస్థ 2014, అక్టోబర్ లోనే



పేర్కొనడం ఆలోచించాల్సిన విషయం. నిజానిజాలు, సాధ్యాసాధ్యాలు తెలుసుకోకుండా ప్రచారార్భాటాల కోసం ప్రకటనలు చేయడం నాయకులకు సరి కాదని, ఎయిర్ రిక్షాలు తీసుకురాకున్నా.. ఉన్న రోడ్లను, వాహనాలను, ట్రాఫిక్ నియంత్రణను సరిగ్గా అమలుచేస్తే చాలని సగటు నగరవాసులు కోరుకుంటున్నారు.

ట్రాఫిక్ సుడిలో భాగ్యనగరం..

ఎయిర్ రిక్షాల మాట అటుంచితే, కోటికి పైగా జనాభాతో విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ మరింత జటిలం అవుతున్నది. మెట్రో కూత మొదలైనప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో మెట్రో పనులు ఇంకా పూర్తికాకపోవడం, ప్రజారవాణా వ్యవస్థ పూర్తిస్థాయిలో అందరికీ సరైన సమయాల్లో, సౌకర్యవంతంగా అందకపోవడం వంటి కారణాలతో ప్రజలు సొంత వాహనాలపై మక్కువ చూపుతున్నారని రవాణరంగ నిపుణులు చెబుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలో మొత్తం వాహనాల సంఖ్య యాభై లక్షలు దాటిందని, ఇందులో దాదాపు 75శాతం వాటా ద్విచక్రవాహనాలదేనని తేలింది. అంటే, నగరంలో నివసిస్తున్న ప్రతీ ఇద్దరిలో ఒకరికి సొంత వాహనం ఉందన్న మాట! ఇక, బెంగుళూరు, చెన్నై నగరాలతో పోలిస్తే మన రోడ్ల విస్తీర్ణం తక్కువగా ఉండటం.. ఆ ఉన్న రోడ్లు కూడా అధ్వానంగా తయారవుతుండటంతో ట్రాఫిక్ వలయాలు నగరవాసులకు ప్రళయాలను తలపిస్తున్నాయి.

ట్రాఫిక్ వలయంలో భాగ్యనగరం - విశేషాలు

- ఐదేండ్ల క్రితం.. హైదరాబాద్ లో వాహనాలు గంటకు 30-40 కి.మీ.ల వేగంతో నడిచేవి. ప్రస్తుతం, వాహనాల వేగం గంటకు 16-19 కిలోమీటర్ల మేర తగ్గడాన్ని చూస్తే, మన నగరంలో ట్రాఫిక్ ఎంతగా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.
- హైదరాబాద్ నగరంలో సుమారు నలభై లక్షల మంది పౌరులను గమ్యస్థానాలకు చేర్చుటకు ప్రజారవాణా కింద ప్రస్తుతం నడుస్తోన్న బస్సులు కేవలం 3850 మాత్రమే!
- హైదరాబాద్ నగరంలో రోడ్ల నిష్పత్తి 6.06 శాతం ఉండగా, చెన్నై, బెంగుళూరులో ఇది 8శాతంగా ఉన్నది.

ట్రాఫిక్ కి చెక్ పెడుతోన్న బెంగుళూరు..

రోజురోజుకూ పెరుగుతోన్న ట్రాఫిక్ చిక్కులకు క్రమక్రమంగా పరిష్కార మార్గాలను కనుగొనడంలో బెంగుళూరు నగరం కాస్త ముందున్నది. నగరంలో సగానికి పైగా ట్రాఫిక్ చిక్కులకు కారణమైన స్వంత వాహన వినియోగాన్ని తగ్గించుటకు.. ప్రజలకు, ఉద్యోగులకు, ఆఫీసు, కాలేజీ సమయాలకనుగుణంగా సుమారు 6000 బస్సులను, పదుల సంఖ్యలో రైళ్ళను అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంచుతూ, ప్రణాళికా బద్ధంగా నడుపుతూ.. ప్రజారవాణాను అందరికీ చేరువచేసేలా చేస్తూ.. ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడుతున్నారు అక్కడి అధికారులు. ఇక, జనాభా, వాహనాల వినియోగానికి అనుగుణంగా రోడ్ల విస్తరణ, సీసీ కెమెరాలతో సిగ్నలింగ్ సరళీకరణ వంటి పద్ధతులు అక్కడి ట్రాఫిక్ నియంత్రణలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. అంతేనా, ఎయిర్‌పోర్టు నుంచి బెంగుళూరు సిటీ ప్రయాణానికి తీసుకుంటున్న సుమారు 2-3గంటల సమయంవల్ల విదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు ఇబ్బందిగా మారుతుండటాన్ని గమనించిన అక్కడి అధికారులు.. నగరంలో హెలీటాక్సీ సేవల ప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందుకుగాను తంబి ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థకు పర్మిషన్ ఇచ్చినట్టు తెలుస్తోంది. వచ్చే వారంలో ఈ సేవలు ప్రారంభం కానుండటం విశేషం.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-00020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.